అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 30-08-2024 సమగ్ర తెలుగు దినపత్రిక



ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచండి

మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

ప్రజారవాణా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలి

మెట్రో బోగీలను ఆరుకు పెంచాలి : సీఎం రేవంత్‌రెడ్డికి తమ్మినేని లేఖ

వివరాలు 11లో..

సంపుటి : 10 | సంచిక : 195 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

అక్రమార్కులపై హైడ్రా కొరడా..

చెరువుల్లో అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు

సీఎం, సీఎస్, కమిషనర్ ప్రత్యేక దృష్టి

- నిరంతరం సమీక్షలు, అధికారులతో సమావేశాలు
- హైడ్రా పేరిట అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు : సీఎం
- ఏసీబీ, విజిలెన్స్‌లు దృష్టి పెట్టాలంటూ ఆదేశం
- హైడ్రాకు మరిన్ని అధికారాలు
- ఓఆర్ఆర్ పరిధిలోని ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత కూడా ఆ సంస్థకే : సీఎస్ శాంతి కుమారి వెల్లడి
- సీఎం సోదరుడికీ నోటీసులు
- నిబంధనల ప్రకారం లేకుంటే కూల్చేయండి: తిరుపతి రెడ్డి
- హైడ్రాకు రూ.25 లక్షల విరాళమిచ్చిన ఎంపీ అనిల్ యాదవ్

గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) ఆక్రమణదారులపై కొరడా ఝుళిపిస్తున్నది. ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభిస్తుండటంతో అది జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నది. తన, మన అనే భేదం లేకుండా ఆక్రమణ అని తేలితే చాలు యాక్షన్లోకి దిగి పని పూర్తి చేస్తోంది. గంటల వ్యవధిలో పెద్ద పెద్ద భవంతులను నేలమట్టం చేస్తోంది. ఫలితంగా భూ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎక్కడి నుండి వచ్చి తమ అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తారోనని భయంతో ఆక్రమణదారులు గజగజ వణికిపోతున్నారు. సామాన్య ప్రజల నుంచి బడా నేతలు, సెలబ్రెటీల వరకు అక్రమ కట్టడాలను కూల్చేస్తుండటంతో ప్రజలు హైడ్రాకు జేజేలు పలుకుతున్నారు.





అధికారులతో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రేటర్ పరిధిలో ఒకప్పుడు 200కు పైగా ఉన్న జలాశయాలు నేడు సగం కూడా కనిపించని పరిస్థితి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న హైడ్రా చెరువులను రక్షించేందుకు నడుం కట్టింది. ఈ దెబ్బకు ఆక్రమణదారులు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు తమ మీద పడుతుందోననే ఆందోళన వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటివరకు 18 ప్రాంతాల్లో చిన్నా పెద్దవి కలిపి దాదాపు 200కు పైగా నిర్మాణాలను అది కూల్చేసి నట్టు సమాచారం. 50 ఎకరాల వరకు ప్రభుత్వ, చెరువుల భూములను పరిరక్షించినట్టు హైడ్రా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. విద్య, వైద్య సంస్థల ముసుగులో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు చెరువులు, కుంటలను ...10లో

షోకాజ్ నోటీసులుగా మార్చండి
ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం 10లో.



అపోహలతో విచారణను బదిలీ చేయలేం

'ఓటుకు నోటు' కేసులో సుప్రీం వ్యాఖ్య

కవిత బెయిల్‌పై సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన ధర్మాసనం

రాజకీయ పార్టీలతో చర్చించి బెయిల్, తీర్పులిస్తున్నామా ? అంటూ నిలదీత

తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అని 'ఓటుకు నోటు' కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే ప్రస్తుత స్థితిలో ఓటుకు నోటు విచారణ బదిలీ పిటిషన్‌ను ముందస్తుగా రద్దు చేయడం లేదని స్పష్టం చేసింది. అలాగే ఢిల్లీ మద్యం కేసులో కవిత బెయిల్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం తప్పుబట్టింది. ఈ వ్యవహారంలో సీఎంను మందలించింది. తదుపరి విచారణను సోమవారం (సెప్టెంబర్ 2)కు వాయిదా వేసింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని, అందుకే ఆ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు, మాజీ డిప్యూటీ సీఎం మహ్మద్ అలీ, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో ...11లో

నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతి



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా దండకారణ్యంలో గురువారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో మావోయిస్టుల మెటీరియల్‌తో సహా ఆయుధాలు స్వాధీనం ...11లో

కవితను చూసి కేసీఆర్ భావోద్వేగం

ఎర్రవల్లి గెస్ట్‌హౌస్‌కు ఎమ్మెల్సీ



నవతెలంగాణ-మర్కుక్


మాజీ సీఎం కేసీఆర్ తన కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఎర్రవల్లి గెస్ట్‌హౌస్‌లో నివాసముంటున్న తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్ దగ్గరికి గురువారం కవిత, ...11లో

మోడల్ రాష్ట్రంలో ఇండ్లపైకి మొసళ్లు..

వర్ష బీభత్సంతో గుజరాత్ అతలాకుతలం



- 40కు పెరిగిన మృతుల సంఖ్య
- నీట మునిగిన పలు ప్రాంతాలు, రోడ్లు, ఇండ్లు
- 939 రహదారులు ,90కిపైగా రైళ్లు బంద్
- దాదాపు 40 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ట్రాఫిక్, విద్యుత్, రైల్వే సర్వీసులకు అంతరాయం
- సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తో పాటు త్రివిధ దళాలు



వడోదరాలో..

దేశానికే గుజరాత్ మోడల్ అంటూ ప్రధాని మోడీ చెబుతుంటారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు గుజరాత్‌ను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఇంటి పై కప్పులపై మొసళ్లు తిరుగుతున్నాయి. వర్షబీభత్సంతో జనం బిక్కుబిక్కుమంటూ.. కాపాడాలంటూ దీనంగా ప్రాధేయపడుతున్నారు.

గాంధీనగర్ : గుజరాత్‌లో వర్షాలతో చెరువులు తెగిపోతున్నాయి. వరదలతో ఇండ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అకాల వర్షాలతో ఇప్పటివరకు మృతుల సంఖ్య 40కు పెరిగింది. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి దాదాపు 40 వేల మందిని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. ముఖ్యంగా, ...11లో



ఆన్‌లైన్ పాస్‌పోర్ట్ పోర్టల్ ఐదు రోజులు బంద్

రీషెడ్యూల్ కానున్న అపాయింట్‌మెంట్‌లు

వివరాలు 11లో..

అంబానీని దాటేసిన అదానీ

హురున్ ఇండియా కుబేరుల జాబితా వెల్లడి



వివరాలు 11లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా గణేష్ ఉత్సవాలు..

అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్

అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి

సుప్రీంకోర్టు నిబంధనలు పరిగణనలోకి తీసుకోవాలి : గణేష్ ఉత్సవ సమితి సమీక్షలో సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ తొలి నుంచి మత సామరస్యానికి, ప్రశాంతతకు పేరు పొందిందనీ, ఆ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలనీ, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలనీ, ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా ఉత్సవాలు, నిమజ్జనం కొనసాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ అధికారి ఏ జోన్‌లో బాధ్యతల్లో ఉన్నారు.. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రముఖులు, మండపాల బాధ్యులు అన్నింటి వివరాలు సమగ్రంగా ఉండాలని సూచించారు.

ఔటర్ రింగు రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలనీ, అలా తీసుకోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లోనే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సరూర్‌నగర్‌తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయనీ, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద ...10లో

గచ్చిబౌలిలో ప్రేమోన్మాది ఘాతుకం

యువతిపై కత్తితో దాడి

యువతి మృతి, మరో ముగ్గురికి గాయాలు

పారిపోయే క్రమంలో నిందితుని ఆత్మహత్యాయత్నం



ఫైల్

నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో ప్రేమోన్మాది ఘాతుకానికి ఒడిగట్టాడు. ప్రియురాలిపై విచక్షణా రహితంగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో యువతి మృతి చెందగా.. మరో ముగ్గురు గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దీపన తమాంగ్ (25) గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తండాలో తన స్నేహితులతో కలిసి ఉంటోంది. నల్లగండ్ల అపర్ణలో బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. ఆమెకు కొంతకాలం క్రితం కర్నాటకలోని బీదర్‌కు చెందిన రాకేష్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. అయితే రాకేష్.. తనను పెండ్లి చేసుకోవాలంటూ దీపన తమాంగ్‌ను విసిగించేవాడు. కాగా ...11లో

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి

ఆ చట్టాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది

అమలుకు కార్యాచరణ సిద్ధం చేయండి : ఆర్థికశాఖకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రాధాన్యతనివ్వండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఆ శాఖ ప్రత్యేక అధికారి మిగతా అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఈ అంశాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు సబ్ ప్లాన్ నిధుల్లో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. గురువారం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో 'ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు-ప్రణాళిక'పై వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపుల్లో విద్యకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అంగన్వాడీలు, పాఠశాలల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారులు, డ్రయినేజీ నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని చెప్పారు. సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చిన స్ఫూర్తిని కొనసాగించేలా అధికారుల పని విధానం ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో ...10లో

6న జీపీల్లో పంచాయతీ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితా

ఆ తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో పార్టీల నేతలతో భేటీలు

ఓటర్‌లిస్టుపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణ 2లో..

ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ సిబ్బందికి శిక్షణలో గైడ్‌లైన్స్ పాటించాలి :రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారథి ఆదేశాలు

కలెక్టర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ప్రపంచంలో దేశాల మధ్య సంఘీభావం, సమన్వయం అవశ్యం

చైనా నేత జిన్‌పింగ్ స్పష్టీకరణ

అమెరికా జాతీయ భద్రతా సలహాదారుతో భేటీ 3లో..





మెరుగైన భవిష్యత్తును సృష్టించడమే వెల్‌నెస్ సెంటర్ లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- కన్హాశాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ హెూలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-షాద్‌నగర్

మెరుగైన భవిష్యత్తును సృష్టించడమే వెల్‌నెస్ సెంటర్ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలోని కన్హాశాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ హెూలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. వెల్‌నెస్ బై హార్ట్‌ఫుల్‌నెస్ అనేది గౌదాజీ చేసిన గొప్ప ప్రయత్నమని, ఇది అన్ని చికిత్సా విధానాలను ఒకే ఒక స్థలంలో అందుబాటులోకి తీసుకొచ్చిందని అన్నారు. ఇక్కడున్న థెరపిస్ట్ బృందం అంకితభావం తనను ఆకట్టుకుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడానికి ఈ కేంద్రం చాలా అధునాతనంగా సన్నద్ధమై ఉందని, దాజీ ఉన్నతమైన దృష్టి కోణం ప్రకారం సంప్రదాయ జ్ఞానం, ఆధునిక విజ్ఞానం ఈ రెండూ అందమైన, నిర్మలమైన ప్రదేశమైన ఈ కన్హాశాంతి వనంలో కలగలసి వచ్చాయని వివరించారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడం, ఇంకా ప్రజలకు ఒకే ఒక్క ప్రదేశంలో శారీరక దృఢత్వాన్ని అందించడం దీని లక్ష్యమని తెలిపారు. శారీరక దృఢత్వం ద్వారా మానసిక శ్రేయస్సు సాధించవచ్చని అన్నారు. అనంతరం చీఫ్ మెడికల్ డైరెక్టర్ ఆచార్య డాక్టర్ శ్రీవర్మ మాట్లాడుతూ.. వివిధ ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో హెూలిస్టిక్ మెడిసిన్ కీలకమైనదని తెలిపారు. తాము పోలారిటీ, ఇంకా క్వాంటమ్ హీలింగ్‌తో పాటు ఆయుష్‌ను, ఆధునిక వైద్యాన్ని ఒకే చోటకు చేర్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను అభివృద్ధి చేస్తాం

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చెరువులు పరిశీలన
- వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు కృషి చేస్తామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆమె పర్యటించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపి చెరువు, నల్లగండ్ల చెరువు, చందానగర్ డివిజన్‌లోని గంగారం చెరువు, మియాపూర్ డివిజన్‌లోని గురునాథం చెరువును మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువుల సంరక్షణతో పాటు వాటి సుందరీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రధానంగా విలువైన చెరువు స్థలాల సంరక్షణ, చెరువు కట్టల పటిష్టం, డ్రయినేజీ నీరు చేరకుండా డైవర్షన్, ఛానెళ్ల నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం సహా పలు ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు. గోపి చెరువు రూపురేఖలు మార్చుకుని ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు సిద్ధం అయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గోపినగర్‌లో ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి అవగాహన కల్పించారు. అలాగే వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి, మియాపూర్, చందానగర్, డివిజన్ల కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, శ్రీకాంత్, మంజుల రాఘునాథ్‌రెడ్డి, ఇరిగేషన్, ఇంజనీరింగ్, శానిటేషన్ శాఖల అధికారులు, సీఐ పాలవెల్లి, ఎస్ఐ రఘు, గోపినగర్‌వాసులు యాదా గౌడ్, గోపాల్ యాదవ్, సైదులు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి.. మహిళ గొంతు కోసి..

- ఇంట్లోకి చొరబడి దొంగల బీభత్సం
- రూ.లక్ష నగదు, ఐదు తులాల బంగారం, మోటార్ సైకిల్ చోరీ





నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బస్వాపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఓ కిరాణం షాపులో దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ఇంట్లో వారిని కత్తితో బెదిరించి.. మహిళ గొంతు కోసిన ఘటన స్థానికులను బయభ్రాంతులకు గురిచేసింది. కాటారం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. బస్వాపూర్ గ్రామానికి చెందిన మహిళ పగడాల స్వర్ణలత పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చింది. ముగ్గురు వ్యక్తులు ఆమెను కత్తితో బెదిరించి ఇంటిలోకి చొరబడ్డారు. భర్త తిరుపతి బయటకు రాగా అతన్ని కొట్టి కట్టివేశారు. మహిళను కొట్టడంతో పాటు కత్తితో బెదిరించి గొంతు కోశారు. ఇంట్లోని 5 తులాల బంగారం, రూ.లక్ష నగదుతో పాటు అతని మోటార్ సైకిల్ దొంగిలించి పారిపోయారు. గాయపడిన స్వర్ణలతను చికిత్స కోసం భూపాలపల్లిలోని ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులకు సమాచారం అందివ్వగా.. భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్ఐ అభినవ్ సంఘటనా స్థలానికి చేరుకొని అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. నిందితుల ఆనవాళ్ల కోసం జాగిలాలతో పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద, ఇతర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. రెండు బృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్టు సీఐ చెప్పారు.

ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

స్వచ్ఛ భారత్‌లో ప్రజలు భాగస్వామ్యం కావాలి

జనగామలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



నవతెలంగాణ-జనగామ

జిల్లాలో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసి గొప్ప విజయాలను అందుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం జనగామ జిల్లా పర్యటనకు విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్, డీసీపీ రాజమహేంద్రనాయక్ శాలువాలు కప్పి, పూల మొక్కలతో సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాకు చెందిన ప్రముఖ కవులు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ రిజ్వానాబాషా జిల్లా ఔన్నత్యాన్ని, ప్రాధాన్యతలను, చారిత్రక నేపథ్యాన్ని గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఈ సందర్భాన్ని జీవితకాలం జ్ఞాపకం ఉంచుకుంటానని, ఎందరో కళాకారులు, కవులు, రచయితలు, ప్రఖ్యాతిగాంచిన మహోన్నత వ్యక్తులకు జన్మనిచ్చిన ఈ నేలపై అడుగుపెట్టడం తన అదృష్టమని అన్నారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను అభినందిస్తూ ఇటువంటి వసతుల కల్పనతో ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని, అదే సమయంలో హబ్‌లో పాథాలజిస్ట్‌లను నియమించి, నివేదికలను ధృవీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించడానికి చెట్ల పెంపకం పట్ల తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. చేనేత కార్మికులు ప్రదర్శించిన చీరెలపై ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తూ, చేనేత ఉత్పత్తి కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి తన పరిపూర్ణ సామర్థ్యాన్ని చేరుకోవడానికి చేసిన పోరాటాన్ని ప్రతిబింబించే చరిత్ర అని తెలిపారు. దేశంలోని అతి పెద్ద కార్యక్రమంలో ఒకటైన స్వచ్ఛ భారత్‌లో ప్రజల భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇక్కడి ప్రజల ప్రేమ, ఆప్యాయతలను, అధికారుల ఆతిథ్యాన్ని అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజాం, అతని అనుచరులకు వ్యతిరేకంగా అనేక విప్లవాత్మక ఉద్యమాలకు, ఆందోళనలకు జన్మస్థలం జనగామ అని తెలిపారు. ఇక్కడి ఉద్యమాలు తర్వాతి కాలంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వ్యాప్తిచెంది రాష్ట్రాన్ని ప్రభావితం చేశాయని అన్నారు. అలాగే, అనేక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు జిల్లా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు.

దేవాలయాలు ప్రజల సాంస్కృతిక జీవన విధానాలకు నిదర్శనం



జనగామ మండలంలోని ఓబుల్ కేశవపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని గవర్నర్ సందర్శించారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లు స్వగ్రామం కావడంతో ఆ దేవాలయానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ గ్రామానికి వచ్చిన గవర్నర్‌కు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. దేవాలయ సందర్శన అనంతరం ప్రజలతో ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టిలో గవర్నర్ మాట్లాడారు. చిన్నగ్రామంలో పెద్దదేవాలయం ఉండటం ఎంతో సంతోషకరమన్నారు. దేవాలయాలు ప్రజల సాంస్కృతిక జీవన విధానానికి నిదర్శనం అని తెలిపారు. అనంతరం గ్రామస్తులు.. ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లుతో కలిసి గవర్నర్‌ను ఘనంగా సన్మానించారు.

సోమేశ్వర ఆలయ సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి

గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ

నవతెలంగాణ-ఆలేరుటౌన్/భువనగిరిఅర్బన్

చారిత్రాత్మకతకు నేలవైన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర ఆలయం సుందరీకరణకు, పురావస్తు శాఖ నడుం బిగించాలని, ఆలయ పూర్వ వైభవాన్ని తీసుకురావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవశర్మ, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులకు సూచిం చారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీ సోమేశ్వర ఆలయం, జైన దేవాలయాలను గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేద పండితులు ఆశీర్వాదచనం చేశారు. అనంతరం పురావస్తు శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, రంగాచారి, నాగలక్ష్మి ఆలయ చరిత్ర, దేవాలయ ప్రాంగణంలోని పురావస్తు శాలలో ఉన్న విగ్రహాలు, శాసనాల గురించి వివరించారు. అనంతరం భువనగిరిలోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని గవర్నర్ దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఏండ్లు గడుస్తున్నా పరిహారం, ఉపాధి లేదు

- కొండంపల్లి గ్రామాన్ని తరలించాలి
- సింగరేణి బ్లాస్టులతో రక్షణ కరువైంది..: ఓసీ-3 వద్ద గ్రామస్తుల ధర్నా





నవతెలంగాణ-గణపురం

తమ పిల్లలకు ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని, భవిష్యత్తుకు భరోసా ఉంటుందన్న ఆశతో తమ విలువైన పంట పొలాలను సింగరేణి యాజమాన్యానికి అందిస్తే.. ఏండ్లు గడుస్తున్నా పరిహారం, ఉపాధి అందించకుండా తమను అందకారంలోకి నెట్టివేశారని జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కొండంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొండంపల్లి గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ధర్మరావుపేట రెవెన్యూ గ్రామ శివారు ఓసీ-3 వద్ద గ్రామస్తులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం తమ భూములను స్వాధీనం చేసుకునే ముందు గ్రామంలో నిర్వహించిన సభలో అనేక హామీలు ఇచ్చారని, ఇప్పుడు వాటిని నెరవేర్చడం లేదని వాపోయారు. పైగా సింగరేణి రోజువారీగా బొగ్గు ఉత్పత్తి సాధనలో చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్స్ వల్ల తమ ఇండ్లపై మట్టి పెళ్లలు పడుతూ, బొగ్గు మంటలు చెలరేగుతూ విషవాయువులు వ్యాపిస్తున్నాయని అన్నారు. దాంతో చిన్నపిల్లల నుండి పెద్దవారు కూడా తీవ్ర అనారోగ్యం పాలై ఆస్పత్రుల పాలవుతున్నామని తెలిపారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న గ్రామస్తులందరి వ్యవసాయ భూములు తీసుకుని తమ గ్రామాన్ని తరలిస్తామంటూ 8నెలలు దాటినా తమకు కేటాయిస్తామన్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని, ఇంతవరకు అభివృద్ధి పనులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామాన్ని తరలించాలని వేడుకున్నారు. వ్యవసాయ భూమికి రూ.25లక్షలు ధర నిర్ణయించి నష్టపరిహారం అందివ్వాలని, కొండంపల్లి గ్రామానికి సంబంధించిన పంటభూములకు గని కార్యక్రమాల వల్ల జరిగిన పంట నష్టానికి నష్ట పరిహారం వెంటనే ఇవ్వాలని కోరారు. మిగిలిపోయిన వ్యవసాయ భూమి, పనికిరాని భూములకు డీఎన్ ప్రకటించి నష్టపరిహారం అందివ్వాలని, కొండంపల్లి గ్రామంలోని నిరుద్యోగ యువతకు, దళిత ఆడబిడ్డలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసిత రైతు కుటుంబాలకు ఆరోగ్య భద్రత, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. తమ ముందు నుంచే వాహనంలో భూపాలపల్లి జీఎం వెళ్లారని, కానీ కనీసం తమతో మాట్లాడలేదని, ఇది ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు, సింగరేణి జీఎం వచ్చి అధికారికంగా రాతపూర్వకంగా రాసి ఇస్తేనే ధర్నా విరమిస్తామని గ్రామస్తులు ముక్తకంఠంతో నినాదాలు చేస్తూ భైటాయించారు. ధర్నా స్థలానికి స్థానిక ఎస్ఐ రేఖ అశోక్ చేరుకొని భూ నిర్వాసిత రైతులతో చర్చించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. వారం రోజుల్లో సమస్య పరిష్కరించేలా ప్రయత్నిస్తానని, ధర్నా విరమించాలని కోరారు.

గడువులోపు సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ ధర్నా చేపడతామని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు సహకరించాలని కోరుతూ గ్రామస్థులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కొండంపల్లి భూ నిర్వాసిత రైతులు మోతె కర్ణాకర్ రెడ్డి, దాసరి లక్ష్మయ్య, వంగ రవి, సుంకరి రాజు, మాధవ రెడ్డి, జగ్గారెడ్డి, చిత్తారి దేవేందర్, కుమార స్వామి, దాసరి అజిత్, విజయ, ఎడ్ల యాకుబ్, యాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు

- నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద ప్రవాహం
- 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- కొనసాగుతున్న 3,55,910 క్యూసెక్కుల ఇన్ ఫ్లో
- పర్యాటకుల సందడి



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువనున్న ప్రాజెక్టులన్నీ నిండు కుండలా మారడంతో వచ్చిన నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం 10 క్రస్ట్ గేట్లు, కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతుండటంతో 3,55,910 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో ఎన్ఎస్పీ అధికారులు 12 క్రస్ట్ గేట్లను 5 అడుగులు, 14 క్రస్ట్ గేట్లను 10అడుగుల మేర మొత్తం 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి 18గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల.. ఆ తర్వాత వరద ప్రవాహం మరింత పెరగడంతో 26 గేట్లను ఎత్తారు. వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా, ప్రస్తుతం 590 అడుగుల వద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 312.0450 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,461 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 8280 క్యూసెక్కుల నీటిని, ఎస్-ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, లోలెవల్ కెనాల్ ద్వారా 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుంచి మొత్తం 3,55,910 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగడం డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీ లాంచీ స్టేషన్ వద్ద, డ్యామ్, కొత్త బ్రిడ్జి, పాత వంతెన వద్ద పర్యాటకుల సందడి వాతావరణం నెలకొంది. డ్యామ్ విద్యుత్ జలకేంద్రం వద్ద రద్దీ ఉంది.

కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన కొడుకు

- పట్టా భూములు, బంగారం అంతా అమ్ముకున్నరు..
- పట్టించుకుంటలేరంటూ.. అమ్మ ఆవేదన



నవతెలంగాణ-నిజాంపేట

తల్లి వద్ద నున్న భూమి, బంగారం అంతా అమ్ముకొని చివరకు ఆమెకు ఏమీ మిగల్చకపోగా, భారమంటూ ఇంటి నుంచి తన్న తల్లినే కొడుకు గెంటేసిన ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో గురువారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుంట సత్తవ్వ (70)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సత్తవ్వ భర్త కుంట ఎల్లయ్య అనారోగ్యంతో మరణించగా అమె చిన్న కుమారుడు కుంట కృష్ణ గుండెపోటుతో మృతిచెందారు. చిన్న కుమారుడు చనిపోకముందే.. సత్తవ్వ పేరు మీద ఉన్న భూములను ఇద్దరు కొడుకులు అమ్ముకొని ఆమె దగ్గర ఉన్న బంగారాన్ని లాక్కొన్నారు. చిన్న కొడుకు చనిపోవడంతో పెద్ద కుమారుడు రమేశ్ వద్దనే ఆమె ఉంటోంది. రమేష్.. మెదక్‌లో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. కాగా, రోజు తాగి వచ్చి పింఛన్ డబ్బులు ఇవ్వాలని గొడవ పడేవాడు.. ఇవ్వకుంటే.. చంపేస్తానని బెదిరించేవాడు. ఈ క్రమంలో సత్తవ్వను పెద్ద కొడుకు రమేష్ ఇంటి నుంచి గెంటి వేయడంతో ఆమె రోడ్డున పడింది. 'కనీ పెంచి.. చిన్నప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుతూ.. పెద్దవారిని చేయడం తాను చేసిన పాపమా?" అని తల్లి సత్తవ్వ బోరున విలపించింది. పెన్షన్ డబ్బుల కోసం అక్కడక్కడ హత్యలు జరుగుతున్న సంఘటనను గుర్తుచేసుకొని గుండెలు పగిలేలా రోదించింది. ఇటువంటి పరిస్థితి ఎవరికి రాకూడదని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి తనకు తగిన న్యాయం చేయాలని బాధితురాలు సత్తవ్వ వేడుకుంది.

కోర్టు ఆవరణ నుంచి నిందితుడు పరార్

- గాలించి పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-కోదాడరూరల్

కోర్టు ఆవరణ నుంచి ఓ దొంగ పారిపోయిన ఘటన సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడి గోపిపై దొంగతనం కేసు నమోదైంది. ఈ విషయంలో కోదాడ కోర్టుకు హాజరు పరిచేందుకు ఖమ్మం జిల్లా జైలు నుంచి సూర్యాపేట జిల్లా ఏఆర్ పోలీసులు తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే హ్యాండ్ కప్స్ తీసుకొని అతను పరార య్యాడు. ఎస్కార్ట్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నిందితుడు పారిపోయాడని పలువురు ఆరోపించారు. అయితే.. అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద లారీ ఎక్కి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ఐడిపార్టీ పోలీసులు గోపిని పట్టుకొని టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. గోపి పెన్ పహాడ్, నూతనకల్, కూసు మంచి పోలీస్ స్టేషన్ల పరిధిలో దేవాలయాల్లో హుండీలు, గంటలు చోరీలు చేశాడు. మిర్యాలగూడ, కోదాడలో కూడా ద్విచక్ర వాహనాల దొంగతనం చేశాడు. చోరీ చేసిన వస్తువులను అమ్మడానికి కోదాడకు రాగా.. వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై సమగ్ర అధ్యయనం

- కార్మిక సంఘాల పునరుద్ధరణ చేస్తాం : ఎమ్మెల్యే కూనంనేని, ఏఐటీయూసీ నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో కూనంనేనితోపాటు టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మజీద్, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న కలిసి వినతిపత్రం సమర్పించారు. 2013 బాండ్ డబ్బులు విడుదల చేయాలని కోరగా వెంటనే విడుదల చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. కార్మిక సంఘాల పునరుద్ధరణ గురించి ప్రస్తావించగా.. 'ఇంతపెద్ద ఆర్టీసీ సంస్థలో కార్మిక సంఘా ల్లేకుంటే వాళ్ల బాధలు ఎవరికి చెప్పు కుంటారు. కచ్చితంగా కార్మిక సంఘా లను పునరుద్ధరిస్తాం. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే అంశంపై గత ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయలేదు. సంస్థ ఆస్తులకు భంగం కలగకుండా ఉద్యోగుల సౌకర్యాలు, హక్కులకు హాని కలగకుండా సమగ్ర అధ్యయనం చేస్తాం'అని రేవంత్‌రెడ్డి అన్నారని వివరించారు. మిగతా అంశాలను పూర్తిగా అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎస్ బాలరాజుకు ధన్యవాదాలు ప్రకటించారు.

6న జీపీల్లో పంచాయతీ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితా

- ఆ తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో పార్టీల నేతలతో భేటీలు
- ఓటర్‌లిస్టుపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణ
- ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ సిబ్బందికి శిక్షణలో గైడ్‌లైన్స్ పాటించాలి : రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారధి ఆదేశాలు
- కలెక్టర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వార్డులు, గ్రామపంచాయతీల వారీగా రూపొందించిన ఓటర్ల ముసాయిదా జాబితాను సెప్టెంబర్ ఆరోతేదీన పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారధి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ రెండో సార్వత్రిక ఎన్నికల ఓటర్ లిస్టు తయారీ, ప్రచురణ పురోగతిపై గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు (హైదరాబాద్ మినహాయింపు), అడిషనల్ కలెక్టర్లు(స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, అసెంబ్లీ నియో జకవర్గాల ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, కమిషనర్ అనితారామచంద్రన్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంగ్రామ్, కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, సెంటర్ ఫర్ గుడ్‌గవర్నెన్స్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రూపొందించిన ఓటర్ల లిస్టుల ప్రకారం యథావిధిగా వార్డు, పంచాయతీ వారీగా జాబితాను తయారు చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఆ ముసాయిదా ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయంలో అంటించిన తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో వేర్వేరుగా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేయాలనీ, వారి నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే సెప్టెంబర్ 13వ తేదీ వరకు సంబంధింత మండల పరిషత్ అధికారులకు, జిల్లా పంచాయతీ అధికారులకు రాతపూర్వకంగా తెలపాలని సూచించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆ అధికారులు తగిన చర్యలు తీసుకుని సవరించిన తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 21వ తేదీన ప్రచురించాలని ఆదేశించారు. ఎవరైనా అర్హులైన ఓటర్లు తమ పేర్లను గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలన్నా, ఓటర్లుగా ఉండేందుకు ఆక్షేపణలున్నా నిర్దేశించిన ఎన్నికల ఫారమ్‌ను నింపి సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ ఓటర్ల చేర్పు, తొలగింపు తర్వాతనే గ్రామపంచాయతీ ఓటరు లిస్టును పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఓటర్ లిస్టుల తయారీ తర్వాత వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, తదితర అంశాలపై అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు ఆయన వివరించారు. ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం తయారు చేసిన సర్క్యులర్‌ను తూ.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఓటర్ లిస్టుల తయారీలో పురోగతి, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు.

గ్రీవెన్స్ మాడ్యూల్ విడుదల

సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో రాష్ట్ర ఎన్నికల సంఘం తయారు చేసిన గ్రీవెన్స్ మాడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారధి గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ మాడ్యూల్ ద్వారా ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనపై సాధారణ పౌరులు కూడా ఫిర్యాదు చేయవచ్చుననీ, అలాంటి ఫిర్యాదుదారుల వివరాలు రహస్యంగా ఉంచుతామని హామీనిచ్చారు. ఆ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుని ఫిర్యాదుదారునికి తెలియజేస్తారని వివరించారు. దీనివల్ల ఎన్నికలు మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.







షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

- రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం.. ఎలాంటి షరతులు, ఆంక్షలు లేకుండా రైతులందర్నీ రుణవిముక్తులను చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాంకేతిక పేరుతో కాలయాపన చేయకుండా, అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేసి, తిరిగి రుణాలు ఇవ్వాలని కోరారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్, మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు. రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని, ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ అనేది సాహసోపేతమైన నిర్ణయమని, దాన్ని తాము స్వాగతించామన్నారు. తొలుత ప్రతి రైతుకూ రూ.2లక్షలు అని చెప్పిన ప్రభుత్వం తర్వాత రైతు కుటుంబానికి అని మాట మార్చిందని, అది కూడా అందరికీ మాఫీ చేయడం లేదన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 567లో అనేక నిబంధనలు విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రూ.22 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా జమ చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రుణం తీసుకున్న ప్రతిరైతుకు రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఆందోళన నిర్వహించారు. పెన్‌పహాడ్, మునగాల, నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. గుండాల మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మోత్కూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఆధ్వర్యంలో అనంతరం డీఆర్ఓ పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రైతు సంఘం సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కొండపాక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో రైతులు ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా అమనగల్ సిండికేట్ బ్యాంక్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ డివిజన్ కేంద్రంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. కొల్లాపూర్, పెంట్లవల్లి మండలాల్లో ఆర్డీవో కార్యాలయాల ముందు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం ఇచ్చారు. కొల్లాపూర్‌లో ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. వనపర్తి జిల్లా వనపర్తి, పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. జోగులంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు.

ధరూర్‌లోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్మూర్, మాక్లూర్‌లో తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బోధన్‌లో ఆర్‌డీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ప్రతీ ఐదు రోజులకు ఓ కుబేరుడు

దేశంలో కొత్తగా పుట్టుకొస్తున్నారు

- చైనాలో తగ్గిన సంఖ్య
- షారుక్ ఖాన్‌కు తొలిసారి చోటు
- పిన్న వయస్సులో జెప్టో వ్యవస్థాపకులు



న్యూఢిల్లీ : దేశంలో అధిక ధరలతో ఓ వైపు పేదలు, మధ్యతరగతి ప్రజల ఆదాయాలు హరించుకుపోతుంటే.. మరోవైపు సంపన్నుల ఆదాయాలు కోట్ల రూపాయాల్లో పెరిగిపోతున్నాయి. భారత్‌లో ప్రతీ ఐదు రోజులకు ఒక్క కుబేరుడు పుట్టుకొస్తున్నారని హురున్ ఇండియా వెల్లడించింది. గతేడాది వీరి సంఖ్య 29 శాతం పెరిగిందని హురున్ ఇండియా వ్యవస్థాపకులు అనస్ రెహమాన్ జునైద్ వెల్లడించారు. దేశంలో రికార్డ్ స్థాయిలో 334 మంది బిలియనీర్లు నమోదయ్యారని తెలిపారు. మరోవైపు చైనాలో బిలియనీర్ల సంఖ్య 25 శాతం పడిపోయిందన్నారు. జులై 31 నాటి గణాంకాలను ఆధారంగా చేసుకొని హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024 నివేదికను ప్రకటించింది. గౌతం అదానీ అగ్రస్థానంలో నిలువగా.. ముకేష్ అంబానీ రెండో స్థానానికి పడిపోయారు. మొదటిసారిగా బాలివుడ్ నటుడు షారుఖ్ ఖాన్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్‌లో చోటు సంపాదించారు. ఐపిఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్‌లో తాను వాటాలు కలిగి ఉండడంతో వాటి విలువ పెరిగింది. దాంతో మొత్తంగా రూ.7,300 కోట్లతో ఈ లిస్ట్‌లో స్థానం సంపాదించారు.

గతేడాది అదానీ సంపద 95 శాతం పెరిగి రూ.11.61 లక్షల కోట్లకు చేరింది. అంబానీ సంపద రూ.10.14 లక్షల కోట్లుగా ఉంది. గత ఐదేళ్లుగా శివ్ నాడార్, సైరస్ ఎస్ పూనావాలా అండ్ ఫ్యామిలీ, గోపిచంద్ హిందుజా అండ్ ఫ్యామిలీ, డీమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ అండ్ ఫ్యామిలీ టాప్ 10 స్థానాల్లో ఉన్నారు. సినీ ప్రముఖుల విషయంలో జూహీ చావ్లా, హతిక్ రోషన్, అమితాబ్, కరణ్ జోహార్ టాప్-5లో నిలిచారు. ఈ జాబితాలో జెప్టో వ్యవస్థాపకుడు 21 ఏండ్ల కైవల్య వోహ్రా అతి పిన్న వయసులోనే బిలియనీర్‌గా నమోదయ్యారు. ఆ సంస్థ మరో సహ వ్యవస్థాపకుడు 22 ఏండ్ల అదిత్ పలిచా ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు.

కాశ్మీర్ అభ్యర్థుల జాబితాలో ఓబీసీలు ఏరి ?

బీజేపీలో అసంతృప్తి

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికల కోసం పార్టీ ప్రకటించిన అభ్యర్థుల్లో ఓబీసీలకు ప్రాతినిధ్యం లభించకపోవడంపై బీజేపీలో అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఇప్పటికే మూడు జాబితాలు ప్రకటించినప్పటికీ ఒక్క ఓబీసీ అభ్యర్థికి కూడా చోటు దక్కలేదని పార్టీ నేతలు బాహాటంగానే మండిపడుతున్నారు. జనాభాలో 30-40 శాతంగా ఉన్న ఓబీసీలకు అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యతే కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమకు జరిగిన అన్యాయంపై ఓబీసీ ఓటర్లు కూడా రగిలిపోతున్నారు. తమ హక్కులను పరిరక్షిస్తామని బీజేపీ హామీలు కురిపించిందని, కానీ చేసిందేమీ లేదని వారు ధ్వజమెత్తారు. అభ్యర్థుల తదుపరి జాబితాలో అయినా తమకు ప్రాతినిధ్యం కల్పిస్తారేమోనని బీజేపీలోని ఓబీసీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. అయితే ఆ ఆశలేవీ నెరవేరేలా లేవు. జమ్మూ ప్రాంతంలోని ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వీటిలో మూడు స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. మిగిలిన మూడు స్థానాల కోసం అభ్యర్థుల్లో పోటీ అధికంగా ఉన్నదని, ఈ నేపథ్యంలో ఓబీసీలకు కనీసం ఒక స్థానమైనా కేటాయించే అవకాశాలు కూడా లేవని పార్టీ వర్గాలు తేల్చేశాయి. జమ్మూ ప్రాంతంలో 43, కాశ్మీర్ ప్రాంతంలో 47 శాసనసభ స్థానాలు ఉన్నాయి.



బీజేపీ ఇప్పటి వరకూ ప్రకటించిన జాబితాలో 14 మంది ముస్లింలకు చోటు కల్పించారు. అయితే ఆ జాబితాలో ఓబీసీలకు చెందిన వారు ఒక్కరూ లేరు. అన్ని వర్గాలకూ సమాన ప్రాతినిధ్యం కల్పిస్తామని పార్టీ చెబుతోందని, కానీ ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని బీజేపీ నేత ఒకరు అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ ఇప్పటి వరకూ 44 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. రాష్ట్రంలో కనీసం 58 స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ భావిస్తోంది. మిగిలిన స్థానాల్లో బలమైన స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ఇస్తామని సీనియర్ నాయకుడొకరు చెప్పారు. బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో ఎక్కువ మంది నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, కాంగ్రెస్, అప్నీ పార్టీ నుండి వలస వచ్చిన వారే. అయితే వీరిలో ఒక్కరు కూడా ఓబీసీ లేరు.

మహిళల్లో స్టెరిలైజేషన్ అధికం

- స్త్రీల మీదే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ భారం
- ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదేండ్లలో ఇదీ పరిస్థితి

రాయ్‌పూర్ : కుటుంబ నియంత్రణ(స్టెరిలైజేషన్)కు సంబంధించి అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ.. ప్రజల ఆలోచనలో మార్పు కనిపించటం లేదు. దీంతో, ఇలాంటి ఆపరేషన్లు చేయించుకోవాల్సిన బాధ్యత మహిళల మీదనే పడుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదేండ్లలో నమోదైన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల సంఖ్య ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. ఇక్కడ పురుషుల కంటే మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పది రెట్లు అధికంగా ఉన్నాయి. కుటుంబ నియంత్రణ కోసం మహిళలకు చేసే ఆపరేషన్‌ను వైద్య పరిభాషలో ట్యూబెక్టమీ అనీ, పురుషులకు సంబంధించి వేసెక్టమీ అని అంటారు. అయితే, ఈ స్టెరిలైజేషన్ భారం మహిళల మీదనే పడుతున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా ఈ పరిస్థితి కనబడుతున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.



ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. గత ఐదేండ్లలో ఛత్తీస్‌గఢ్‌లో 2,92,668 మంది మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఆశ్రయించారు. అయితే, పురుషుల విషయంలో ఈ సంఖ్య 25,308గా మాత్రమే ఉండటం గమనార్హం. అయితే, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలో అవగాహన కార్యక్రమాలు మంచి ఫలితాలనే ఇస్తున్నా.. ఇప్పటికీ చాలా మందిలో పలు అపోహలున్నాయని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌తో మహిళలు, పురుషుల్లో ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావమూ ఉండదని అన్నారు. సుముఖత చూపకపోవటం, విద్య అనే అంశాలు కూడా జనన నియంత్రణ ఆపరేషన్ల విషయంలో మహిళలతో పోలిస్తే పురుషులు వెనకబడిపోయి ఉన్నారని ఆరోగ్యాధికారులు చెప్తున్నారు. అంతేకాకుండా, పురుషుల స్టెరిలైజేషన్ ప్రక్రియ సరళంగా ఉండటంతో పాటు త్వరగా అయిపోతుందని వివరిస్తున్నారు. ఇక స్టెరిలైజేషన్ చేయించుకునేవారి కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రోత్సాహకం పురుషులకు రూ.3000లు కాగా, మహిళలకు రూ.2000గా ఉన్నది. కుటుంబ నియంత్రణ ఆపరేష భారం మహిళలపై పడుతున్న దృగ్విషయం ఒక్క ఛత్తీస్‌గఢ్‌కు మాత్రమే పరిమితం కాలేదనీ, ఇదే పరిస్థితి భారత్‌లోని మిగతా రాష్ట్రాల్లో సైతం కనిపిస్తున్నదని కొందరు వైద్య నిపుణులు అంటున్నారు. ప్రభుత్వాలు నిర్వహించే అవగాహనా కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

ప్రపంచంలో దేశాల మధ్య సంఘీభావం, సమన్వయం అవశ్యం

చైనా నేత జిన్‌పింగ్ స్పష్టీకరణ అమెరికా జాతీయ భద్రతా సలహాదారుతో భేటీ



బీజింగ్ : అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్‌తో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ గురువారం ఇక్కడి గ్రేట్‌హాల్ ఆఫ్ ది పీపుల్ భవనంలో సమావేశమయ్యారు. ప్రస్తుతం వేగంగా మారుతున్న పరిణామాలు, అల్లకల్లోలంగా వున్న ఈనాటి ప్రపంచంలో దేశాల మధ్య సంఘీభావం, సమన్వయం వుండాల్సిన అవసరం వుందని, కానీ విభజన లేదా సంఘర్షణలు కాదని జిన్‌పింగ్ పేర్కొన్నారు. పారదర్శకత, పురోగతిని ప్రజలు కోరుకుంటారని, అంతేకానీ బహిష్కరణలు లేదా తిరోగమనాలు కోరుకోరని ఆయన వ్యాఖ్యానించారు. రెండు ప్రధాన దేశాలుగా చైనా, అమెరికాలు చరిత్రకు, ప్రజలకు, యావత్ ప్రపంచానికి బాధ్యత వహించాల్సి వుందన్నారు. ప్రపంచ శాంతి, ఉమ్మడి అభివృద్ధి ప్రయోజనాలకు ఒక స్థిరమైన వనరుగా వుండాలని జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు.

రెండు దేశాల్లోనూ అలాగే చైనా-అమెరికా సంబంధాల్లోనూ గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. సుస్థిరమైన, ఆరోగ్యకరమైన, నిలకడతో కూడిన చైనా-అమెరికా సంబంధాల పట్ల చైనా నిబద్ధత విషయంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, సమాన అవకాశాలు, సహకారం ప్రాతిపదికన సంబంధాలు కొనసాగాలన్న మౌలిక సూత్రంలో మార్పు లేదన్నారు. దేశ సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాల విషయంలో చైనా వైఖరి ధృఢంగా వుందన్నారు. చైనా, అమెరికా ప్రజల మధ్య నెలకొన్న సాంప్రదాయ స్నేహ బంధాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో కూడా ఎలాంటి మార్పు లేదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. అమెరికా కూడా ఇదే దిశా నిర్దేశంతో చైనాతో కలిసి పనిచేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చైనాను, చైనా అభివృద్ధిని సానుకూల, సహేతుకమైన కోణంలో చూడగలదని ఆశిస్తున్నట్లు తెలిపారు. పరస్పర అభివృద్ధిని సవాలుగా తీసుకోవడం కన్నా ఒక అవకాశంగా చూడాల్సి వుందన్నారు. రెండు దేశాలు కలిసి ముందుకు సాగేందుకు సరైన మార్గాన్ని కనుగొనడంలో చైనాతో కలిసి పనిచేయగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు.

లక్ష్యానికి దూరంగా దుస్తుల ఉత్పత్తి

అధికంగా ఉన్న తయారీ ఖర్చు

న్యూఢిల్లీ : 2030 నాటికి వస్త్రాలు, దుస్తుల ఎగుమతులను వంద బిలియన్ డాలర్లకు చేర్చాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో ఒక్క దుస్తుల వాటాయే 50-60 శాతం. ఉత్పత్తిని పెంచితే దేశంలో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అయితే ఈ రంగంలో మన రికార్డును పరిశీలిస్తే అదేమంత తేలిక కాదని అర్థమవుతుంది. 2015-2020 మధ్యకాలంలో మన దేశం నుండి దుస్తుల ఎగుమతి 16-19 బిలియన్ డాలర్లు దాటలేదు. అదే సమయంలో వియత్నాం తన ఎగుమతులను 70 శాతం పెంచింది. బంగ్లాదేశ్ కూడా రెట్టింపు చేసింది.

పరిస్థితుల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని కేంద్రం గుర్తించింది. అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో ఉపాధితో ముడిపడిన ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించింది. అయితే బంగ్లాదేశ్, వియత్నాంతో పోలిస్తే మన దేశంలో దుస్తుల తయారీ ఖర్చు చాలా ఎక్కువ. ఉదాహరణకు దేశంలోని దుస్తుల తయారీ పరిశ్రమ రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తూ ఏడాదికి 60 లక్షల పాలియస్టర్ టీ-షర్టులు ఉత్పత్తి చేస్తుందని అనుకుందాం. అప్పుడు ఒక్కో టీ-షర్ట్ ఉత్పత్తికి రూ.238 ఖర్చవుతుంది. అదే బంగ్లాదేశ్, వియత్నాంలో కేవలం రూ.24 మాత్రమే అవుతుంది. అదీకాక ఫ్యాబ్రిక్స్...ముఖ్యంగా సింథటిక్ ఫ్యాబ్రిక్స్ దిగుమతులపై మన ప్రభుత్వం అధిక సుంకాన్ని వసూలు చేస్తోంది. వియత్నాం 12 శాతం వసూలు చేస్తుంటే మన ప్రభుత్వం 20 శాతం వసూలు చేస్తోంది. ముడి సరుకు ఖర్చు అధికంగా ఉండడంతో స్థానిక దుస్తులు కూడా ఎక్కువ ధర పలుకుతున్నాయి.



బంగ్లా జమాతేపై నిషేధం రద్దు!

సంపాదకీయం



మతోన్మాద జమాత్-ఎ-ఇస్లామీ పార్టీపై ఉన్న నిషేధాన్ని బుధవారం నాడు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసింది. ఆ పార్టీ, దాని అనుబంధ విద్యార్థి విభాగానికి చెందినవారు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారంటూ ఆగస్టు ఒకటవ తేదీన నాటి అవామీలీగ్ ప్రభుత్వం నిషేధం విధించింది. తరువాత నాలుగు రోజులకే హసీనా ప్రభుత్వ పతనం, ఆమెను బలవంతంగా మిలిటరీ అధికారులు మనదేశానికి పంపటం తెలిసిందే. తమ దర్యాప్తులో అలాంటి రుజువులేమీ లేవని తేలినందున నిషేధాన్ని ఎత్తివేసినట్లు యూనస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిణామం తరువాత తమ పార్టీ నమోదును రద్దు చేస్తూ గతంలో ఒక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి పునరుద్ధరించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయ నున్నట్లు జమాయతే ప్రకటిం చింది. బంగ్లాదేశ్‌లో జమాతే ఇస్లామీ ఒక వివాదాస్పద సంస్థ. బ్రిటీష్ ఇండియాలో 1941లో ఏర్పడిన ఈ సంస్థ బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని వ్యతిరేకించటమే గాక పాకిస్తాన్‌తోనే కలసి ఉండాలనే వైఖరి తీసుకుంది. విముక్తి కోసం పోరాడినవారి మీద దాడులు, హత్యలకు పాల్పడింది. దాంతో ముజిబుర్ రహమాన్ ప్రభుత్వం 1972లో దాన్ని నిషేధించింది. ముజిబుర్ హత్య తరువాత అధికారానికి వచ్చిన జియావుర్ రహమాన్ ప్రభుత్వం దాన్ని ఎత్తివేసింది.జమాయతే పార్టీ కార్యకలాపాలు లౌకిక వ్యవస్థ, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నందున దాని రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ 2009లో దాఖలైన పిటీషన్‌పై 2013లో హైకోర్టు విచారించి ఆమోదించింది. అప్పటినుంచి అది ఎన్నికల్లో నేరుగా పాల్గొనటం లేదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు(బిఎన్‌పి), ఇతర పార్టీల కూటమిలో భాగస్వామిగా ఉంటూ అవామీలీగ్‌ను వ్యతిరేకిస్తున్నది. అయితే అవామీలీగ్ అణచివేత చర్యల కారణంగా జమాయతేతో చేతులు కలిపినప్పటికీ దానితో సంబంధాలను వ్యతిరేకించే శక్తులు కూడా బిఎన్‌పిలో ఉన్నాయి.గతేడాది కూడా సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసినప్పటికీ దాని ప్రతినిధులు కోర్టుకు రాని కారణంగా కొట్టివేశారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించేందుకే అవకాశాలున్నాయి. ఒక వేళ అదే జరిగితే జమాతే వచ్చే ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీకి దిగటం ఖాయం.

షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతిచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేకత పెద్దఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది.హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమదేశానికి అప్పగించాలన్న డిమాండ్‌ను అక్కడి అవామీలీగ్ వ్యతిరేక పార్టీలు పదేపదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్రమోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. అవామీలీగ్ ఇతర పార్టీనేతల మీద కూడా కేసులు నమోదు చేయటమేగాక ఇప్పటివరకు ఇద్దరు మాజీ మంత్రులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్-మనదేశం మధ్య 54వరకు చిన్నా పెద్ద నదులు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బంగ్లాదేశ్‌లో అనేక చోట్ల వరదలు వచ్చాయి.పది లక్షల మంది పౌరులు ప్రభావితమయ్యారు. దీని వెనుక భారతహస్తం ఉందని, అక్కడి రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసిన కారణంగానే ఇదంతా జరిగిందనే ప్రచారం జరుగుతోంది. త్రిపురలోని గోమతి నది మీద ఉన్న డంబూర్ డామ్ నిండిపోయిన కారణంగా నీటిని దిగువన ఉన్న బంగ్లాదేశ్‌వైపు విడుదల చేయటం మినహా మరొకమార్గం లేదు. అదే జరిగింది, దాన్ని కావాలనే విడుదల చేసినట్లు మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొడు తున్నారు. అక్కడి మన వీసా జారీ కార్యాలయాల్లో తమ పౌరులకు వీసాల జారీని కావాలనే జాప్యం చేస్తున్నారంటూ అనేక మంది నిరసన ప్రదర్శనలకు దిగారు.హసీనా ప్రభుత్వ పతనం తరువాత మనదేశం సిబ్బందిని తగ్గించిన కారణంగా ఆలస్యం జరుగుతున్నది. ఈ పరిస్థితిని కూడా మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకకు కొన్ని శక్తులు చూస్తున్నాయి.

బంగ్లాదేశ్ యువతలో ఉన్న ఆగ్రహానికి దేశ ఆర్థిక పరిస్థితి కూడా ఒక కారణం.విదేశీ చెల్లింపుల సమస్యలతో పాటు ఇటీవల వచ్చిన వరదలు కూడా గోరుచుట్టు మీద రోకటిపోటులా మారాయి. ఆగస్టు 21వ తేదీ నాటికి విదేశీ మారకద్రవ్య నిల్వలు 20బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. మొత్తంగా మరో 11బిలియన్ డాలర్లు అవసరం కాగా డిసెంబరు నాటికి కనీసం 8బిలియన్ డాలర్లు అవసరమని అంచనా వేసి ఐఎంఎఫ్‌తో సహా వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు.అక్కడి జనం షేక్‌హసీనా గద్దె దిగాలని మాత్రమే కాదు, తమ పరిస్థితి మెరుగుపడాలని కూడా కోరు కుంటున్నారు. అది జరగకపోతే మరోసారి ఆందోళన మరోరూపంలో జరగటం ఖాయం.

> షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతిచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేకత పెద్దఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది.హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమదేశానికి అప్పగించాలన్న డిమాండ్‌ను అక్కడి అవామీలీగ్ వ్యతిరేక పార్టీలు పదేపదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్రమోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు.

వేమన కవిత్వం : వైజ్ఞానిక దృక్పథం



డాక్టర్ దేవరాజు మహారాజు


సమాజంలో మనిషి ఎలా మెలగాలో, విజ్ఞతను, వివేకాన్ని ఉపయోగిస్తూ ప్రతి విషయం తర్కబద్ధంగా ఎలా ఆలోచించాలో ఈ ప్రపంచానికి తెలియజెప్పిన తెలుగుకవి వేమన. కుల మతాలు, ప్రాంతీయ భేదాలు, లింగ వివక్ష లేకుండా ప్రతి మనిషీ మానవీయ విలువలను నిలుపుకుంటూ ఎలా బతకాలో చెప్పిన మానవవాది వేమన. ఆయన చెప్పాలనుకున్నది ఆటవెలదిలో చెప్పినా, తెలుగు సాహిత్య రంగంలో తన కవిత్వంతో ఒక బలమైన ముద్ర వేసుకున్నా-ఆయన అక్కడికే పరిమితం కాలేదు. అదే కవిత్వంతో సమాజ ఉద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా కూడా ఎదిగాడు. అందువల్ల వేమన క్రాంతిదర్శి, దార్శనికుడు అని కూడా చెప్పుకోవాలి!

ఎంతో శ్రమకోర్చి గ్రంథస్థం కాని దశలో వేమన పద్యాలు ఒక్కొక్కటి సేకరించి, ముద్రించి వాటిని అను వాదాల ద్వారా యూరోప్ దేశాలకు పరిచయం చేసిన సి.పి. బ్రౌన్ (1798-1884)కి తెలుగుజాతి రుణపడి ఉండాలి. వేమన కవిత్వం సమగ్రంగా ఒకచోట భద్రపరిచిన తరువాత, వాటిని పరిశీలించి వ్యాఖ్యానాలు, వివరణలు చాలామంది రాస్తూ వచ్చారు. అది కొంత సులభమైన పని. తొలితరం మలితరం రచయితలు, పరిశోధకులు కొంత ముడిసరుకు అందించిన తర్వాత, ఇటీవలి ఆధునిక కాలంలో కొందరు సిద్ధాంత వ్యాసాలు రాసి, పలు విశ్వవిద్యాలయాల నుండి డాక్టరేట్ పట్టాలు పొందారు. అప్పటికీ ఇప్పటికీ వేమన పద్యాలు సమాజంలో ప్రకాశవంతంగా వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నాయి. అయితే వాటిమీద వెలువడిన సిద్ధాంత వ్యాసాలు జన బాహుళ్యంలోకి వెళ్లలేదు. ఆధునిక సాంకేతిక వనరులన్నీ అమరిన తర్వాత, వేమన కవిత్వం మీద రాయడం గొప్ప పనికాదు. ఎక్కడ ఏమీలేని రోజుల్లో ఎంతో శారీరక, మానసిక శ్రమకోర్చి పనిచేయడం మాటలు కాదు. అందుకే అంటున్నాను. సి.పి. బ్రౌన్ నిజాయితీ, నిబద్ధతల్ని గుర్తు చేసుకుని - వేమనని బతికించి ఈ తెలుగుజాతికి అంకితం చేసిన ఆ ఆంగ్లేయుడికి ప్రతి తెలుగువాడు నమస్కరించుకోవాలి!

ప్రపంచంలో ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు ప్రారంభమౌతున్న తొలిదశలో సాధారణ శకం 1652 -1730 జ.జు. మధ్యకాలంలో వేమన జీవించాడు. అప్పటికి 'వైజ్ఞానికుడు' సైంటిస్టు అనే పదమే వాడుకలోకి రాలేదు. అలాంటి వారిని 'నేచురల్ ఫిలాసఫర్స్' అని వ్యవహరించేవారు. అవి జ్యోతిషం ఖగోళ శాస్త్రంగా రూపాంతరం చెందుతున్న రోజులు. ల్యూవెన్ హక్ (1622-1723 జ.జు) ఆ కాలానికి సూక్ష్మదర్శినిని తయారు చేయగలిగాడు. కానీ, అప్పటికి అది ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రాలేదు. అలాగే, అప్పుడప్పుడే న్యూటన్ (1643-1727 జ.జు) తన చలన సూత్రాలు వెల్లగించిన రోజులు.

ఇక మనదేశానికి వస్తే, దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాలు మినహాయిస్తే దేశం మొత్తం మొఘలుల పాలనలో ఉంది. వీరి రాజ్యానికి కిందిభాగం మరాఠా పాలకుల స్వాధీనంలో ఉంది. వేమన జీవించిన 17వ శతాబ్దంలో దక్షిణ భారతదేశం తంజావూర్ నాయక్‌ల పరిపాలనలో ఉంది. వారు తెలుగు సాహిత్యాన్ని, కళల్ని ఎంతగానో ప్రోత్సహించారు. వేమనకు ఒకటిన్నర శతాబ్దాలకు ముందే పోర్చుగీస్ నావికుడు వాస్కోడాగామా కేరళ-కోజికోడ్ నుండి మనదేశంలోకి ప్రవేశించాడు. అప్పటి కేరళ పరిపాలకుడు సమూత్రి మహారాజు పోర్చు గీస్‌తో వ్యాపార సంబంధాల్ని బాగా ప్రోత్సహించాడు. వేమనకు అర్ధశతాబ్దానికి ముందే సాధారణ శకం 1600 (జ.జు)లో ఈ దేశంలోకి ఈస్ట్ ఇండియా కంపనీ ప్రవేశించింది.

ఆ కాలపు విశేషాల్ని సమీక్షించుకోవడం ఎందుకంటే- వేమన పుట్టి, పెరిగి, కాస్త లోకజ్ఞానం సంపాదిం చుకునే నాటికి దేశ,కాల పరిస్థితులు ఎలా ఉన్నాయి. అనేది అర్థం చేసుకోవడానికి! వ్యక్తుల ఎదుగుదల మీద, రూపుదిద్దుకున్న వారి ఆలోచనాసరళి మీద బాహ్య పరిస్థితులు సామాజిక, ఆర్థిక, చారిత్రక, రాజకీయ స్థితిగతులు తప్పక ప్రభావం చూపుతాయి. కవుల, కళాకారుల, శాస్త్రవేత్తల, తాత్వికులవంటి వారి కృషి బేరీజు వేసు కోవాలంటే వారు జీవించిన కాలంనాటి అన్ని పరిస్థితుల్ని అన్ని కోణాల నుంచి పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పుడిక్కడ వేమన కవిత్వం గురించి చర్చిస్తున్నామంటే కేవలం ఆయన పద్యపాదాలు అర్థ తాత్పర్యాలు అర్థం చేసుకోవడం కాదు. తాత్విక కవి వేమన 'తయారు కావడానికి' దోహదం చేసిన బాహ్య, అంతర పరిస్థితుల్ని అంచనా వేసుకోగలగాలి. వేమన ఉనయోగించిన భాష, అందులోని చమక్కులు, వ్యంగ్యం, వంటి వాటిదగ్గరే ఆగిపోవడం భాషా పండితులు చేసే పని. అది ఒక కోణం మాత్రమే! వేమన లాంటి ఆలోచనాపరుడి గురించి, సమాజ క్షేమం గురించి ఆవేదన చెందిన మహనీయుని గురించి, ఇంకా అనేక కోణాలనుండి జరగాల్సిన పరిశీలనలు, పరిశోధనలు:- జరగలేదని నాకు అనిపిస్తోంది. ఈ దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు ప్రజలు ఇంకా మూఢనమ్మకాల్లో పిచ్చి సంప్రదాయాల్లో పడి కొట్టుకుపోతున్నారంటే-వేమనను అర్థం చేసుకోవల్సినంత చేసుకోలేదనీ, జీర్ణించుకోవాల్సినంత జీర్ణించుకోలేదని నాకు అనిపిస్తోంది!



నీథమ్ అనే శాస్త్రవేత్త అంగ్విైనా ట్రిటిసీ అనే వృక్ష పరాన్నజీవి వివరాలు తొలిసారి 1744లో ప్రపం చానికి ప్రకటించాడు. ఇది వేరును తొలచి జీవించే నెమటోడ్ పరాన్నజీవి. అంటే 1780 జ.జులో వేమన మరణించిన 14ఏండ్లకు ఈ వేరు పురుగు పరిశోధన అధికారికంగా వెలుగుచూసింది. అయినా తన లోకజ్ఞానంతో, పరిశీలనానుభవంతో వేమన "వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును/ చీడ పురుగు జేరి చెట్టు చెరచు" - అనే పద్యం చెప్పాడు."... శిలల కెల్ల మ్రొక్కు జీవులార! శిలల నేమియుండు జీవులందే కాక?"- శిలలలో ఏ ముందని మొక్కుతున్నారూ? అని ప్రశ్నిస్తూ ఏదైనా ఉంటే గింటే అది జీవుల్లోనే ఉంది- అన్న సత్యాన్ని వెల్లడించాడు వేమన. వేమన కాలానికి దేశంలో ఆధునిక ఇంగ్లీషు చదువులు లేవు. విజ్ఞానశాస్త్ర బోధన లేదు. అయినా, ఆయన తనలోని వైజ్ఞానిక అవగాహనను తట్టిలేపాడు. జీవులకూ, నిర్జీవులకు గల తేడా తెలుసు కొమ్మని హితవు పలికాడు. అలాగే శిలల గురించి మరో విషయం కూడా చెప్పాడు. ఒక హేతువాదిగా "రాతి బొమ్మకేల రంగైన వలువలు / గుళ్ల గోపురాములు కుంభములును"- అని మనుషులు కల్పించుకున్న దైవాన్ని వారి అంధవిశ్వాసాన్ని సుతిమెత్తగా ఎత్తి చూపాడు.

చీకటి పోవాలంటే దీపం పెట్టాలి. రోగం పోవాలంటే వైద్యుడి మందు తినాలి "వ్యాధి కలిగెనేని వైద్యుని చేతను/ మందు దినక కాని మానదెందు/ చెంత దీపమిడక చీకటిపాయునా" ఇది సాధారణమైన పరిశీలనే కాని, చీకటిని రోగంతో పోల్చడంలో వేమనలోని వైజ్ఞానిక స్పృహ బయటపడింది. వైద్యుడి మందు అంటే సైన్సు లేనిది రోగం పోదు.దీపం కూడా సైన్సే. సైన్సు లేనిది చీకటిపోదు "మేడిపండు చూడ మేలిమై యుండును/ పొట్ట విప్పి చూడ పురుగులుండు"- పద్యం తెలియని తెలుగువారు ఉండరు. ఆయన పిరికివాడి బింకాన్ని మేడి పండుతో పోల్చాడు కానీ, ఇంకొంచెం లోతుకుపోయి ఆలోచిస్తే- ప్రతి కాయమీద, ప్రతి పండుమీద పురుగులు అంటే పరాన్నజీవులు జీవిస్తున్నట్టుగానే.. జంతువుల, మనుషుల శరీరాల మీద కూడా పరాన్నజీవులున్నాయని చెప్పి నట్లయ్యింది. అంతేకాదు, మేడిపండులాగా అందంగా కనబడే ఈ సమాజం మూఢనమ్మకాలతో, దారిద్ర్యంతో, మోసం, దగా, కుళ్లు, కుతంత్రాలతో ఉందని హెచ్చరించినట్టుగా కూడా ఉంది. మేడిపండులాగా అందంగా కన బడే ఈ దేశం 'పొట్టలో'- దేశంలోని సామాన్యుల్ని పీల్చి పిప్పిచేసే కార్పోరేట్లు, రాజకీయ నాయకులు ఉన్న విష యం మనకు తెలుసు. వేమన చెప్పిన ఒక సాధారణ విషయంలో అనేకానేక అసాధారణమైన అంశాలున్నాయి.

వేమన భూ విజ్ఞానశాస్త్రం గానీ, మానవం శరీర ధర్మ శాస్త్రం గానీ, అధ్యయనం చేసినవారు కాదు. కానీ, తన నిశిత పరిశీలన వల్ల 'భూమిలోన బుట్టు భూసార మెల్లను/ తనువులోన బుట్టు తత్త్వమెల్ల/ శ్రమము లోన బుట్టు సర్వంబు తానౌను"- అన్నారు. అసలు శ్రమ విలువను గుర్తించి ఎలుగెత్తి చెప్పడమన్నది గొప్ప విషయం. ప్రతిదీ శ్రమలోంచే పుడుతుందన్న అవగాహన ఆ కాలంలో ఆయనకు రావడం మామూలు విషయం కాదు. దార్శనికత అంటే అదే- వాస్తవాన్ని గ్రహించడం, నిజాల నిగ్గు తేల్చడమే కదా- వైజ్ఞానిక దృక్పధ మంటే? ఒకచిన్న ధూళికణం, లేదా ఇసుక రేణువు ఒక నీటిచుక్కతో కలిసి ఎప్పుడైతే ముత్యపుచిప్పలో పడు తుందో, అప్పుడది ముత్యమవుతుంది. ముత్యపుచిప్ప అని మనం చెప్పుకునేది సముద్రంలో ఉండే ఒక మొలస్కా జీవి. అనేక రంగుల్లో ఛాయల్లో ఏర్పడే ముత్యాలు కాల్షియం కార్బోనెట్, కాంకియోలిన్ వంటి పదార్థాలతో సహజంగా సముద్రంలో ఏర్పడతాయి. దీనివెనుక ఎన్నో వైజ్ఞానిక విషయాలున్నాయి. కానీ, వేమన కాలానికి అవన్నీ ప్రచారంలో లేవు.అయినా ఆయన తెలుసుకున్నారు.తన రచనలో పొందుపరిచారు.'చిప్పలోన బడ్డ చినుకు ముత్యం బయ్యె/నీటబడ్డ చినుకు నీళ్లగలిసే"-అన్న-ఆయనలో వైజ్ఞానిక జిజ్ఞాసఎలాంటిదో దీనితో మనం అర్థం చేసుకోవచ్చు-

"పాల సాగరమున పవ్వళించినవాడు/ గొల్ల యిండ్ల పాలు కోరనేల"- పిండములను జేసి పితరుల తలపోసి/కాకులకును బెట్టు గాడ్దెలారా" - అంటూ తర్కబద్ధంగా అనేక ప్రశ్నలు సంధించిన వేమన, ఒక్కోచోట పరుషపదాలతో కూడా తన ఆక్రోశాన్ని వెళ్లగక్కాడు. "పేరు సోమయాజి పెను సింహ బలుడాయె/ మేకపోతు బట్టి మెడను విరువ/ కాని క్రతువు వలన కలుగునా మోక్షంబు" అంటూ జంతుబలిని నిరసిస్తూ యాగాలు చేసే సోమయాజులను ఎగతాళి చేస్తూ, మోక్షం కలిగే మార్గం ఇదేనా? అని దుయ్యబట్టాడు. "పెక్కు జనుల గొట్టి పేదల వధియించి/ డొక్క కొరకు నూళ్ల దొంగిలించి"- తన పొట్ట కోసం పేదల్ని కొట్టిచంపి, ఊళ్లు దోచుకునే దోపిడీదార్లను వేమన ఈసడించాడు. వేమన ప్రజా పక్షపాతి. తాను ఎవరి పక్షాన నిలబడ్డాడో కూడా స్పష్టం చేశాడు.

"బ్రహ్మ మనగ వేరె పరదేశమున లేదు / బ్రహ్మమనగ తానె బట్టబయలు/ తన్ను తానెరిగిన తానెపో బ్రహ్మంబు"- అని అన్న వేమనలో మనకు ఒక యోగి కనిపిస్తున్నాడు. గౌతమ బుద్ధుడు సమాధిలో కూర్చుని ఎక్కడాలేని ఏదో దేవుడి గూర్చి తపస్సు చేయలేదు. 'సర్వం దు:ఖమయం' అని గుర్తించిన బుద్ధుడు, ధ్యాన ముద్రలో కూర్చుని తనలోకి తాను ప్రయాణించాడు. మానవాళి దు:ఖాన్ని పారద్రోలడం ఎలాగా? అని తీవ్రంగా ఆలోచించాడు. వేమన కూడా అదేదారిలో పయనించి, అదే విషయం చెబుతున్నాడు. దేవుడనేవాడు ఏ దేశం లోనూ లేడు. తానేమిటో తను తెలుసుకోవడమే బ్రహ్మ. అదే జ్ఞానం అని చెపుతున్నాడు.

చివరగా ఒకమాట -నేను తెలుగు సాహిత్య విద్యార్థిని కాను. వేమన కవిత్వం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వాణ్ణి కూడా కాదు. అయితే వేమనలోని ప్రశ్నించేతత్త్వం, ప్రగతిశీల భావాలు నన్ను ఆకర్షించాయి. అందుకే ఏదో కొన్ని విషయాలు చెప్పడానికి సాహసించాను.

- కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

> ఇప్పుడిక్కడ వేమన కవిత్వం గురించి చర్చిస్తున్నామంటే కేవలం ఆయన పద్యపాదాలు అర్థ తాత్పర్యాలు అర్థం చేసుకోవడం కాదు. తాత్విక కవి వేమన 'తయారు కావడానికి' దోహదం చేసిన బాహ్య, అంతర పరిస్థితుల్ని అంచనా వేసుకోగలగాలి. వేమన ఉనయోగించిన భాష, అందులోని చమక్కులు, వ్యంగ్యం, వంటి వాటిదగ్గరే ఆగిపోవడం భాషా పండితులు చేసే పని. అది ఒక కోణం మాత్రమే! వేమన లాంటి ఆలోచనాపరుడి గురించి, సమాజ క్షేమం గురించి ఆవేదన చెందిన మహనీయుని గురించి, ఇంకా అనేక కోణాలనుండి జరగాల్సిన పరిశీలనలు, పరిశోధనలు:- జరగలేదని నాకు అనిపిస్తోంది. ఈ దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు ప్రజలు ఇంకా మూఢనమ్మకాల్లో పిచ్చి సంప్రదాయాల్లో పడి కొట్టుకుపోతున్నారంటే-వేమనను అర్థం చేసుకోవల్సినంత చేసుకోలేదనీ, జీర్ణించుకోవాల్సినంత జీర్ణించుకోలేదని నాకు అనిపిస్తోంది!

ముసుగుల్లో వొక అనాగరికుణ్ణి
మోసుకుపోతున్న పు-రుషులు
లోలోపల మసులుతున్నదేమిటో
ఎవ్వరికీ తెలియదు
గాంధీ మాటను పెడచెవిన పెట్టి
జెండా సిగ్గుపడ్తూనే ఎగరడానికి
ఆ రాత్రి స్వేచ్ఛనలంకరించుకుంటుంది

విషసర్పాల బుస వినిపించదు కాని
ముఖం నిండా కొన్ని నవ్వులు
గుచ్చం కట్టుకుంటారు
కొన్ని సభ్యతలు అభ్యంగన స్నానం చేసి
చేతుల నిండా పూజలు వేలాడ్తుంటాయి
ఇంకా కోరలేవి కన్పించని
మబ్బులు పద్తుంటారు
ఆ దుస్తులేవి నలగవు కానీ
ఆ గాలిలోకి లేచిన జిల్లేడుచూపు తొలవని

కొవ్వొత్తులు వదలాలి



అవయవ ముందదు
గెల్చిన ఓడిన రాజకీయం గొడుగుపట్టిన
వాళ్లను మనుషులనడం
అక్షరం వాంతి చేసుకుంటుంది
వాళ్ల కణాల నిండా
ఒక ఐతిహాసిక పురాణ సాంస్కృతిక
ద్రగ్గింజెక్టెడు వారసత్వ పాలసముద్రం
మథించబడుతుంటుంది

చేతినిండా అశ్లీలం
పొరలుపొరలుగా కౌగిలించుకుంటుంది
వొక గుర్తుతెలియని ముసుగులో
అవతారమెత్తిన పుంసత్వ మృత్యువేటొకటి
తొడల మధ్య గెలుపును ప్రకటించుకొని
ఒక సజల కాలాన్ని కొరికేస్తుంది
ఒక పునరుత్పాదక మానవీయ
పరిమళాన్ని మట్టి కల్పుతుంది

రాజ్యం గుడ్డితనం నవ్వుతుంటే
గుర్తు తెలియని మహమ్మారుల వేటలో
పాపం! కలకత్తా కాళిక
నూటయాభై గ్రాముల కొవ్వొత్తి పట్టుకుని
నడుస్తున్నప్పుడు తప్పదు,
మనుషులు కొవ్వొత్తులు వదలాలి!

- వడ్డెబోయిన శ్రీనివాస్
9885756071

పర్యావరణానికి 'హైడ్రా' దోహదపడుతుందా?



దొంతి నర్సింహారెడ్డి
9010205742

హైదరాబాద్ నగరంలో వేల చెరువులు వందలలోకి వచ్చాయి. కొన్ని ప్రాంతాలలో కుంటలు, చెరువులు ఆనవాళ్లు కూడా లేవు. అయితే, అదే క్రమంలో వరద ముప్పు పెరుగుతున్నది. కుంటలను, చెరువులను మాయం చేసిన దగ్గర వరద స్థాయి కూడా ఎక్కువగా ఉంటున్నది. కుంభ వృష్టి పడినప్పుడల్లా స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. మాయమైన చెరువులు, మాయం కాబోతున్న చెరువులకు కూడా అనేక స్థానిక కారణాలున్నాయి. రకరకాల వ్యూహాలతో కబ్జాదా రులు ఆక్రమించారు. గత 30ఏండ్లుగా జరుగుతున్న ఈ ఆక్రమణలు క్రమక్రమంగా జరిగాయి. ఒక్కొక్క చెరువుది ఒక్కోగాథ, బాధ, వ్యధ. మొదట్లో పేదల పేరు మీద జరిపిన ఆక్రమణ ఇప్పుడు చెరువు అవసరమే లేదు అనేకాడికి వచ్చింది. చెరువుల ఆక్రమణ వల్ల అన్యాయమైపోయిన వారి గొంతుకలు అప్పుడు ప్రభుత్వాలు, మీడియా, ఇతరులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నప్పుడు కూడా వారి గొంతు కాకుండా ఆక్రమించినవారు మాట్లాడు తున్నారు. మీడియాలో కూడా వారిమాట ప్రబలంగా వినపడుతున్నది. హాస్యాస్పదంగా చెరువులను ఆక్రమించిన ప్రజా ప్రతినిధులు రాజకీయ కోణం గురించి మాట్లాడుతున్నారు. కక్ష, వివక్ష అంటూ సమన్యాయం గురించి అరుస్తున్నారు. ప్రజల కొరకు మొదలు పెట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రజల పేరుమీద ప్రశ్నిస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో కొత్తగా ఏర్పడిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సంస్థ పని మొదలుపెట్టిన కొద్దిరోజులలోనే నగరంలో అనేక రకాల చర్చలకు దారి తీసింది. అయితే వేగంగా ఇది రాజకీయ నాయకుల చర్చగా మారింది. చెరువులు, కుంటలు, గొలుసుకట్టు చెరువులు, వాటి మధ్య వాగులు సహజ నీటి వ్యవస్థలో కీలకం. వీటిని కాపాడుకోవడం ముఖ్యం. అందుకే నీటి వనరుల నిర్వహణలో ఇమిడిఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక కోణాలను చర్చించాలి. హైదరాబాద్ నగర అభివృద్ధిలో సమిధలుగా మారిన చెరువుల గురించి రాజకీయ నాయకుల వ్యవహారంగా మారిస్తే ప్రజలకు అసలు విషయం అర్థమయ్యే అవకాశం లేదు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలలో పార్టీల మధ్య సంవాదంగా దీన్ని మార్చితే ప్రజలకు నష్టం.

రాజకీయ సవాళ్ల మధ్య హైడ్రా

ప్రకృతి వనరులను తమ కబంధహస్తాలలో బంధించిన 'ప్రయివేటు' వ్యాపార వర్గం ఉనికిని ఇప్పటి పరిస్థితి ఎత్తి చూపుతున్నది. ఈ వర్గంలో రాజకీయ నాయకులు, అధికారులు, భవన నిర్మాణదారులు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు. వీళ్లకు మద్దతుగా అనేక మంది ప్రొఫెషనల్స్ ఉన్నారు. ఈ వర్గం రాజకీయ పలుకుబడి ఉపయోగించి, మీడియాలో ఇంకా ఇతరత్రా ఉన్న సంబంధాలను వాడుకుని సమస్యను జటిలం చేసే ప్రయత్నాలను మొదలు పెట్టారు. మున్ముందు మతం, కులం, ప్రాంతం, పార్టీ, వగైరా అన్నీ రకాల వాదనలు వినపడుతూనే ఉంటాయి. చెరువులను చెరబడుతున్నప్పుడు పట్టించు కోని వ్యక్తులు ఇప్పుడు అన్ని రకాల వాదనలతో సిద్ధంగా ఉన్నారు.

రాజకీయ సవాళ్లకు ఇది సందర్భం కాదు. చెరువుల పరిరక్షణ ద్వారా మన నివాస ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చే అవకాశం ఉన్నది. భూగర్భ జలాలు, పచ్చదనం, ఖాళీ స్థలాలు పరిరక్షిస్తే, పెరిగే వేడి తగ్గి, ఉష్ణోగ్రతలు నియంత్రణలోనికి వస్తాయి. చెరువుల పునరుద్ధరణ మీద రాజకీయ నీలినీడలు పడకుండా హైడ్రా సంస్థ పనితీరు ఉండాల్సిన ఆవశ్యకతను ప్రస్తుత విష రాజకీయ సంస్కృతి గుర్తు చేస్తున్నది. హైడ్రా పనికి ప్రజల నిరంతర మద్దతు అవసరం ఉన్నది. ప్రజల మద్దతు రావాలంటే హైడ్రా తన పనిలో ప్రజల్ని భాగస్వాములు చేయాలి. పారదర్శక పద్ధతులను అవలంబించటం ద్వార మాత్రమే ఇది సాధ్యం.

ఫలానా ఆక్రమణను తొలగించే దమ్ము హైడ్రాకు ఉన్నదా? అని కొందరు రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. తమ అక్రమ నిర్మాణాన్ని లక్ష్యం చేసుకున్నారు, ఇంకెవరిదో చేసుకోలేదు అని హైడ్రా పనిమీద బురద జల్లుతున్నారు. సామాన్యులు గమనిస్తున్నారు. ఇట్లాంటి అనుమానాలకు సమాధానం హైడ్రా పనితీరు వల్ల వస్తుందని ఆశిద్దాం. ప్రకటనల వల్ల రాదు. కొంతకాలం ఓపిక పట్టాల్సిందే. సవాళ్లను విసిరే రాజకీయ నాయకులు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలలో భాగంగా చేస్తున్నారు. ఆక్రమించిన వారికి వేరే ఆక్రమణ గురించి ఆక్షేపించే హక్కు లేదు.అన్ని రకాల ఆక్రమణలు ఎత్తి చూపే హక్కు,ఆస్కారం, అవకాశం ప్రజలకు మాత్రమే ఉన్నది. అది కల్పిం చాల్సిన బాధ్యత హైడ్రా ఉన్నతాధికారుల మీద ఉన్నది.హైడ్రాకు బలం చేకూర్చాల్సింది ప్రజలే. కొందరి స్వలాభం వేలమందికి నష్టంగా మారిన తరుణంలో ప్రభుత్వం హైడ్రాతో ముందుకొస్తే దానికి మద్దతు ప్రకటించి, రాజకీయ ప్రాబల్యం నుంచి దానిని రక్షించుకుంటూ, చెరువుల పరిరక్షణలో ప్రజలు కూడా నడుము బిగిస్తే సవాలుగా మారిన చెరువుల పరిరక్షణ సాకారం అవుతుంది.

హైదరాబాద్ నగరమంతటా, బయటా కొన్ని వేల ఆక్రమణలు ఉన్నాయి. అన్ని ఒకే రోజు తొలగించడానికి హైడ్రా ఒక మంత్రం దండం కాదు. ఒక దాని వెంట ఒకటి తనకున్న వనరులను బట్టి ఆక్రమణలు తొలగిస్తే, కొత్త ఆక్రమణలు కూడా ఆగుతాయి. ఇది నిరంతర ప్రక్రియ. హైడ్రా తనదగ్గర ఉన్న సమాచారం మేరకు, ప్రజలు ఇస్తున్న సమాచారం జత చేర్చి కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. తయారు చేసిన చిట్టాలో కట్టడాల తొలగింపు, కూల్చివేతలకు ఒక ప్రాధాన్యత క్రమం ఏర్పాటు చేసుకోవాలి. ఇందులో రహస్యం ఏమి ఉంచకూడదు. ఆక్రమణల చిట్టా తయారుచేసి ఎప్పటికప్పుడు ప్రజలముందు పెట్టాలి.ఈ చిట్టా తీసుకుని ఆక్రమణలను తొలగిస్తూ చెరువుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టాలి. ఒక దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తే ప్రజలు కూడా ఆమోదిస్తారు.

పేదలకు పునరావసం కల్పించాలి

ఆక్రమణలు కూడా అనేక విధాలుగా సంవత్సరాలుగా జరిగిన దరిమిలా కూల్చివేతలు కూడా ఆ మేరకు విభిన్నంగా ఉండాలి. కొన్ని చెరువులోపల కడితే, కొందరు చెరువు ఒడ్డున కట్టారు. కొందరు దొడ్డిదారిన అనుమతి తెచ్చుకుంటే, ఇంకొందరు అనుమతి లేకున్నా కట్టుకున్నారు. కొందరు తెలియకకొంటే, అనేకులు తెలిసి ఆక్రమించారు.ఏ విధంగా ఆక్రమణ జరిగినా, ఎప్పుడు జరిగినా, చివరికి ఆక్రమణలు ఉండడమే కొలమానం. కట్టడాల తొలగింపు, కూల్చివేతలు వంటి మొదటి అడుగులు అమాయకులు, పేదలు, బలహీనులు మీద పడకుండా జాగ్రత్త పడాలి. అటువంటి సందర్భంలో వాళ్ల విషయంలో, హైడ్రా తొలి అడుగు వారి పునరావాసానికి ఇచ్చి, ఆక్రమణల నిర్మూలన తదుపరి చేపట్టాలి. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వంటి చెరువుల చుట్టూ, లోపట ఉన్న ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి. ఈ జంట జలాశయాల పునరుద్ధరణ వేగంగా, పూర్తి స్థాయిలో సంపూర్ణంగా చేసి హైడ్రా తన పనితీరు మెరుగుపరుచుకోవాలి.

ఇక్కడి ఆక్రమణలు అన్ని తొలగించి, పూర్తిగా పునరుద్ధరణ చేసి ఫలితాలు రాబడితే ప్రజలకు హైడ్రా పని మీద విశ్వాసం పెరుగుతుంది.

చెరువుల ఆక్రమణ వల్ల అనేక రూపాలలో ప్రజలకు, ప్రభుత్వానికి నష్టమవుతున్నది. ఆర్థిక నష్టం మీద అధ్యయనాలు, అంచనాలు లేవు. చేస్తే ప్రజలు హైడ్రా చర్యలను బేరీజు వేసుకునే అవకాశం వస్తుంది. హైదరాబాద్‌లో చెరువులలో వర్షపు నీటిని నిలువ చేసుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. ఏ ఒక్క చెరువు కూడా కాలుష్యరహితంగా లేదు. పడ్డ ప్రతి వర్షపు చుక్కా కొన్ని క్షణాలలో కలుషితం అయిపోతున్నది. మరి మంచినీరు ఎక్కడ నుంచి వస్తున్నది? నిత్యం అవసరమయ్యే మంచి నీరు ఎక్కడి నుంచో వస్తే దాని ఖరీదు ఎంత? మంచి నీటి మీదనే ఖర్చు పెట్టడం వల్ల హైదరాబాద్ జలమండలి మురుగు నీటి పారుదల వ్యవస్థ మీద పెట్టుబడి పెట్టడం లేదు. ప్రతి రోజు దాదాపు 1800 మిలియన్ గ్యాలన్ల మురుగునీరు పరివాహక ప్రాంత చెరువుల ద్వార మూసినదిలోకి చేరుతున్నది. చెరువులలో దోమలు, దోమల వల్ల రోగాలు, వైద్యానికి కోట్ల రూపాయలు ప్రజలు ఖర్చు పెడుతున్నారు. ఒక్క అపార్ట్‌మెంట్, ఒక్క కాలేజి, ఒక్క లేఔట్ వల్ల చెరువు నాశనం. చెరువు నాశనం వల్ల చుట్టుపక్కల నివసించేవారికి కష్టం, నష్టం. ఈ ఆర్థికభారం భరించేకంటే చెరువులను పరిరక్షిస్తే జీవనం సుఖం.కాబట్టి హైడ్రా పనిచేస్తే ప్రజలకే లాభం.

పర్యావరణ వ్యవస్థ నిర్మాణమే ప్రధానం

చెరువుచుట్టే పల్లెలు, పట్టణాలు నిర్మాణమైనవి. అటువంటి చెరువును నీటి వనరుల సుస్థిరత మీద ఆధారపడ్డ డెక్కన్ పీఠభూమిలో కొందరు స్వార్థపూరితంగా కబ్జాచేస్తే, ఆక్రమిస్తే ఫలితాలు మొత్తం జీవనం మీద పడుతుంది.ఆరోగ్యకరమైన చెరువుల మీద ఆధారపడి మను ష్యులు, మొక్కలు, సూక్ష్మజీవు లు, జంతువులు మనగలుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సరస్సుల ద్వార ఆహారం వస్తుంది. అనేక జీవనోపాధులు చెరువుల మీద ఆధారపడి ఉంటాయి. వినోదానికి, ఆహ్లాద కరమైన వాతావరణానికి చెరువులే పరిష్కారం.మానవ జీవనం లో చెరువులకు చాలా విలువ ఉన్నది.

ఆరోగ్యం పెంపొందించే చేపలు, ఇతర జలచరాల కోసం చెరువులు ఎప్పటి నుంచో ఉపయోగిస్తున్నాము. చెరువులు కలుషితమైతే, వాటి విస్తీర్ణం తగ్గితే ఇవేవి కూడా మనకు అందవు. పుడమి మీద ఉష్ణోగ్రతలు తగ్గించడానికి, వరదలను నివారించడానికి చెరువులు సహాయపడతాయి. భూ ఉపరితలంలో 5-8 శాతాన్ని మాత్రమే ఆక్రమించినప్పటికీ, సరస్సులు, నదులు, చిత్తడి నేలలు ప్రపంచ నేల కార్బన్ లో 20-30 శాతం నిలువ చేస్తాయి. మానవులు వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడంలో దిగజారిన పర్యావరణ వ్యవస్థలను తిరిగి నిర్మించడం తొలి మెట్టు కాగా చెరువులను రక్షించడం, పునరుద్ధరించడం వంటి ఉపశమన ప్రయత్నాలు ఈ తొలి మెట్టు అందుకోవడంలో చాలా కీలకం.

హైడ్రా చేస్తున్న పని ప్రస్తుత తీవ్ర వాతావరణ మార్పుల నేపథ్యంలో, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవ డంలో భాగంగా మనం చూడాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే చెరువులు చాలా అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్ర తలను తగ్గించాలంటే పచ్చదనం, చెట్లు అవసరం. పచ్చద నానికి, చెట్లకు చెరువులు అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే నీటితో నిండిన చెరువుల పాత్ర చాలా ముఖ్యం. ■



> హైడ్రా చేస్తున్న పని ప్రస్తుత తీవ్ర వాతావరణ మార్పుల నేపథ్యంలో, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో భాగంగా మనం చూడాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే చెరువులు చాలా అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే పచ్చదనం, చెట్లు అవసరం. పచ్చదనానికి, చెట్లకు చెరువులు అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే నీటితో నిండిన చెరువుల పాత్ర చాలా ముఖ్యం.

జాన్సన్ గ్లోబల్‌లో విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవం

నవతెలంగాణ - కరీంనగర్ : నగరంలోని స్థానిక జాన్సన్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా గెలుపొందిన విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు.ముఖ్య అతిథిగా రసాయన శాస్త్ర ప్రొఫెసర్, కెప్టెన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదనరెడ్డి హాజరయ్యారు. పాఠశాల కెప్టెన్, కల్చరల్ కెప్టెన్ డిసిప్లెన్ కెప్టెన్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. పాఠశాల చైర్మెన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్ రెడ్డిలు మధుసూదన్ రెడ్డిని శాలువా, మెమోంటోలతో సత్కరించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు.




ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్, డైరెక్టర్లు స్పోర్ట్స్ లాంప్‌ని వెలిగించి జెర్సీ టీ షర్ట్‌ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం తెలుగు ఉపాధ్యాయులను, పీఈటీలను ఘనంగా సత్కరించింది.

యుద్ధాలతో పోలిస్తే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు

యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మతుల సంఖ్య ఎక్కువగా ఉంది. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏడాదికి 1.5లక్షల మందిమేర మరణిస్తున్నారు. 3లక్షలమందికిపైగా గాయపడుతున్నారు. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. అసలు రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్‌లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి.

-ఎఫ్ఐసీసీఐ (ఫిక్కీ) రోడ్ సేఫ్టీ అవార్డు, కాంక్లేవ్ 2014 కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వాఖ్యలివీ...

రోడ్‌సేఫ్టీ లేకనే... ప్రాణాలు గాల్లోకి...



ప్రమాదాల్లో ఎక్కువశాతం గతుకులు, ఇరుకైన రోడ్లపైనే...

- అతివేగం, నిద్రలేమితోనే సుదూర డ్రైవింగ్, డ్రంక్‌అండ్ డ్రైవ్‌లూ కారణమే!
- ఈ రోడ్డుపైనే పలుచోట్ల యథేచ్ఛగా భారీ వాహనాల నిలిపివేత
- ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయిన తారు, గుంతలమయంగా రోడ్డు
- కరీంనగర్ జిల్లా పరిధిలోని ఈ రోడ్డుపై 15 డేంజర్ జోన్లు గుర్తింపు
- బొమ్మకల్ బైపాస్‌లోని ప్రమాదకరంగా ఆర్‌యూబీ దారి
- బాటిల్‌నెక్‌గా ఉన్న ఈ రోడ్డుపైనే 8ఏండ్లలో 64మంది మృతి
- చిద్రమైన వరంగల్, నిజామాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డు

రోడ్డు ప్రమాదాలకు అతివేగం, మద్యంసేవించి వాహనలు నడపటం, సుదూరప్రాంతాలకు నిద్రలేమితో డ్రైవింగ్ చేయడం వంటి కారణాలు ఒకెత్తయితే గుంతలమయంగా, ఇరుకుగా ఉండే రోడ్లు, ప్రమాదకర మూలమలుపులు, ప్రమాద హెచ్చరికబోర్డులేని ప్రాంతాలు .. ఆయా దారుల గుండా వచ్చే వాహనాల ప్రమాదాలకు కారణభూతులవుతున్నాయి. ప్రాణాలు గాల్లో కలిపేస్తున్నాయి. జిల్లాలో ఏటా వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండగా.. 150 నుంచి 200లోపు మరణాలు సంభవిస్తున్నాయి. వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ సైతం యుద్ధాలు, ఉగ్రవాద ఘటనల్లోకంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మరణిస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలు జిల్లాలోని రోడ్‌యాక్సిడెంట్స్ లెక్కలకు సరితూగుతున్నాయి.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజీవ్‌రహదారిపై 15 డేంజర్ జోన్లను గతంలోనే పోలీసులు గుర్తించారు. జిల్లాలో గన్నేరువరం మండలం గుండ్లపల్లి నుంచి కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ వరకు 31 కిలోమీటర్ల దూరం వరకు ఉన్న రాజీవ్‌రహదారి విస్తరించి ఉన్నది. ఈ మధ్యలో 15 డేంజర్ జోన్లను పోలీసులు గతంలో గుర్తించారు. ప్రమాదకరమైన మూల మలుపులు, వివిధ గ్రామాల స్టేజీలను డేంజర్ జోన్లుగా గుర్తించారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నాలుగు వరుసలతో స్టేట్ హైవే-1గా రాజీవ్ రహదారిని నిర్మించినా మూలమలుపులు సరిచేయక పోవటంతో ప్రమాదకరంగా తయారయింది.

మూడేండ్లలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు		
సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు
2021	538	181
2022	533	183
2023	598	170

జాతీయ రహదారులు పూర్తయితేనే...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, లక్షెట్టిపేట పట్టణాలు, గ్రామాలు ఉన్న చోట బైపాస్‌లు నిర్మించి, మిగితా ప్రాంతాల్లో రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. సుమారు 131.8 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ మార్గం అత్యధికంగా జగిత్యాల జిల్లాలో 69 కిలోమీటర్లు, నిజామాబాద్ జిల్లాలో 30 కిలోమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 41 కిలోమీటర్ల పొడవున నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు నిర్వహించడానికి నిర్ణయించారు. ఈ మార్గంలో ఆరు నుంచి 12 కిలోమీటర్ల మేర భారీ బైపాస్‌లుంటాయి. ఇవే కాకుండా సుమారు ఎనిమిది ప్రాంతాల్లో చిన్న బైపాస్‌లను నిర్మించనున్నారు. రహదారి క్రాసింగ్‌ల వద్ద ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తారు. మంచిర్యాల వద్ద 63వ నంబరు జాతీయ రహదారి నాగ్‌పూర్-విజయవాడ 363 జాతీయరహదారితో అనుసంధానం కానున్న ఈ రోడ్డు మార్గంలో దాదాపు 46 వంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్‌వోబీలు ఉంటాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇంకోవైపు వరంగల్ నుంచి ఉమ్మడి జిల్లాలో ఎంటర్ అయి జగిత్యాల వరకు చేపట్టిన జాతీయ రహదారి పనులు ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం వరకు మాత్రమే సాగుతున్నాయి. ఈ మొత్తం జాతీయ రహదారి పూర్తయితే కరీంనగర్ నుంచి నిజామాబాద్ వెళ్లే, అటు వరంగల్ వైపు వెళ్లే రోడ్డులో ప్రమాదాలు తగ్గే అవకాశం లేకపోలేదు.



ఇరుకుగా మారిన నిత్యం రద్దీగా ఉండే కరీంనగర్ టూ నిజామాబాద్ ప్రధాన ఓరహదారి

అమ్మో.. 'బాటిల్‌నెక్' దారి

తకరీంనగర్ శివారులో చలిమెడ ఆస్పత్రి దాటిన తరువాత బొమ్మకల్ ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) వస్తుంది. ఇక్కడే గుంటూరుపల్లి బస్టాప్, బ్రిడ్జి కింద ఉన్న రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కరీంనగర్‌కు పని మీద వచ్చే పౌరులు, ఆస్పత్రికి వెళ్లే వారు ఈ దారిలోనే వెళ్తారు. ఆర్‌యూబీకి రెండు వైపులా 100 మీటర్ల పొడవున సింగిల్ రోడ్డు ఉంది. అది కూడా కరీంనగర్ వైపు కొంచెం వంగి, వంకరగా ఉంది. నగరం నుంచి గోదావరిఖని వైపు వెళ్లేవాహనాలు, అటు గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలు 80 నుంచి 100కిలోమీటర్ల వేగంతో దూసుకువస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు ఇరుకు ఉన్న సంగతి తెలియకుండానే ఒక వాహనాన్ని మరో వాహనం ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొడుతున్నాయి. లేదంటే రోడ్డు దాటుతున్నవారిని, పక్కన నిల్చున్నవారిని కొట్టేస్తున్నాయి. 2016 నుంచి 2023వరకు ఈ స్టేజీ వద్ద జరిగిన ప్రమాదాల్లో 69 మంది మరణించారని, 114 మంది గాయపడ్డారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

రోడ్డు సేఫ్టీ సహా ప్రమాదాలకు కారణాలేన్నో..

•చాలామంది రాత్రి అంతా వాహనాలను నడుపుతూనే ఉండే వారిలో తెల్లవారుజామున నిద్రలేమి ప్రభావం పడుతుంది. చివరకు ప్రమాదం జరుగుతుంది. •కారులో ప్రయాణించే వారందరూ సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నది నిబంధన. సీట్ బెల్ట్ పెట్టుకోవడాన్ని చాలా మంది, చిన్నచూపుగా భావిస్తుండగా.. కారు యాక్సిడెంట్‌కు గురైనప్పుడు ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోక ప్రాణాలు కోల్పోతున్నారు. •ఆటోలు, కార్లు, తుఫాన్ లాంటి వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను డ్రైవర్లు ఎక్కిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. •రహదారి వెంట క్రాసింగ్‌లు సరిగ్గా కనిపించకపోవడం, సిగ్నల్స్ లేకపోవడం, సూచిక బోర్డులు, హెచ్చరిక చిహ్నాలు, డివైడర్లు లేకపోవడం వంటి అనేక కారణాలవల్ల కూడా రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. •జిల్లాలోని రాజీవ్‌రహదారితో పాటు ప్రధాన రహదారుల పొడువునా విచ్చల విడిగా దాబాలు, హోటళ్లో మద్యం సిట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఈ దాబాల్లో వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్లనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు పలు సంఘటనల్లో పోలీసుల విచారణ సందర్భంలో స్పష్టమవడం గమనార్హం. •రాజీవ్‌రహదారిపై లారీలు, ఇతర భారీ వాహనాలు రాత్రి సమయాల్లో రోడ్డుపై నిలిపివేసిన డ్రైవర్లు పార్కింగ్ లైట్స్ వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

నేడు మానకొండూర్‌కు మంత్రి పొన్నం రాక

నవతెలంగాణ - మానకొండూర్



రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం మానకొండూర్‌కు రానున్నారు. ఇటీవల ప్రకటించిన మానకొండూరు వ్యవసాయ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన పాల్గొంటారు. మంత్రితోపాటు ఎమ్మెల్యే కవ్వంపల్లి కార్యక్రమంలో పాల్గొంటారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చారి కోరారు.

నగరంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

నవతెలంగాణ - జమ్మికుంట

మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని నగరం గ్రామంలో డాక్టర్ ఫర్హానుద్దీన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 78మంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఐదుగురు జ్వర పీడితులను గుర్తించి, వారి రక్త పూతల నమూనాలను సేకరించి వైద్య పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కి పంపించారు. ముగ్గురికి మలేరియా కిట్స్ ద్వారా పరీక్షలు, ఒకరికి డెంగీ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులపై, వ్యక్తి గత పరిశుభ్రతపై, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో సూపర్ వైజర్ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి అంకుసు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయి

హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్చార్జి ఓడితల ప్రణవ్ బాబు



స్టంప్స్ బాక్స్‌లో క్రికెట్ ఆడుతున్న ప్రణవ్ బాబు

నవతెలంగాణ - హుజురాబాద్ : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని, గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలని కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో స్టంప్స్ బాక్స్ క్రికెట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసేపు క్రీడాకారులతో క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామీణ క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయించి విద్యార్థులను మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువత సైతం చెడు మార్గంలో ప్రయాణించకుండా క్రీడల పట్ల ఆసక్తిని కనపరుస్తూ ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



నవతెలంగాణ - జమ్మికుంట : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ మండల స్థాయి క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి,జెండా ఆవిష్కరణ చేసి మునిసిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, ఎంపీడీఓ భీమేష్, స్థానిక కౌన్సిలర్ రావికంటి రాజు ప్రధాన ఉపాధ్యాయులు ఆకులసదానందం పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



విద్యార్థినులకు టీ షర్ట్‌లను పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలోని, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, గురువారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారమిత గ్రూప్ స్కూల్ హెచ్ఎం, మేనేజర్ ఇనుగంటి ప్రసూన ప్రసాదరావు పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్టులను అందించగా, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ నేషనల్ ప్లేయర్ (నెట్ బాల్) శ్రీహరికి రూ.2500 అందజేశారు. జాతీయస్థాయిలో హాకీ క్రీడాకారులను, తయారుచేసిన ఆర్న కొండ వ్యాయామ ఉపాధ్యాయులు, చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ పథకం కోసం వివరాల పరిశీలన

నవతెలంగాణ - చొప్పదండి



ప్రభుత్వం చేపట్టిన పంట రుణాల మాఫీ పథకంలో గురువారం నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు కుటుంబ సభ్యుల, అనుసంధానం కోసం నిర్వహించే సర్వేలో భాగంగా చొప్పదండి మండలం చాకుంట, కొలిమికుంట గ్రామాలలో గంగాధర డివిజన్ ఏడీఏ ప్రియదర్శిని పరిశీలించారు. ఈ సర్వే మండలంలో అన్ని గ్రామాలలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. వంశీకృష్ణ, ఏఈఓ సంపత్ రైతులు పాల్గొన్నారు.

వివేకానందలో ఘనంగా తెలుగుభాష దినోత్సవం

నవతెలంగాణ - గంగాధర :



గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో తెలుగుభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవంనను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు క్రీడా విన్యాసాలు చేపట్టగా, ఉపన్యాసాలు, పాటల పోటీలలోఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పి లక్ష్మారెడ్డి , డైరెక్టర్ అనంత రెడ్డి , హెడ్ మాస్టర్ నర్సింగరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ - హుజురాబాద్ : పట్టణంలోని లాడ్జీలు బస్టాండ్ ఇతర ప్రాంతాలను బుధవారం అర్ధరాత్రి తర్వాత పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హుజురాబాద్ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించి బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులను ఎందుకు రాత్రి ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని పలు లాడ్జిలకు వెళ్లి రిజిస్టర్లు తనిఖీ చేయడమే కాకుండా రూంలను తనిఖీ చేశారు. పట్టణంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఆయన వెంట హుజురాబాద్ ఎస్ఐ యూనస్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్‌ను కలిసిన న్యాయవాదులు



నవతెలంగాణ - భగత్ నగర్ : తెలంగాణ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌ను స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ ఖాజా అహ్మద్ ఇతర న్యాయ వాదులు హైకోర్టులోని ఆయన ఛాంబర్‌లో గురువారం కలిసి సమావేశం అయ్యారు. అనంతరం లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, స్టేట్ కన్వీనర్ ఖాజా అహ్మద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా లీగల్ సెల్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ నవీకరణ, హైడ్రా రూపకల్పన, నూతన రెవెన్యూ చట్టాల నిర్మాణంపై పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో న్యాయ పరంగా ప్రభుత్వం ఎదుర్కొనే సవాళ్లను లీగల్ సెల్ ఆధ్వర్యంలో పోరాడనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మోమిన్ రోషన్ జమీర్, ఖాజా అర్షన్ అహ్మద్, నిసార్ అహ్మద్ ఇతర న్యాయ వాదులు పాల్గొన్నారు.

సభ్యత నమోదు పార్టీకి పునాది

నవతెలంగాణ - వీణవంక : కార్యకర్తలే పార్టీ బలం, సభ్యత్వ నమోదు పునాది లాంటిది అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు అన్నారు. వీణవంక మండల కేంద్రంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యాశాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదని, బీఆర్ఎస్ కనుమరుగైందన్నారు. సెప్టెంబర్ 1న ప్రధాని మోడీ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తారని, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని, యువత, మహిళలు, రైతులను లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఐక్యమత్యంతో పోరాడాలి

- మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొనగంటి మల్లయ్య
- ఆత్మీయ సమ్మేళన కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ - జమ్మికుంట : మున్నూరు కాపులు పార్టీలకతీతంగా ఐకమత్యంతో పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొన్నగంటి మల్లయ్య అన్నారు. గురువారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుబ్బ మల్లన్న ఆలయము ఆవరణంలో కరపత్రం ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో పొనగంటి మల్లయ్య, సింగిల్ విండో అధ్యక్షులు పొన్నగంటి సంపత్ , బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆకుల రాజేందర్, మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏ బూసి శ్రీనివాస్ లు మాట్లాడారు. కుల పరంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1 ఆదివారం న మున్సిపల్ పరిధిలోని శ్రీ మల్లికార్జున దేవాలయ ఆవరణంలో మున్నూరు కాపు కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం, వనభోజనాల మహోత్సవము నిర్వహించబడునని కాబట్టి జమ్మికుంట, ఇల్లంతకుంట ,వీణవంక మండలాల లోని మున్నూరు కాపు కుల బాంధవులందరూ సకుటుంబ సమేతంగా వనభోజనాలకు రావాలని వారు పిలుపునిచ్చారు. మల్లన్న పట్నాలు వేయడం జరుగుతుందన్నారు. ఆట పాటలు ,సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు, సత్యానారాయణ, కరీంనగర్ డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప హరి శంకర్ విచ్చేయుచున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త ఆకుల రాజయ్య, కౌన్సిలర్ పొనగంటి రాము, మున్నూరు కాపు నాయకులు పుప్పాల రాజారామ్, తోట లక్ష్మణ్, పొనగంటి రవికుమార్ ,చేరాలు, పుప్పాల రఘు ,శ్రీధర్, పొనగంటి ప్రభాకర్, పొనగంటి రవీందర్, పొన్నగంటి విష్ణు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన బాధ్యత అధికారులదే

- గజం ఆక్రమించుకున్న ఉద్యమం తప్పదు
- జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్

నవతెలంగాణ - జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 629, 467, 286లో గల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ అన్నారు. గురువారం జమ్మికుంట తహసీల్దార్‌కు ప్రభుత్వ భూములు రక్షించాలంటూ వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాం శ్యామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు విలువైన భూములు కబ్జాలకు గురయ్యాయన్నారు. అధికారులు సైతం కబ్జా దారులకు అండగా నిలుస్తున్నారని, ఒకప్పుడు ప్రభుత్వ భూమి ఇప్పుడు ప్రైవేటు భూమిగా ఎలా మారిందని ప్రశ్నించారు. ఒకప్పటి పెసర బండ ప్రభుత్వ భూమిని జమ్మికుంటలో పుట్టి పెరిగిన ప్రతి ఒక్కరికి తెలుసని అలాంటి భూమి నేడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కబ్జా అయిందని దానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. భూ కబ్జా దారులకు, అధికారులు వత్తాసు పలకడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అమరేందర్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ జెడ్పీటీసీ

మన్నెంపల్లిలో జాతీయ క్రీడా దినోత్సవం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా మండలంలోని మన్నెంపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో విజయ్‌కుమార్ హాజరై 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు టీ షర్ట్, టైం, బెల్ట్ లను అందిస్తామని ప్రకటించారు. గ్రామానికి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారుడు మేడి అంజయ్యకు శాలువా కప్పి సన్మానించారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-రాయికల్:
జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని వార్డులలో తిరిగి రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పలు సమస్యలు,మరుగు దొడ్ల సమస్యలపై ఆసుపత్రి సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ సందర్శనలో ఎమ్మెల్యేతో పాటుగా మున్సిపల్ చైర్మన్ మోర హనుమాండ్లు,పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు గన్నె రాజిరెడ్డి,డా. శశి కాంత్ పాల్గొన్నారు.

ఓటరు లిస్టు తయారీపై సమావేశం



నవతెలంగాణ-కోరుట్ల
పట్టణంలోని ఎంపీడీవో ఆఫీసు లో గురువారం ఆర్డీవో ఆధ్వర్యంలో ఓట్లను మెర్జ్ చేసే ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లను మెర్జ్ చేయడానికి ప్లాన్ ఏలా చేస్తున్నారో ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో,సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలపై సమావేశం



నవతెలంగాణ-కోరుట్ల
పట్టణంలోని ఏంఈవో కార్యాల యంలో ఉపాధ్యా యులతో సమావే శం నిర్వహి ంచారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ సెప్టెంబర్ 2న అండర్ 14, 17సం వత్సరాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీ బాల్, సెప్టెంబర్ 3న బాలురలకు సెప్టెంబర్ 4న బాలబాలికలకు అథ్లెటిక్ పోటీలు ఉంటాయని ఇందులో కేజీబీవీ, సోషల్‌వెల్ఫేర్, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని, పోటీలో పాల్గొనే వ్యక్తులు 11.2008సంవత్సరంలో లేదా ఆతర్వాత జన్మించిన వారు అర్హులు అని అన్నారు.ఈపోటీలో పాల్గొనే విద్యార్థులు ఆయా పాఠశాలనుండి పుట్టినతేది ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని అన్నారు. వివరాల కోసం అశోక్ 9948765002, విజయ్ 9951518737 ఫోన్‌లో సంప్రదించాలని అన్నారు ఈసమావేశంలో ప్రాధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో వాగ్దేవి విద్యార్థినికి బహుమతి

నవతెలంగాణ-మల్యాల
త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళా శాసనములతో, ప్రజ్ఞా వికాస్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో నిర్వహించిన పాఠశాల, జిల్లా స్థాయి వ్యాస రచన, చిత్ర లేఖన పోటీ పరీక్షల ఫలితాలు మంగళవారం ముచ్చింతల్‌లో త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామిజీ చేతుల మీదుగా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీమ రక్షణ దళాలకు కృతజ్ఞత వ్యాస రచన విభాగంలో వాగ్దేవి విద్యార్థిని పులి నక్షత్ర తొమ్మిదో తరగతి జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది.అంతేకాక వ్యాస రచనలో బుర్ర వర్షిణి, చిత్రలేఖనంలో సిద్దెంకి అక్షయ లు ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారు. 33 జిల్లాల నుంచి ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల నుంచి సంయుక్తంగా చిత్రలేఖనం, వ్యాస రచన పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి రెండో స్థానం పొందిన విద్యార్థులకు సెప్టెంబర్ 2న రాష్ట్ర స్థాయి పోటీ పరీక్ష ముచ్చింతల్‌లో జీయర్ స్వామి ఆశ్రమంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. అదే రోజున వ్యాస రచన పోటీలలో బహుమతి పొందిన వారికి జిల్లా స్థాయి మొదటి స్థానం పొందిన వారికి రూ.6000, నగదు ప్రశంసా పత్రాన్ని, వ్యాస రచనలో జిల్లా స్థాయిలో రెండో స్థానం కోసం రూ.3000, రాష్ట్ర స్థాయిలో విజేతలకు మొదటి స్థానం కోసం రూ.10,000 నగదు ప్రశంసా పత్రాన్ని, రెండో స్థానం పొందిన వారికి రూ.5000ల నగదు ప్రశంసా పత్రాన్ని అందజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పోకల నరేష్ కుమార్, ఉపాధ్యాయ బృందం, పుర ప్రముఖులు, తోటి విద్యార్థులను అభినందించారు.



పులి నక్షత్ర

తెలుగు భాషా దినోత్సవం

నవతెలంగాణ-మల్యాల
మల్యాల మండల కేంద్రంలోని స్థానిక వాగ్దేవి పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి, బహుమతి ప్రధానం చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ పోకల నరేష్ తెలిపారు. తెలుగు భాషను కాపాడుకునేందుకు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేసినట్లు నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్



నవతెలంగాణ-మల్లాపూర్
గ్రామాలలో అర్హులైన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరుట్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నా రు. గురువారం మండలం లోని సాతారం గ్రామంలో ఇంటింటా సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని అన్నారు. జనవరి నెలలో 2007 సంవత్సరంలో జన్మించిన యువతి, యువకులకు ఫామ్ 6 ద్వారా ఓటు హక్కు నమోదు చేయించాలని అన్నారు. గ్రామాలలో మృతి చెందిన వారిని ఓటర్ లిస్ట్‌లో నుండి ఫామ్ సెవెన్ ద్వారా తొలగించాలని సూచించారు. ఓటు హక్కులు చేర్పులు మార్పులు ఉంటే ఫామ్ ఎయిట్ ద్వారా స్థానిక బిఎల్‌ఓను సంప్రదించాలని కోరారు. ఈక్కడ వెంట ఆర్ ఐ సురేష్, సిబ్బంది మురళి, బిఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-రాయికల్:



మండలంలోని మహితా పూర్ గ్రామానికి చెందిన రజక సంఘం సభ్యులు గ్రామంలోని పరంపోగు భూమిలో అక్రమంగా నిర్మాణం చేపడుతు న్నారని, గత 40 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన గేదెలను ఆ స్థలంలోనే మందగా ఆపుతున్నామని, అక్రమ నిర్మాణం చేపడితే గేదెలను ఆపడానికి ఆధారం లేకుండా పోతుందని సంబంధిత అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ విషయంపై తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూంను నవతెలంగాణ వివరణ కోరగా మోకపైకి రెవెన్యూ సిబ్బందిని పంపి విచారణ చేపట్టి అసైన్డ్ ల్యాండ్ అని తెలితే నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మరింత చేరువలో పోలీస్ విధులు

• జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ • మల్యాల పోలీస్ స్టేషన్ తనిఖీ



నవతెలంగాణ-మల్యాల
ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా మల్యాల పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా భరోసా కల్పించాలని, బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌ని సంప్రదించవచ్చని అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇక్కడికి వచ్చానని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టాయని, పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్ కార్, బ్లూ కోట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు దూరంగా ఉన్నప్పటికీ 10 నిమిషాల్లో చేరుకునేలా పని చేస్తున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి, పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేశారు. పోలీస్ స్టేషన్స్ పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో 5ఎస్ అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిసెప్షన్ వర్టికల్ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్స్‌ను పిటిషన్ మేనేజ్మెంట్లో ఎంట్రీ చేసిన డాటాను తనిఖీ చేశారు. రిసెప్షన్‌ఇష్ట్‌గా ప్రతి దరఖాస్తుపై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్‌లో జనరేట్ చేసినా రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు, సిస్టం, ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలు తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతా యుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని, ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చంధర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మల్యాల సీఐ రవి, ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా



నవతెలంగాణ-జగిత్యాల టౌన్
అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేసి తిరిగి రుణాలు ఇవ్వాలని ప్రజా సంఘల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ధ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసినట్లు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం, క్యాబినెట్ మంత్రులు రోజుకో ప్రకటన చేయడంతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారని, ఇప్పటివరకు 22 లక్షల రైతు ఖాతాలో 17 వేల 933 కోట్లు జమ చేసినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలప్పుడు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసి ఆచరణలో అనేక కొర్రీలు పెట్టి రైతు రుణమాఫీ 40 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు 3,71.157 మంది రైతులు అర్హుల జాబితాలో ఉంటే మూడు విడతల్లో కలిపి 1.15 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. రాష్ట్రంలో 40 లక్షల రైతులు అర్హులుగా ఉంటే కేవలం 22 లక్షల మందికి రుణమాఫీ చేశారని విమర్శించారు. జగిత్యాల జిల్లాలో 2.55.000 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. మండలం, బ్యాంకుల సొసైటీల వారీగా పరిశీలిస్తే కొన్నిచోట్ల 15 శాతం కూడా రుణమాఫీ కాలేదు. రైతుబంధు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ జరిగినప్పుడు రుణమాఫీతో సాంకేతిక సమస్యల ఎలా వస్తుందని, సాంకేతిక పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. సీపీఎం పార్టీ ప్రజా సంఘాల కన్వీనర్ తిరుపతి నాయక్ మాట్లాడుతూ మామిడి పంటలు పండించే రైతులకు అధిక వర్షాలు పంట నష్టం వాటిల్లిందని వారికీ కూడా తాగు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతులతో పాటు సీపీఎం పార్టీ జిల్లా నాయకులు గర్వందుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు మల్యాల సురేష్, వెలమలపల్లి వెంకటచారి, ఎండీ. సులైమాన్, ఎండీ. రఫీ, కోమటి చంద్రశేఖర్, బుర్ర శేఖర్, బచ్చల వినోద్, విజయ్, పాల్గొన్నారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం
తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వమే రేవంత్ సర్కార్ అని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సింగరావు పాల్గొని మాట్లాడారు. మాజీ శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అందుకే జుట్టు అందకపోతే కాళ్లు అనే రీతిలో వ్యవహరించాడని విమర్శించారు. ఇంతకు ముందు బీఆర్ఎస్ లో పనిచేసిన వారే కాంగ్రెస్ లోకి వచ్చారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికి అర్హతను బట్టి అందరికీ అవకాశం కల్పిస్తామని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లా డారు. చైర్మన్‌గా ఎన్నికైన బోర్గం రాజుకు ఇచ్చిన మాట ప్రకారమే ఆయనను చైర్మన్‌గా చేశామని అన్నారు. రైతుల పక్షాన పనిచేసి రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పాలకవర్గానికి సూచించారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి జువ్వాడి నర్సింగరావును, నూతనంగా ఎన్నికైన బోర్గం రాజు, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వెంకట్ రెడ్డిని గజమాలతో సత్కరించారు. అంతకుముందు పాలకవర్గం మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్ నేతృత్వంలో ప్రమాణస్వీకారాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో జెయన్ వెంకట్, కంతి మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, సింగిల్ విండో చైర్మన్లు బాస శ్రావణ్, అంకతి రాజన్న, మాజీ ఎంపీటీసీ వెంకట్, దేశెట్టి జీవన్, డైరెక్టర్లు భూక్య రాజేందర్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-జగిత్యాల:
పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుండి అయన అన్ని జిల్లా కలెక్టర్లతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా మండల, జిల్లా అధికారులు ప్రతి గ్రామపంచాయతీలో ఓటర్ల వివరాలు సరిచూడలన్నారు. ప్రతి గ్రామంలో 600 నుండి 650 ఓటర్లు ఉన్నట్లయితే, ప్రతి 50 మందికి ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఏలాంటి ఇబ్బందులు ఉన్న జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆ ఇబ్బందులను అధికమించాలని అన్నారు. సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించాలని అన్నారు.ఈ జాబితాపై సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలని వివరించారు. సెప్టెంబర్ 21న వార్డుల వారీగా తుది జాబితాను సిద్ధం చేయాలి అని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం, వార్డులో ఉండే విధంగా చేపట్టిన (ఓటరు మెర్జింగ్) ప్రక్రియను పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, గౌతమ్ రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి రఘువరన్, జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధు సుధన్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా దినోత్సవం

నవతెలంగాణ-మల్యాల
మండల కేంద్రంలోని స్థానిక వాగ్దేవి పాఠశాలలో క్రీడలు నిర్వహించి, విద్యార్థులకు గురువారం బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పోకల నరేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకొని పిల్లల్లో క్రీడా నైపుణ్యత పెంచేందుకు క్రీడలను నిర్వహించి బహుమతులు ప్రధాన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

తప్పులు లేకుండా సర్వే చేయాలి

బీఎల్‌వోలకు తహసీల్దార్ ప్రసాద్ సూచన



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం
గత కొన్ని రోజులుగా ఇబ్రహీం పట్నం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఎల్‌వో లు చేస్తున్న సర్వేలో తప్పులు దొరలకుండా సర్వేని చేయాలని బీఎల్‌వోలకు తహసీల్దార్ ప్రసాద్ సూచించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కోజన్ కొత్తూరు, ఎర్దండి, కోమటి కొండాపూర్, వర్షకొండ, గ్రామాల్లో చేస్తున్న సర్వేను తహసీల్దార్ పరిశీలించారు. ఇంటింటికి తిరుగుతూ సర్వే రిజిస్టర్‌లో ప్రతి ఇంటి వివరాలు పొందుపరచాలని సూచించారు. ఫోటో వివరాలు టిక్ చేయాలని అన్నారు. ఓటర్ జాబితాలో చేర్పులు మార్పులు సవరణలు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ గంగాధర్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-జగిత్యాల టౌన్
పట్టణ పురోహితుడు, బ్రహ్మశ్రీ రుద్రంగి నర్సయ్యశర్మ (96) బుధవారం సాయంత్రం 4-30 గంటలకు స్వర్గస్తులయ్యారు. ఈసందర్భంలో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్-రాధిక దంపతులు నర్సయ్య శర్మ పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. జర్నలిస్ట్ సిరిసిల్ల శ్రీనివాస్ స్వంత మామ అయిన బ్రహ్మశ్రీ రుద్రంగి నర్సయ్యశర్మ కుటుంబ సభ్యులను, శ్రీనివాస్ దంపతులను పరామర్శించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ నాయకులు అబ్బారి మల్లేశం తల్లి వెంకట్రజమ్మ బుధవారం మరణించగా వారి కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పరామర్శించారు. వీరి వెంట ఎల్ల రాజన్న, నలువా తిరుపతి, పుదరి శ్రీనివాస్, మహేష్, గంగారెడ్డి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-జగిత్యాల టౌన్
మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జగిత్యాల పట్టణ మినీ స్టేడియంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పూలమాల వేసి, క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం అని ముఖ్యమంత్రి అన్నారు. స్పోర్ట్స్ హబ్‌గా గచ్చిబౌలిని తీర్చిదిద్దుతామని అని ముఖ్యమంత్రి చెప్పారని అన్నారు. క్రీడలతో పాటు, విద్య విషయంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, రాష్ట్ర, కేంద్రం నిధులతో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. ముఖ్యమంత్రి క్రీడల పట్ల మంచి సానుకూల దృక్పథం కలిగి ఉన్నారని తెలిపారు. గతంలో వివేకానంద మైదానం అభివృద్ధికి నిధులు మంజూరు చేశానన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, స్థానిక కౌన్సిలర్ చుక్క నవీన్, జిల్లా అధికారులు డా.నరేష్, సాయిబాబా, కమిషనర్ సమ్మయ్య, డీవైఎంవో రవి, టీఎన్జీవో అధ్యక్షులు భోగ శశిధర్, రాజేందర్, నాగేందర్‌రెడ్డి, రవి బాబు, నాయకులు రామ్మోహన్ రావు, కొలగణి సత్యం, సుధాకర్, గిరి, శరత్ రావు, గట్టు రాజు, చారి, ఏనుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ-మేడిపల్లి
మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలో 2019-2024 వరకు పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహించిన ప్రవీణ్ కుమార్ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా వల్లంపల్లి గ్రామ పంచాయతీకి బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్లిన ప్రవీణ్ కుమార్‌కి తాజా మాజీ సర్పంచ్ ఆదే హన్మక్క ఉప సర్పంచ్ బన్న రాజేందర్, మాజీ సర్పంచ్ ఆదే లక్ష్మీరాజం, స్కూల్ హెడ్ మాస్టర్, గ్రామపంచాయతీ ప్రజలు,సిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానం చేశారు.

స్నేహితుడికి ప్లేట్లెట్స్ దానం



నవతెలంగాణ-మేడిపల్లి
మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భీమారం గ్రామానికి చెందిన బోయిని గంగాధర్‌కి అత్యవసర చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్త కణాలు అవసరమని వైద్యులు సూచించడంతో పల్లి అజయ్ భీమారం రక్త కణాలను అందజేశారు. అత్యవసర సమయంలో స్నేహితుడికి, ప్లేట్లెట్స్ దానం చేసిన పల్లి అజయ్‌ని పేషెంట్ కుటుంబ సభ్యులు, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది,స్నేహితులు బంధువులు అభినందించారు.

వేములకుర్తిలో ఘనంగా పెద్దమ్మ పండగ



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం
ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. గురువారం పోచమ్మ తల్లికి ముదిరాజ్ కులస్తులు బోనాలు చెల్లించుకున్నారు. ప్రతిష్ట కార్యక్రమానికి రామడుగు చెందిన బైండ్ల వాళ్ళ నృత్యాలు అలరించాయి. ఈనెల 26 నుండి సెప్టెంబర్ ఒకటో తారీకు వరకు పెద్దమ్మ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ముదిరాజ్ కులస్తులు తెలిపారు. కాగా అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు

ఆలయ నిర్మాణ దాతకు సన్మానం



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం
ఇబ్రహీంపట్నం మండలంలోని వేముల కుర్తి గ్రామంలో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మెట్పల్లి పట్టణాలకు చెందిన తిరుమల నర్సింగ్ హోమ్ వైద్యులు రాణవేణి సత్యనారాయణ 50వేల రూపాయలు ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందించారు. కాగా ఆయనను గురువారం దేవాలయ ఆవరణంలో ఘనంగా ముదిరాజ్ కులస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెంట లింబాద్రి, సున్నం రమేష్, లక్ష్మీ నర్సయ్య, శీను, రాజేష్, అజయ్, ముదిరాజ్ కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు

రుణమాఫీ కానీ రైతుల నుంచి పత్రాలు స్వీకరణ



నవ తెలంగాణ-రామగిరి
రుణమాఫీ-2024లో రైతు కుటుంబ నిర్ధారణ ప్రక్రియలో భాగంగా రామగిరి మండలం లోని రత్నాపూర్ రైతువేదికలో రుణమాఫీ ప్రక్రియను మంథని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రిక ల్చర్ అంజనీ పరిశీలిం చారు. ఇందులో భాగంగా రామగిరి మండలంలో ఉన్న బ్యాంకులలో రుణం తీసుకున్న రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతులు రేషన్ కార్డు లేని వారు కుటుంబ నిర్ధారణలో భాగంగా కుటుంబంలో అందరి సభ్యుల ఆధార్ కార్డులు, ధ్రువీకరణ పత్రాలు మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వేల్పుల నవీన్, అరవింద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ రిజర్వేషన్లపై తెగని పంచాయతీ!



ఆశావహుల్లో ఆందోళన

నవతెలంగాణ - కొనరావుపేట

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్ల పీటముడి వీడక ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఓవైపు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఓటరు జాబితా రూపకల్పనలో ఉమ్మడి జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు.. మరోవైపు ఎన్నికల బరిలో దిగేవారు ఇప్పటికే తమ అనుచరులతో పావులు కదుపుతున్నారు.. మాజీలు సైతం తమ బలాన్ని నిలుపుకొనే దిశగా ప్రణాళికలు రచించుకుంటున్నారు.. రిజర్వేషన్ల అంశం తేలితేనే తమ ప్రయత్నాలు ముమ్మరం చేసుకోవచ్చని వారు భావిస్తున్నారు.

కొత్త విధానంపై సమాలోచనలు?

గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలయ్యేలా చట్టం చేసింది. అయిదేళ్ల కిందట ఆ మేరకే ఎన్నికలు జరిగాయి. ఆ చట్టం ప్రకారం చూస్తే ప్రస్తుతం పాత రిజర్వేషన్లే అమలు కావాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కొత్త విధానం అమలు చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పాత రిజర్వేషన్లు రద్దు చేసి కొత్తవి ఎలా అమలు చేస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ అదే జరిగితే ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశముంది. మరోవైపు వార్డుల వారీగా ఓటర్లను విభజించి కుటుంబంలో ఓటు హక్కు కలిగిన వారందరినీ.. ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వినియోగించుకునే విధంగా జాబితా తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,210 గ్రామ పంచాయతీల్లోని 11,132 వార్డుల పరిధిలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే నెల 21న తుది జాబితా ప్రకటించనున్నారు. ఇప్పటి వరకు రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆశావహులు ఆందోళన పడుతున్నారు.

మీసేవ దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ



నవతెలంగాణ - తంగళ్లపల్లి

మీ సేవా ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. తంగళ్లపల్లిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్స్, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకుని ఎన్ని రోజులు అయిందని, ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకొని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో పెట్టవద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్ జయంత్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య దోపిడీపై ఈడీ, సీబీఐ దర్యాప్తు జరపాలి



పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ - భగత్‌నగర్ :

శ్రీచైతన్య విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీపై ఈడీ, సీబీలతో విచారణ జరపాలని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో పీడీఎస్‌యూ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా కరీంనగర్ ముకరాంపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించగా తొమ్మిదిమంది విద్యార్థి నాయకులపై పోలీసులతో అక్రమంగా కేసులు బనాయించడం సిగ్గు చేటన్నారు. విద్యాశాఖ అనుమతులు లేకున్నా శ్రీచైతన్య పాఠశాల నిర్వహిస్తుంటే జిల్లా డీఈవో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే ఈ పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనుమతి లేనిదే పాఠశాల నిర్వహిస్తూ ఫీజుల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తక్షణమే శ్రీచైతన్య యాజమాన్యం విద్యార్థి నాయకులపై మోపిన అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీచైతన్య విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీపై ఈడీ, సీబీఐ దర్యాప్తు సంస్థలతో విచారణ చేపట్టాలని కోరారు. అదే విధంగా దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థలలో విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 2025-2026 విద్యా సంవత్సరంలో ఈ విద్యా సంస్థల్లో అడ్మిషన్లను నిలిపి వేసేలా విద్యా శాఖను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ మరియు జిల్లా ఉపాధ్యక్షుడు రవితేజ, బాబు, రాకేష్, అశ్లాం, అజ్జాన్, సమీర్, రోహిత్, ప్రీతం, సాద్విక పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ - బోయినిపల్లి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన 156 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి బీసి సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి,నిమ్మ వినోద్ పాల్గొన్నారు.

చందుర్తి ఎంపీడీఓగా నటరాజ్



నవతెలంగాణ - చందుర్తి : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రుద్రంగి ఎంపీడీఓ నటరాజ్ చందుర్తి ఇంచార్జ్ ఎంపీడీఓ గురువారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపిడివోగా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్ రెండు నెలల సెలవుపై వెళ్లడం జరిగింది. ఎంపీఓ సురేందర్ బాధ్యతలు చేపట్టారు.

తెలుగు భాషపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ - చందుర్తి : ఆశిరెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు తెలుగు భాష పై ఉపాధ్యాయుడు(కవి) పెద్దింటి అశోక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచంలో మన మాతృ భాష తెలుగుకు ఎంతో గౌరవం ఉందన్నారు. తెలుగు భాషను మరువ వద్దని విద్యార్థులకు సూచించారు.

రుణమాఫీపై వ్యవసాయ అధికారుల సర్వే

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధి చందనంపేటలోని జిల్లా రైతు వేదికలో రుణమాఫీ కోసం సిరిసిల్ల మండల వ్యవసాయ అధికారి సందీప్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డు లేని రైతుల వివరాలు సేకరించారు. రైతుల నుండి వినతులు స్వీకరించారు. రుణమాఫీ కానీ రైతుల కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు వేదికల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు రైతులందరూ ఇట్టి అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజుకుమార్ ఉన్నారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ..

నవతెలంగాణ - కొనరావుపేట : కొనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పెంతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బివనపల్లి వెంకటేష్ 60.000 అమరం లక్ష్మి 45000 రాయికంటి గంగ భవాని 37000 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఖరీదైన వైద్యం చేయించుకుని అప్పుల పాలవుతున్నారని వారి కోసమే ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చేపూరి గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి అజీమ్ పాషా ,మానుక సత్యం గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ నరేష్ నాయక్ ,కర్ల రాజేష్, పూజ రాజం ,లింగంపల్లి జాను, లవన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన సీఐ

నవతెలంగాణ - హుజురాబాద్

విద్యార్థులు కేవలం పుస్తకాల పురుగుగా కాకుండా చదువుతోపాటు క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని క్రీడల వల్ల శారీరక వికాసం మానసిక ప్రశాంతత లభిస్తుందని హుజురాబాద్ టౌన్ సీఐ జి తిరుమల గౌడ్ అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడోత్సవాలను సిఐ తిరుమల్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నేటి యాంత్రిక యుగంలో తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలను ఆడడానికి ప్రోత్సహించడం లేదని, పిల్లలు కేవలం ఇండోర్ గేమ్స్ సెల్ఫోన్ కి పరిమితం అవుతున్నారని అన్నారు. క్రీడల వల్ల శారీరక పట్టుత్వం పెరగడమే కాకుండా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని అన్నారు. ఉపాధ్యాయులు సైతం పిల్లలు ఆటలు ఆడే విధంగా వారిని ప్రోత్సహించాలని ఆ వాతావరణం కల్పించాలని అన్నారు.

కబడ్డీ, ఖోఖో పోటీలు

మండల స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా గురువారం నుంచి శనివారం వరకు 14, 17ఏండ్లలోపు పిల్లలకు కబడ్డీ, కోకో క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎస్జిఎఫ్ కార్యదర్శి సొల్లు సారయ్య తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య సత్య ప్రసాద్ భాగ్యలక్ష్మి రేణుక ప్రవీణ ఎడ్వర్డ్ శ్రీనివాసు సత్యం అనిల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోవడం రమణ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ముందు సీఐటీయూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40ఏండ్లుగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ, అనేక ప్రభుత్వ కార్యక్రమాలలో భాగస్వాములై అంగన్వాడి ఉద్యోగులు సేవలందిస్తున్నరన్నారు. వీరికి నష్టం చేకూర్చే విధంగా గత ప్రభుత్వం జీఓ నెం 10 తీసుక వచ్చి 65 సంవత్సరాలు నిండిన అంగన్వాడీ టీచర్లకు ఒక లక్ష రూపాయలు, ఆయాలకు రూ.50 వేలు అందిస్తామన్నారు. దీనివల్ల అంగన్వాడి ఉద్యోగులు నష్ట పోతారని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేయగా, ఐసిడిఎస్ కమీషనర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క అంగన్ వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ క్రింద టీచర్లకు రూ. 2లక్షలు, ఆయాలకు ఒక లక్ష రూపాయలు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం ఐసిడిఎస్ అధికారులు జీఓ నెం 10 ప్రకారమే టీచర్లకు ఒక లక్ష ఆయాలకు రూ.50 వేలు అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు . ఇప్పటికైనా ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు ఒక లక్ష రూపాయలు అందించాలన్నారు. అదేవిదంగా వేతనంతో సగం పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏగమంటి ఎల్లారెడ్డి, సహాయ కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, పలువురు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

కుంగ్ ఫూ కరాటేలో ఇంగ్లీష్ యూనియన్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కుంగ్ఫూ కరాటే ఛాంపియన్షిప్ 2024 లో సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇంగ్లీష్ యూనియన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇందులో నరేష్ ,హారిని,ఆకాష్ లు బంగారు పతకాలు సాధించగా , శివతేజ సిల్వర్, రిత్విక్ తనుశ్రీ లు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాజకుమార్ విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పోక్సో యాక్ట్ -గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి..



నవతెలంగాణ - వేములవాడ

విద్యార్థులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో యాక్ట్‌లపై అవగాహన కలిగి ఉండాలి అని వేములవాడ ఏఎస్పీ శేషాద్రి రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలో ఇప్పటి వరకు 65పాఠశాలలు, కళాశాలలో పోలీస్ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శేషాద్రి రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 'పోక్సోపై చైతన్యం' అవగాహన కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లివద్ద గల నిర్మలా ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ,పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. జిల్లా పోలీస్ శాఖ విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులు జీవితంలో చక్కటి లక్ష్యాలను ఎన్నుకుని సరైన మార్గంలో శ్రమిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోలే కృషి చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నరు. మైనర్ బాలికలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని,తమ విలువైన జీవితం అంతా జైల్లోనే మగ్గిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిన్నారులు తమకు ఇంట్లో,పాఠశాలలో,వీధుల్లో పొరుగువారితో ఎదురయ్యే రకరకాల వేధింపులు, అసభ్య ప్రవర్తన,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ల గురించి నిర్భయంగా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని,తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్‌ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థినులు, మహిళలు మౌనం వీడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మహిళలు, విద్యార్థినులు జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425కు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన తీసుకుంటామని, పిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం, షీటీం ఏఎస్ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది రమాదేవి, ప్రియాంక, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా ఐసీపీఎస్ సిబ్బంది సఖీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

నవతెలంగాణ - ముస్తాబాద్

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద విద్యార్థులు ఆసనాలు, నృత్యాలు, పిరమిడ్స్, డంబెల్ ఎక్సర్సైజులు చేశారు. జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీల లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు బహుమతులు పంపిణీ చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ - ముస్తాబాద్

సామాజిక కార్యకర్త చింత బాలయ్య, మాజీ ఎంపీటీసీ పద్మ ఆధ్వర్యంలోమండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ముస్తాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెంటనే ఏర్పాటు చేయాలని పోస్ట్ కార్డుపై రాసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ డిగ్రీ చదువుకోవడానికి మండల కేంద్రం నుండి సుమారు 500 కు పైగా సిద్దిపేట, సిరిసిల్ల గంభరావుపేట లాంటి పట్టణాలకు విద్యార్థులు నానా ఇబ్బందులు పడుకుంటా వెళుతున్నారన్నారు. ప్రభుత్వం ముస్తాబాద్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంజూరు చేసినట్లయితే ఈ విద్యార్థుల తిప్పలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యాభిమానులు పాల్గొన్నారు

శాతవాహన యునివర్సిటీలో డిమాండ్స్ డే



నవతెలంగాణ - భగత్‌నగర్ :

అఖిల భారత విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బంది సమాఖ్య పిలుపు మేరకు గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బంది తమ డిమాండ్ల సాధనకై 'డిమాండ్స్ డే' ను నిర్వహించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ముందు జరిగిన ఈ ధర్నాలో విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలిపారు. ప్రధానంగా తమ డిమాండ్లలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విదనాన్ని రద్దు చేసి పాత పెన్షనన్ను అమలు చేయాలని, పాలక మండలిలో బోధనేతర సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డీ.ఏ.లను వెంటనే విడుదల చేయాలని, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తీర్చాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఇ.హెచ్.ఎస్.ను అమలుపర్చాలని కోరారు. అనంతరం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షులు వై. కిషోర్, పి.ప్రసాద్, భీమయ్య, టి.రాజేశ్వరి, నర్సయ్య, ఫసియుద్దీన్, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షులు సంతోష్, మారుతి, శ్రీకాంత్, జగన్, మాధురి, శేఖర్ పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీ టీం లక్ష్యం



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని సిరిసిల్ల ఎస్సై మల్లేశం అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం షీటీమ్స్ పనిచేస్తుందని, మహిళలు, విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీ టీంని సంప్రదించాలన్నారు. ప్రతీ మహిళా, విద్యార్థినులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తే షీటీం నంబరు 8712656425కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగుల శ్రీనివాసు గౌడ్, ఐసిడిఎస్, ఐసిపిఎస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్స్ జాగ్రత్త..

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణ, వేములవాడ రూరల్, బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిద రకాల నేరాలలో నిందితులుగా ఉండి రౌడీ షీట్లు,హిస్టరీ ఉన్న వారికి వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ .ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వివిధ నేరాల్లో నిందితులుగా ఉండి రౌడీ షీట్లు తెరువబడిన నేరచరితులు విధిగా పోలీసు వారు తెలిపిన సమయాల్లో పోలీస్ స్టేషన్ హాజరు కావాలన్నారు. లేకుంటే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. రౌడీ,హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి ఉన్న రౌడీ షీట్స్ ఎత్తివేస్తామన్నారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామన్నారు. పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరా దారులను పట్టుకుంటున్నామని అన్నారు.ఎస్పీ వెంట ఏఎస్పీ శేషాద్రిని రేడ్డి,సి.ఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్.ఐ లు మారుతి,పృథ్వీందర్ గౌడ్,అంజయ్య, పోలీస్ సిబ్బంది తోపాటు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత...

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలోని నామాపూర్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యమును పట్టుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. నామాపూర్ చివర్లో గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం మూడు ఆటోలలో అక్రమంగా తరలిస్తుంటే పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..

మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-కరీంనగర్: కరీంనగర్ క్రీడా పాఠశాలలో అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని, ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని, కోచ్‌లను నియమిస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వివిధ రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారి చిత్రపటాలతో పాటు వారి చరిత్రను తెలిపేలా క్రీడా పాఠశాలలో గ్యాలరీ ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ క్రీడా పాఠశాలలో ఈత కొలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన వివిధ రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేయాలన్నారు. కరీంనగర్ క్రీడా పాఠశాలకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మమేకమైన మంత్రి వారికి కావాల్సిన సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న పోషకాహారం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్‌సూట్‌తో పాటు స్పోర్ట్స్ షఉలను అందజేశారు. ఈ సందర్భంగా క్రీడా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన యోగా, కరాటే, జిమ్నాస్టిక్స్ ఆకట్టుకున్నాయి. ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్‌లోని స్పోర్ట్స్ పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫూల్ దేశయ్, మున్సిపల్ కమిషనర్ చాయత్ బాజ్‌పెయ్, ఆర్డీఓ మహేశ్వర్, డీవైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని లంబాడి ఐక్యవేదిక, భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారికి బుధవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో విష జ్వరాలతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, ఈ మేరకు ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ప్రైవేట్ ఆస్పతుల్లో ఇష్టానుసారంగా వైద్య పరీక్షల పేరిట ప్రజలను దోచుకుంటున్నారని, అట్టి ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్, లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు నరేష్ నాయక్, అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గం అధ్యక్షులు మాసం సుమన్ ,బహుజన సేన అద్యక్షులు జింక శ్రీధర్, నగరాజ్, విజయ్ , ప్రణయ్ మధు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలంలోని గిరిజన తండాలలో గుడుంబా తయారీ కేంద్రాలపై గురువారం ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. కొంతమంది కృష్ణ నాయక్ తండ, బుగ్గ రాజేశ్వరి తండా గ్రామాల్లో గుడుంబా తయారు చేసే అమ్ముతున్నారని సమాచారంతో ఎస్సై రమాకాంత్ పోలీస్ సిబ్బందితో కృష్ణనాయక్ తండాలో తనిఖీలు చేపట్టగా అదే గ్రామానికి చెందిన భూక్య రమేష్ తన ఇంటిలో గుడుంబా తయారు చేసి అమ్ముతుండగా పట్టుకొన్నారు. రెండు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బుగ్గ రాజేశ్వర తండాలో తనిఖీలు చేపట్టగా బదావత్ లత ఆమె తన ఇంటిలో గుడుంబా తయారు చేసి అమ్ముతుండగా సుమారు రెండు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులో తీసుకొని కేసు నమోదు చేశారు. ఇంకా ఎవరైనా గుడుంబా అమ్మిన, తయారుచేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపారు.

తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండల కేంద్రంలోని న్యూ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులైన కంకణాల రవి, పోరండ్ల కావ్యను ఘనంగా శాలువతో సత్కరించారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి వైతాళికుడిగా పేరుపొందిన గిడుగు వెంకట రామమూర్తి జన్మదిన సందర్భంగా నేడు తెలుగు భాష దినోత్సవం నిర్వహిస్తున్నామని, తెలుగు ఉపాధ్యాయులు, తెలుగు భాష, గొప్పతనాన్ని, తెలుగు కీర్తిని విద్యార్థులకు వివరించారు. పిల్లలకు తెలుగు భాష ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ సత్యం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సేంద్రీయ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్

నవతెలంగాణ-ముత్తారం:



రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ సూచించారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం వారు ముత్తారంలోని రైతు వేదికలో నేల ఆరోగ్య కార్డుల పంపిణీ, తల్లి పేరు మీద ఒక చెట్టు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకంను పెంచేలా రైతులు వర్మీ కంపోస్ట్ యూనిట్స్ స్థాపించాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులందరికీ నేల ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో ప్రమోద్, వ్యవసాయ విస్తరణ అధికారి మనీషా, వెటర్నరీ సర్జన్ రేఖ తదితరులున్నారు.

సింగరేణిలో జీవో నెంబర్ 22ను అమలు చేయండి

ముఖ్యమంత్రిని కోరిన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచాలని, లాభాల్లో వాటా, ఇతర సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తూ, సింగరేణికి లాభాలు తీసుకు వస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బుర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీతోపాటు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రత పరిరక్షణ ప్రథమ కర్తవ్యం

- గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్

నవతెలంగాణ-గోదావరిఖని:



శాంతి భద్రత పరిరక్షణ ప్రథమ కర్తవ్యం పని చేయడం జరుగుతుందని గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. గోదావరిఖని వన్ టౌన్ పరిధిలోని బాపూజీనగర్ ఏరియాలోనార్కోటిక్స్ డాగ్‌తో నిర్బంధ చెకింగ్‌ను గురువారం నిర్వహించారు. మొత్తం 80 మంది లోకల్, సాయుధ, ప్రత్యేక పోలీసులు నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సిఐ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడారు. ఈ ప్రాంతంలో చాలావరకు వేరువేరు జిల్లాల నుంచి, వేరువేరు రాష్ట్రాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఇండ్ల కిరాయికి తీసుకొని కూలి పనులు, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ఎవరైనా ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేసే అవకాశం ఉందన్న ఉద్దేశంతోనే ఈ నిర్బంధ చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు భూమేష్, రమేష్, శ్రీనివాస్, రామగుండం ఎస్ఐ సమ్మయ్య, టూటౌన్ ఎస్ఐలు ఎస్కె.ఫరీద్, అహ్మదుల్లా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:



విశ్వ విఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మంత్రి సీతక్క పాల్గొన్నారు. మంత్రులతో కలిసి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై నిర్బంధాన్ని తొలగించాలి



నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం నియోజక వర్గ పరిధిలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు గురువారం బంద్ పాటించి, నిరసన తెలిపారు. ముందుగా అత్యవసర సమావేశాన్ని చేపట్టారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టాలని తీర్మానం చేశారు. ప్రభుత్వం చేపట్టే కక్ష సాధింపు ధోరణి వీడనాడాలని, గ్రామీణ వైద్య వృత్తిని ప్రోత్సాహించి ఆర్‌ఎంపీ, పీఎంపీలపై నిర్బంధాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్ర మంలో అధ్యక్షులు కె.రాజేందర్, జి.సుదర్శన్, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, డి.సత్యనారాయణ, ముస్తాఫా, కార్యవర్గ సభ్యులు, 200మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

ఘనంగా తేజ్ మాత వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:



గోదావరిఖని శివాజీ నగర్ పోచమ్మ గుడిలో బొందిల కుల సంఘం ఆధ్వర్యంలో తేజ్ మాత మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోదావరిఖని పట్టణ ప్రజలందరికీ తేజ్ మాత మహోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో బొందిల కులస్తులు జరుపుకునే ప్రత్యేకమైన పండుగ తేజ్ మాత మహోత్సవమని తెలిపారు. ఈ వేడుకల్లో బైస జై సింగ్, బైస శంకర్ సింగ్, బైస కిషన్ సింగ్, బైస మల్లయ్య సింగ్, బైస లక్ష్మణ్ బాయ్, బైస జ్యోతిబాయ్, బైస కళ్యాణి బాయ్, బైస గంగాధర, బైస ప్రతాప్ సింగ్, బైస కిషోర్ సింగ్ తదితరులున్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల సమస్యపై భట్టి ప్రకటన చేయాలి

సీఐటీయూ అనుబంధ ఎస్‌సీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-గోదావరిఖని:

ఈనెల 31న సింగరేణి పర్యటనకు గోదావరిఖనికి వస్తున్న ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదల, ఇతర సమస్యలపై ప్రకటన చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపముఖ్య మంత్రికి లేఖ రాశారు. తెలంగాణలో అతిపెద్ద రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిలోని అన్ని విభాగాలలో నేడు సుమారు 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, బొగ్గు ఉత్పత్తిలో, సింగరేణి సాధిస్తున్న లాభాలలో, సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్ట్ కార్మికులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో వారికి వేతనాలు పెంచడంలో తీవ్రనిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. మల్లు బట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రిగా, ఇంధనశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే 2023 డిసెంబర్ లో నిర్వహించిన సింగరేణి మెదటి సమీక్షా సమావేశంలోనే సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, ఇతర సమస్యలపై చర్చ జరిపి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉన్నదని ప్రకటించారని, 2024 ఫిబ్రవరి 25న కొత్తగూడెంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం సందర్భంగాను తిరిగి దానిని పునరుద్ఘాటించారని, నాటి నుండి సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఆశతో వేతనాల పెరుగుదలకోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుదలపై సింగరేణి యాజమాన్యం కనీస స్పందన కూడా కనబర్చడం లేదని, 2022 సెప్టెంబర్ 9 నుండి 26 వరకు జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా 26.09.2022న లేబర్ అధికారుల సమక్షంలో ఒప్పందం జరిగిందని, ఈ ఒప్పందాన్ని కూడా సింగరేణి యాజమాన్యం అమలు చేయడం లేదని తెలిపారు. ఒప్పందం చేసుకొని కూడా బోనస్ పెంచడంలేదని పేర్కొన్నారు. లాభాల బోనస్ లేదని, ఇఎస్ఐకి చెల్లించాల్సిన 6 నెలల అడ్వాన్స్ డబ్బులను సింగరేణి చెల్లించలేదని తెలిపారు. ఫలితంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇఎస్ఐ అమలు కావడం లేదని, వేతనాల పెంపుదల విషయమై జీవో నెంబర్ 22 అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి 26.09.2022న లేఖ వ్రాసిందని, జీవో 22 ప్రకారం రోజుకి రూ.854 చెల్లించాలని, కానీ ఈ లేఖపై రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి నేటికి రిప్లై ఇవ్వలేదని అన్నారు. కోలిండియాలో ప్రస్తుతం అన్‌స్కిల్డ్‌కు రూ.1242 చెల్లిస్తుండగా, సింగరేణిలో అన్‌స్కిల్డ్‌కు రూ.522లు చెల్లిస్తున్నారని, ఫలితంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు రోజుకు రూ.720, నెలకు రూ.18,720 నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనని గెలిపిస్తే నెల రోజుల్లో కోలిండియా వేతనాలు సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు అమలు చేస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాగూర్ ప్రకటించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోదావరిఖనిలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో తమను గెలిపిస్తే సింగరేణి కాంటాక్ట్ కార్మికుల వేతనాలను పెంచుతామని ప్రకటించారని, ముఖ్యమంత్రి ఇల్లందు భూపాలపల్లి పర్యటన సందర్భంగా కూడా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రికి, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలకు ప్రజా ప్రతినిధులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చారని, .కాని నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచలేదని పేర్కొన్నారు. కానీ నేటి వరకు సింగరేణి కాంటాక్ట్ కార్మికుల వేతనాలను పెంచలేదని, ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నైనా రామగుండం ఎమ్మెల్యే, ఇతర కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని, ఉప ముఖ్యమంత్రితో ప్రకటన చేయించాలని బి.మధు ఆ లేఖలో కోరారు.



బి.మధు

గంజాయి రవాణా చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ అమలు

- అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:

నిషేధిత గంజాయి రవాణా చేసిన, సరఫరా చేసిన, విక్రయించిన కేసులు నమోదు చేయడం తోపాటు అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ సూచించారు. రామ గుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచి ర్యాల సబ్ డివిజన్ ఏసీపీ,సీఐ,పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అధికారులతో కమిషనరేట్‌లో యుఐ కేసులు, గ్రేవ్ యుఐ లాంగ్ పెండింగ్ కేసుల పరిష్కారం, ఎస్సీ, ఎస్టీ యుఐ కేసులు, విమెన్ ఎగైనెస్ట్ కేసులు, పోక్సో కేసుల పరిష్కారం, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులపై రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ గురువారం కమిషనరేట్‌లోని సమీక్షించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడు తూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులోఛార్జ్ షీట్ దాఖలు చేయాల న్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతోపాటు పూర్తి పారదర్శకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేయాలని, తద్వారా చట్టపరిధిలో నిందితులకి కఠినమైన శిక్షలు పడేలా చూడాలని అన్నారు. యుఐ కేసులను పెండింగ్ లేకుండా త్వరగా విచారణ చేపట్టి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు.

ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్ లాండ్ అండ్ ఆర్డర్ లాగా విభజించి నెల వారి ప్రణాళిక ముందుగానే తయారు చేసుకొని ఒక ప్రణాళిక ప్రకారం పని చేయాలని సూచించారు. ప్రజలు ఆపదలో ఉపయోగించే డయల్ 100 కాల్స్ పట్ల తక్షణమే నిర్దీత సమయంలో స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిరాల ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సీసీ అర్సీ ఇన్‌స్పెక్టర్ బుద్దెస్వామి, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, మంచిర్యాల సబ్ డివిజన్ సిఐలు, ఎస్సైలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామగుండం పోలీస్ కమిషనర్

పిల్లల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి

ఏసీపీ ఎం రమేష్

నవతెలంగాణ-రామగిరి

పిల్లలపై తల్లిదండ్రులు బాధ్యతను మరవకుండా అనునిత్యం వారి కదలికలను గమనిస్తూ ఉండాలని, అప్పుడే ఎలాంటి ఇబ్బందులు రావని, విద్యార్థులు ఆశయాలను అందుకునేందుకు కృషి చేయాలని జగిత్యాల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ అన్నారు. మంథని, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు ఓరియేంటేషన్ కార్యక్రమం మంథని కళాశాల ప్రిన్స్‌పాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా ప్రభాకర్, విశిష్ట అతిథిగా రమేష్ హజరై మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు కేవలం ఫీజుల చెల్లించి తమ బాధ్యత తీరిందను కుంటున్నారని, వారి ప్రవర్తన కదలికలను పట్టించుకోవడం లేదన్నారు. చదువుకున్న దానిని ఆలోచనలతో సరైన దారిలో పెట్టాల న్నారు. అప్పుడే వారి ఉన్నత స్థానానికి ఉపయో గపడుతుందన్నారు. నెగటివ్ ఓటమికి అడ్డుగోడలా ఉంటుందని, పాజిటీవ్ గెలుపును అందుకునేలా ఉంటుందని దీన్ని గమనించి ప్రతి విద్యార్థి పాజిటివ్ ఆలోచించాల న్నారు. చదువు సంస్కారం వేరుగా ఉండరాదు అన్నారు. సంస్కారం లేని చదువు అనర్ధకమ న్నారు. ప్రతి విద్యార్థి చెడు మంచి ఏదో నిర్ణయించుకొని ముందుకు సాగాలన్నారు. ప్రతి విషయాన్ని వాయిదా వేయకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటేనే విజయం సాధించగలరు అన్నారు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతాభావం ఉండాలన్నారు. నిరంతరం శ్రమిస్తేనే పెటుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డీఈఈ సతీష్, ఆఫీసు సూపరింటెండ్ రవికుమార్, లైబ్రరీ ఇంచార్జి రమణ, పరిపాలనాధికారి సుతుక్, నూతన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ ఎం.రమేష్

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వాహనాలకు నెంబర్ ప్లేట్స్ ఉండాలి

- నెంబర్ ప్లేట్స్ లేకపోతే చట్టరీత్యా చర్యలు
- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వాహనాలకు నెంబర్ ప్లేట్స్ ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ సూచించారు. లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అర్హత లేని వాహనాలపై ఉండే ప్రెస్, ఆర్మీ, పోలీస్, ఇతర శాఖల స్టిక్కర్లు ఉంటే తొలగించాలని, వాహనాలకు నెంబర్ ప్లేట్స్ ప్రభు త్వం నిర్దేశించిన విధంగా ఉండాల ని, వాహనాలకు బ్లాక్ ఫిలీంలు తొలగించాలని, వాహనాలకు సంబంధించి సరైన ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్రవాహనదారులు కంపెని నుండి వచ్చిన సైలెన్సర్ కాకుండా మాడిఫై చేస్తే వాటిని, సైరన్‌లు సెప్టెంబర్ 02 లోపు తొలగించాలని వాహనదారు లకు ముందస్తు సమాచారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

సెప్టెంబర్ 3 నుంచి రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో ప్రతి రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘించిన వారికి జరిమానాలు విధిస్తూ వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.



జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



క్రీడా వస్తువులు

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ యొక్క జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు.2024 ప్యారిస్ ఒలంపిక్స్ నందు భారత హాకీ జట్టుకు కాంస్య పతాకం సాధించడం ఎంతో గర్వకారణమని క్రీడలో ఆడడం వలన శారీరకంగా మానసికంగా ఎదగడానికి తోడ్పడతాయని క్రీడలవిశిష్టతను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు.పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు హరికృష్ణ మాట్లాడుతూ భారత హాకీ జట్టు ఒలంపిక్స్‌లో 1928 నుంచి 1956 వరకు ప్రపంచంలో వరుసగా ఆరు బంగారు పథకాలను సాధించినటు వంటి ఏకైక జట్టు మన భారత హాకీ జట్టు అన్నారు.1928,1932,1936 ఒలింపిక్స్ భారత హాకీ జట్టు నందు మేజర్ ధ్యాన్‌చంద్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి క్రీడా నైపుణ్యాన్ని భారతదేశానికి వరసగా మూడు బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. మన భారత ప్రభుత్వం అతని జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-జూలపల్లి

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటల ఎంపిక పోటీలు సెప్టెంబర్ 3,4వ తేదీలలో జూలపల్లి మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల ఎంఈవో కవిత ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని, మూడో తేదీన బాలికలకు, నాలుగో తేదీన బాలు రకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తామని ఎంఈ వో కవిత తెలిపారు. ఈ పోటీలు 14 సంవత్సరాలలోపు, 17 సంవత్సరాల లోపు విద్యార్థిని విద్యార్థులకు,14 సంవత్సరాల విభాగంలో1-1-2011, 17 సంవత్సరాల విభాగంలో1-1-2008ల తర్వాత జన్మించి ఉండాల న్నారు. తగిన జనన ధ్రువీకరణ పత్రాలతో, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు

రుణమాఫీ కాని రైతుల దరఖాస్తుల స్వీకరణ

ఏవో జూలపల్లి ప్రత్యూష



దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారిని ప్రత్యూష

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలంలోని కొనరావుపేట పెద్దాపూర్ గ్రామాల నుంచి రేషన్‌కార్డు లేని, రుణమాఫీ కాని రైతుల నుండి దరఖాస్తు స్వీకరిస్తున్నామని జూలపల్లి ఏవో ప్రత్యూష అన్నారు. జూలపల్లి మండల కేంద్రంలో రేషన్ కార్డులు లేకుండా ఉండి పంటరుణం మాఫీ కానీ రైతులను రైతు భరోసా యాప్‌లో వారి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నామని, 30న అబ్బాపూర్ రైతు వేదిక వద్ద, 31న కుమ్మరి కుంట గ్రామపంచాయతీ లో, 2న వడ్కపూర్ రైతు వేదిక వద్ద, 3న తేలుకుంట రైతు వేదిక వద్ద, 4న కాచాపూర్ గ్రామాలలో దరఖాస్తులు స్వీకరిస్తామని,తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు రేషన్ కార్డు లేని రైతులు సంబంధిత రైతు వేదికలలో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు బాగు చేసిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో ని ఆదర్శ పాఠశాల నుండి జూలపల్లి చొప్పదండి తారు రోడ్డు వరకు రోడ్డు మొత్తం వర్షపు నీటితో గుంతలు ఏర్పడగా బస్సులు పాఠశాల వరకు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. విద్యార్థులు 1కిమీ నడచి వెళ్ళాల్సి వచ్చేది.. విద్యార్థులకు సౌకర్యార్థం దృష్ట్యా పెద్దాపూర్ వాసి ఆదర్శ పాఠశాల పెద్దాపూర్ అటెండర్ సంకెళ్ళ లక్ష్మి రాజం 'చొరవ తీసుకొని పెద్దాపూర్ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు పెసరి పెద్దన్నని సంప్రదించగా 15 ట్రాక్టర్ల మొరం (మట్టి)పోయించి బ్లేడ్ ట్రాక్టర్ తో తారు రోడ్డు నుండి పాఠశాల వరకు గుంతలను చదును చేశారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, ట్రాక్టర్ యూనియన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బాలవికాస పథకం ద్వారా బ్యాటరీ సైకిల్ పంపిణీ

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన కదారి తిరుపతి వికలాం గుడికి బాలవికాస పథకం ద్వారా వచ్చిన బ్యాటరీతో నడిచే త్రీవీల్ సైకిల్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్,చొప్పరి రాజయ్య, కసిరెడ్డి మహేందర్ రెడ్డి, మచ్చ నాగరాజ్,ఆటో సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ఆటల పోటీలు

నవతెలంగాణ-రామగిరి



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని జేఎన్టీ యూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఇండోర్ ఆటలైన షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు గురువారం జరిగిన కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, జగిత్యాల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి ప్రభాకర్, మంథని కళాశాలల ప్రిన్స్‌పాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. షటిల్ పోటీల్లో సిహెచ్ వంశీ, జి సహస్రకు ప్రథమ బహుమతి, ఎ అభిరామ్, పి వశిష్టకు ద్వితీయ. క్యారమ్స్‌లో జై రోహిత్, జి యశస్వితకు ప్రథము, ఎం గౌతమ్, ఎస్.వర్షిత కు ద్వితీయ, చెస్ పోటీల్లో డి.అభిరామ్, సి శ్రావణికి ప్రథమ, బి శ్రీనివాస్, డి నిఖితకు ద్వితీయ బహుమతులు దక్కాయి. కార్యక్రమంలో డీఈఈ సతీష్ ఆఫీసు సూపరింటెండ్ రవికుమార్, లైబ్రరీ ఇంచార్జి రమణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవాలయానికి రూ. 5,016 ల విరాళం

నవతెలంగాణ-రామగిరి

సెంటినరీ కాలనీలోని శ్రీ రామాంజనేయ మేకల మార్కెట్‌లోని మైసమ్మ దేవాలయానికి రత్నాపూర్ తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు రూ.5వేల16 రూపాయలు విరాళం అందించారు. దేవాలయం 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం పూజలు నిర్వహిం చారు. పూజారి శ్రీనివాసాచార్యులు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి, మార్కెట్ సంఘం నాయకులు ఒర్రె సురేష్, ఒర్రె సదయ్య, అల్వాల తిరుపతి, బనుక అంజి, బత్తిని ఐలయ్య, అల్వాల వెంకన్న, ఎండీ. గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | 30 ఆగస్టు, 2024 | www.navatelangana.com

పాఠశాలకు రెండు బీరువాలు అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలురలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న ఎన్. సువర్ణ పాఠశాలకు రెండు బీరువాలు విరాళంగా ఇచ్చారు. తన కుమారుని వివాహ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలకు తన కుటుంబ సభ్యులతో కలిసి వాటిని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సునంద మాట్లాడుతూ పాఠశాలకు రెండు బీరువాలు ఇవ్వడం సంతోషంగా ఉందని, ఇక ముందు కూడా పాఠశాల అభివృద్ధిలో భాగంగా ప్రతి ఒక్కరు తనవంతుగా సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

నవతెలంగాణ-జన్నారం



అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలు నివారించుకోవచ్చని మండల అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపకాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. తమ సిబ్బందితో ప్రమాదం జరిగిన చోటుకు వచ్చి సాధ్యమైనంత వరకు ప్రమాదాన్ని అరికడతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాల్లో రాణించి ఉన్నత స్థాయిలో నిలవాలి

- **మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వం క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ అనేక విధాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన క్రీడా పోటీలకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యానచంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతాయని, విద్యపై ఏకాగ్రత పెరుగుతుందని, స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, జీవితంలో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంలో దోహదపడుతాయని తెలిపారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, వీటిని సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తితో నిజ జీవితంలో ముందుకెళ్లాలన్నారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలలో ఖోఖో, బాక్సింగ్‌లలో ఈ పాఠశాల నుండి ఇద్దరు బాలికలు పాల్గొని తమ ప్రతిభ కనబరిచారని, ఇదే స్ఫూర్తితో మరింత మంది క్రీడా రంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. విద్యాలయంలో ప్రేరణ ఉత్సవ్, పుస్తకోపహార్, పర్యావరణ దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవం తదితర అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ స్మార్ట్ పాఠశాలలో...

పట్టణంలోని ఆల్ఫోర్స్ స్మార్ట్ పాఠశాలలో క్రీడ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, చేస్, పరుగు పందెం, క్యారం ఆటలు ఆడించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇందులో విద్య సంస్థల అధినేత నరేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి మల్లేష్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ రమేష్, ఎస్ఐ శ్యామ్ పటేల్ హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంచిర్యాల : మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల : ఆల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



వేమనపల్లి : మాట్లాడుతున్న తహసీల్దార్ దాసరి మల్లేష్

రహదారిపై గుంతలు పూడ్చాలని ఆందోళన



నవతెలంగాణ-కాసిపేట

మండలం కొండాపూర్ యాపలోని రహదారిపై గుంతలు పూడ్చాలని, రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని ఆదివాసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రహదారి పూర్తిగా పడవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు పక్కన డ్రైనేజీలను ఆక్రమించి కట్టడాలు చేపట్టడంతో వర్షపు నీరు డ్రైనేజీ నుంచి వెళ్లకుండా రోడ్లపైనే నిలుస్తున్నాయన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులకు పోలీసులు నచ్చ చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, సామాజిక చైతన్య వేదిక సలహాదారులు మద్దివేణి చిన్న భీమయ్య, మండల అధ్యక్షులు పల్లె మల్లయ్య, ఆదివాసీ సేన మండల గౌరవాధ్యక్షులు మడావి గంగారాం, అధ్యక్షులు మడావి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, నాయకపోడ్ సంఘం కార్యదర్శి మంగ శ్రీకాంత్, సిడాం శంకర్, సిడాం రాందాస్, లావుడ్య నవీన్, ఆత్రం మహేష్, తరుణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



నవతెలంగాణ-వేమనపల్లి

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని డీఈఓ యాదయ్య అన్నారు. మండలంలోని క్యాతనపల్లి, కల్మల్‌పేట్, ముల్కల్‌పేట్, ఎస్టీ కాలనీలోని పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సమయానికి హాజరు కాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. క్యాతన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు సునీల్ కుమార్ సమయానికి పాఠశాలకు రానందున సస్పెండ్ చేశారు. అదే పాఠశాలకు చెందిన మరో ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. అనంతరం ముల్కలపేట ప్రాథమిక పాఠశాలను సదర్శించి ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయురాలు డి.కవితకు షోకాజ్ నోటీసులిచ్చారు. పాఠశాలలలో పలు రికార్డ్స్ పరిశీలించి, విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి కే.చౌదరి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.గిరిధర్ రెడ్డి, సీఆర్పీలు వెంకటేష్, అశోక్ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్, పంచాయతీరాజ్ కమిషనర్ అనితతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 3 దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు, తరువాత పురపాలక సంఘాల ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, క్షుణ్ణంగా పరిశీలించి తుది ఓటరు జాబితా సెప్టెంబర్ 21న విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఏవైన మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని, ఏ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా స్పష్టమైన జాబితా రూపొందించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని, నిర్వహణలో భాగంగా అదనపు పోలింగ్ సిబ్బందిని నియమించడం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి అందుబాటులో ఉండే విధంగా పర్యవేక్షిస్తామని, అధికారులు, సిబ్బందికి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వి.రాములు, భూసేకరణ ప్రత్యేక అధికారి చంద్రకళ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జన్మభూమి పేరుతో వెట్టిచాకిరి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం జన్మభూమి పేరుతో కార్మికులను వెట్టిచాకిరి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. ఆర్కే న్యూ టేక్ గని కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జన్మభూమి చేసిన కార్మికులను వర్క్ నామ్స్ ప్రకారం పనులు చేయాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం అవసరాల నిమిత్తం అండర్ గ్రౌండ్‌లో పనిచేసే కార్మికులను సర్ఫేస్‌లో యాజమాన్యం ఉపయోగించుకుంటే వారికి అండర్ గ్రౌండ్ అలవెన్స్ మినహాయింపు ఇవ్వొద్దని ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు 2008లో యాజమాన్యంతో ఒప్పందం జరిగిందని, కానీ నేడు యాజమాన్యం ఆ సర్క్యులర్‌ను తుంగలో తొక్కి అండర్ గ్రౌండ్ అలవెన్సును మినహాయిస్తుందన్నారు. యాజమాన్యం నాణ్యమైన పనిముట్లను అందించడంలో విఫలమవుతుందన్నారు. అనంతరం గనిలోని సమస్యలను గని మేనేజర్ దృష్టికి తీసువెళ్లగా సానుకూలంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజేషన్ కార్యదర్శి సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సహాయ కార్యదర్శి మర్రి సందీప్, నాయకులు అక్రమ్ పాషా, సిద్ధం అజయ్, కర్ర వెంకటేశం, శ్రీనివాస్, మోతే నారాయణ, షాకీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిరంతరాయంగా పారిశుధ్య పనులు కొనసాగాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పరిధిలో నిరంతరాయంగా పారిశుధ్య పనులు కొనసాగాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు సూచించారు. మొబైల్ యాప్ తనిఖీలో భాగంగా గురువారం నర్సింగాపూర్ గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనుల నిర్వాహణ తీరును పరిశీలించారు. ప్రతి రోజు అంతర్గత రోడ్లు శుభ్రం చేయడంతో పాటు డ్రైనేజీల్లో మురుగు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కన్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ పరిధిలో వారంలో ఒక రోజు నీటి పాత్రలను ఆరబెట్టుకోవాలన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులపై గ్రామీణులకు అవగాహణ కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా చూడాలన్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్ సంధర్శించిన ఆయన కంపోస్ట్ పిట్‌లో ఎరువు తయారి విధానాన్ని పరిశీలించి తగు విధంగా వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



పీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకు స్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్, కలెక్టర్

నవతెలంగాణ-జైపూర్

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి గురువారం భీమారం మండల కేంద్రంలో రూ. 43 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గానికి సంబంధించి రెండు పీహెచ్‌సీలు, ఒక సబ్ సెంటర్ మంజూరు చేస్తూ నిదులు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య కేంద్రాల ద్వార ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయని తెలిపారు.

జైపూర్‌లో..

జైపూర్ మండలం వేలాల గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రానికి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. మొదటి సారి వేలాల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ కుమార్ దీపక్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. అనంతరం గంగిపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రమాదంలో గాయపడిన మాజీ సర్పంచ్ లింగారెడి కుమారుడిని పరామర్శించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు, కుందారం పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

సింగరేణి లాభాల్లో 35 శాతం వాటా ఇవ్వాలి

నవతెలంగాణ-జైపూర్

2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన లాభాలు ప్రకటించడంతో పాటు కార్మికులకు సంబంధించిన 35 శాతం వాట వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి అంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇందారం-1ఏ గని కార్మికులతో కలిసి గురువారం గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ రద్దు చేసి తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలన్నారు. సింగరేణి కార్మికులు సొంతింటి పథకం అమలు చేయాలని, సింగరేణికి రావల్సిన రూ.29 వేల కోట్లకు పైగా ఉన్న బకాయిలను వెంటనే రాబట్టాలన్నారు. మారు పేర్ల మార్పిడి సమస్యను పరిష్కరించాలని, పెర్క్స్ మీద ఇన్కమ్ టాక్స్‌ను కార్మికుల తరపున సింగరేణి యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై ఉన్నత స్థాయిలో విచారణ జరిపించాలని, 2021-22 సంవత్సరానికి 0.1 శాతం తక్కువగా కట్టిన సీఎంపీఎఫ్ వడ్డీ కట్టించాలని, సీఎంపీఎఫ్ పెన్షన్ లెక్కల్లో జరిగిన తప్పులను సరి చేసి ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈపీ అపరేటర్లకు ఇతర కార్మికులకు రావల్సిన ప్రమోషన్లను బ్యాక్ డేట్‌తో వర్తింపజేయాలని, 11వ వేజ్‌బోర్డు జీతం ప్రకారం పెన్షన్, గ్రాట్యూటీ రివీజన్ చేసి వెంటనే చెల్లించాలన్నారు. మైన్స్, డిపార్ట్‌మెంట్లలో పని చేసే కార్మికులకు ఎన్-1 రద్దు చేసి ఫ్లేడే, పీహెచ్‌డీలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెజార్టీ ఓట్లు వచ్చిన సంఘానికి రెండు సంవత్సరాల కాల పరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలని, అప్పటి వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన స్థానం కల్పించాలన్నారు. అదేవిధంగా స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు కిషన్ రెడ్డి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి నవీన్, గోడకుంట శంకర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రుణమాఫీలో రేషన్ కార్డు లేని కుటుంబాల సర్వే



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల గ్రామంలో గురువారం రుణమాఫీ పథకంలో రేషన్ కార్డు లేని రైతులకు కుటుంబ సభ్యుల ధృవీకరణపై మండల వ్యవసాయ అధికారి సంగీత సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డు లేని రైతులకు మాత్రమే ప్రస్తుతం సర్వే నిర్వహించి ప్రత్యేకంగా ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో లైవ్ ఫోటో తీసి ఆప్‌లోడ్ చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారి ఆక్రముల్ల, కవ్వాల రైతులు సక్రు నాయక్, కలిరాం, బానావత్ రమేష్, మహేముద్, సతన్న పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న కుల వివక్ష

- కుటుంబాలను బహిష్కరిస్తున్న కుల పెద్దలు
- ఒంటరి వాళ్లమయ్యామని కుటుంబాల మానసిక ఆందోళన

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో అజ్ఞానం, వివక్ష రాజ్యమేలుతూనే ఉన్నాయి. రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామంలో ఇటీవల ఒక బీసీకులం వారు కుటుంబ గొడవలను కులానికి రుద్ది కొంతమంది కులపెద్దలు కలిసి.. మాట వినని ఆ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఆ కుటుంబం వారు ఇటీవల కాటమయ్య స్వామికి, ఎల్లమ్మ తల్లికి బోనంతో వచ్చి నైవేద్యం పెడుతుండగా కొంతమంది కులపెద్దలు అడ్డు చెప్పారు. "మీరు దేవుడికి బోనం పెట్టడానికి వీల్లేదు" అని పంచాయితీ పెట్టి బోనం పెట్టకుండా వెళ్లగొట్టారని సమాచారం. కులంలోనే వివక్షకు గురి చేయడంతో ఆ కుటుంబం మానసిక ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. అదే గ్రామ పరిధిలోని మధిర గ్రామంలోని ఒక సామాజికి తరగతికి చెందిన కుటుంబంలో పంచాయితీ ఏర్పడగా పుల్ల కట్టారు (వేశారు). కుటుంబ సభ్యులలో ఒకరు వినడం లేదని, ఆ కుటుంబంతో కులస్తులు ఎవ్వరూ మాట్లాడరాదని, కులపెద్దల నిర్ణయానికి కట్టుబడి ఉండకుంటే 5వేల రూపాయల జరిమానా విధించబడుతుందని హుకూం జారీ చేసినట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా ఆ గ్రామాల వైపు అధికారులెవరూ వెళ్లలేదని తెలుస్తోంది.

తుపాకీతో బెదిరించి ..

- దారి దోపిడీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్
- రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రోడ్డుపై వెళ్తున్న ఒంటరి వ్యక్తులను టార్గెట్ చేసుకొని తుపాకీతో బెదిరించి అందిన కాడికి దోచుకుంటున్న దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ చింతామణిని శ్రీనివాస్ గురువారం మీడియాకు వెల్లడించారు. బీహార్‌కు చెందిన మహమ్మద్ మసూద్ అలం, మహమ్మద్ దిల్బర్, మొహమ్మద్ షానావాజ్.. ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు తమ సొంత రాష్ట్రం బీహార్‌కు వెళ్లి ఒక తుపాకీ కొనుగోలు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా తిరుగుతున్న వ్యక్తులను తుపాకీతో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్లు తీసుకొని వెళ్తున్నారు. ఈనెల 22న జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఒక వ్యక్తిని ఈ ముగ్గురు వ్యక్తులు తుపాకీ, కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.11 వేల నగదును తీసుకొని వెళ్లారు. అలాగే, కిస్మత్‌పూర్ బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న ఒక బైక్‌ను ఆపి అతని వద్ద ఉన్న రూ.200 తీసుకున్నారు. ఈ రెండు ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముఠాలో ప్రధాన నిందితులు మహమ్మద్ ముర్షద్ ఆలాం, మొహమ్మద్ దిల్బర్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహమ్మద్ షానావాస్ మాత్రం పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి ఒక తుపాకీ, తూటా, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ఇల్లు అద్దెకిచ్చే విషయంలో ఇంటి యజమానులు వారిని పూర్తిగా విచారించి వారి ఆధార్‌కార్డు తీసుకున్న తర్వాతనే అద్దెకి ఇవ్వాలని డీసీపీ సూచించారు. వారిపై ఎలాంటి అనుమానం ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన పోలీస్ సిబ్బందికి డీసీపీ రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, డీఐ విజయ్‌కుమార్, రాజేంద్రనగర్ సీఐ, తదితరులు పాల్గొన్నారు.

లోన్ యాప్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం



వ్యాపారం సరిగా నడవక తీసుకున్న లోన్ డబ్బులు చెల్లించలేక.. లోన్ యాప్‌ల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా జ్యోతినగర్‌లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోతినగర్‌కు చెందిన గూడ సతీష్‌రెడ్డి(43) స్థానికంగా ఓ షటర్ అద్దెకు తీసుకుని ఫైనాన్షియల్ కన్సెల్టెన్సీని నడుపుతూ కార్లు కొనుగోలు చేసే కస్టమర్లకు వివిధ బ్యాంకుల నుంచి లోన్లు ఇప్పించేవాడు. ఈ క్రమంలో తాను లోన్‌లు ఇప్పించినవారు వాయిదాలు చెల్లించకపోవడంతో వాటిని సర్దుబాటు చేసేందుకు లోన్ యాప్‌ల నుంచి డబ్బులు రుణంగా తీసుకున్నాడు. వాటిని చెల్లించే స్థితిలో తాను లేకపోగా.. లోన్ యాప్‌ల నుంచి వేధింపులు పెరిగాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సతీష్‌రెడ్డి గురువారం తన ఆఫీసు రూమ్‌లోనే ఉరేసుకున్నాడు. అక్కడి పనిచేసే ప్రసాద్, సాయికృష్ణ గమనించి వెంటనే ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుడి భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా గణేష్ ఉత్సవాలు..

(మొదటిపేజీ తరువాయి)

నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందుగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు.

నిమజ్జనానికి ముఖ్యతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలనీ, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశముంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చనీ, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబి, 17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడతాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఏ.వి.ఎస్.రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై 'హైడ్రా' కొరడా..

(మొదటిపేజీ తరువాయి)



చెరబట్టారు..ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎం శాంతి కుమారి హైడ్రా కూల్చివేతలపై రోజువారీ సమీక్షలు చేస్తూ తగు సూచనలు చేస్తున్నారు. తరతమ భేదం లేకుండా ఆక్రమణలకు పాల్పడితే తన కుటుంబ సభ్యుల నిర్మాణాలు కూడా కూల్చేయండని సీఎం చెప్పడంతో హైడ్రా మరింత దూకుడు పెంచింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇండ్లు నిర్మించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం నోటీసులు జారీ చేసింది. అయితే హైడ్రా దూకుడుపై హైకోర్టు పలు సూచనలు చేసింది. ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించడంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు వివిధ శాఖల అధికారులతో సీఎస్ గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేటర్ పరిధిలో పలుచోట్ల అనేక చెరువులను ఆక్రమించుకుని భారీ నిర్మాణాలు చేపట్టారు. గత పదేండ్లలో అవి మరీ ఎక్కువగా ఆక్రమణలకు గురయ్యాయనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షణాధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో చేపడుతున్న నిర్మాణాలు నిబంధనల మేరకు జరుగుతున్నాయా? లేదా? అన్నది తనిఖీ చేయాల్సి ఉంటుంది. అనుమతులు లేకపోతే కూల్చివేతలు చేపట్టాలి. పర్యవేక్షణ అధికారులే కాదు ప్రతి విభాగంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కూడా నిర్మాణాలపై ఓ కన్నేసి ఉంచాల్సిన బాధ్యత ఉంది. కొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్లు వేరుగా వేసి నిర్మాణ అనుమతులు తీసుకున్నట్టు కూడా హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రతి రోజూ వందల సంఖ్యలో ఫిర్యాదులు అందుతు న్నాయి. వాటిపై రోజువారీ సమీక్ష నిర్వహిస్తూ ఆయన నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యం లో నిబంధనలకు తిలోదకాలిచ్చి చెరువులు, నాలాలను ఆక్రమించిన వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

అవినీతిపై దృష్టి పెట్టండి: సీఎం రేవంత్‌రెడ్డి

హైడ్రా పేరు చెప్పి అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు విజిలెన్స్, ఏసీబీలను అప్రమత్తం చేశారు. గత కొద్ది రోజులుగా హైడ్రా కూల్చివేతలను ఆసరాగా తీసుకుని కొంత మంది కింది స్థాయి అధికారులు ఆక్రమాలకు పాల్పడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకొని డబ్బులు అడుగుతున్నట్టు తెలిసిందన్నారు. అమాయకులను భయపెట్టి డబ్బు వసూలు చేస్తున్నారనీ, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని సీఎం చెప్పారు. అక్రమంగా డబ్బు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు.

హైడ్రాకు మరిన్ని అధికారాలు: సీఎస్

హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఆ సంస్థకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని అప్పగించేందుకు అవసరమైన చర్యలపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె సంబంధిత అధికారులతో చర్చించారు. కూల్చివేతలపై రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, తదితర శాఖలు వేర్వేరుగా నోటీసులు ఇస్తుండడంతో గందరగోళం తలెత్తుతోందని సీఎస్ పేర్కొన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు విధివిధానాలను రూపొందించాలని పురపాలక శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. హైడ్రా ఆధ్వర్యంలో ఏర్పాటైన 72 బందాలను మరింత బలోపేతం చేయడానికి పోలీసు, సర్వే, ఇరిగేషన్ తదితర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని కేటాయించనున్నట్టు వివరించారు.

చెరువుల్లో అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు

చెరువులు, కుంటల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై చర్యలకు హైడ్రా సిద్ధమైంది. కూల్చివేతల సమయంలో కొన్ని చోట్ల ఆ సంస్థకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు అనుమతి ఇస్తేనే తాము నిర్మించుకున్నామనీ, ఇందులో తమ తప్పేముందని పలువురు అధికారులను నిలదీస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో మరెవ్వరూ పొరపాటు చేయబోరనే ఉద్దేశంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు హైడ్రా సిఫారసు చేసినట్టు సమాచారం. చందానగర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, హెచ్‌ఎండీ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, గండిపేట సూపరింటెండెంట్, నిజాంపేట మున్సిపల్ కమిషనర్, సర్వేయర్, నిజాంపేట ఎమ్మార్వోలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫారసు చేసినట్టు సమాచారం.

హైడ్రాకు రూ.25 లక్షల నిధులందించిన ఎంపీ అనిల్

గ్రేటర్ పరిధిలో హైడ్రా చేస్తున్న మంచి పనులకు గాను తన ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు అందిస్తున్నట్టు సికింద్రాబాద్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన ఆయన రూ.25 లక్షలు కేటాయిస్తూ లేఖను అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ తరాల గురించి ఆలోచించి, హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకే ఇలాంటి కీలక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.. రాజకీయాల కోసం హైడ్రాపై విమర్శలు ఆపి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు.

వర్గీకరణ అమల్లోకొచ్చే వరకు ఫలితాలు నిలిపేయాలి

- క్రిమిలేయర్ లేకుంటే పేద దళిత, గిరిజనులకు న్యాయమెలా? : మీట్ ది ప్రెస్‌లో మంద కృష్ణ మాదిగ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణను అమలు చేసేంత వరకు గ్రూప్ 1 తదితర ఉద్యోగ నియామకాల పరీక్షల ఫలితాలను నిలిపేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) అధ్యక్షులు విరహత్ అలీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుత నియామకాల నుంచే వర్గీకరణను అమలు చేయాలన్నారు. ఇదే విషయంపై రెండు రోజుల్లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్‌ను కలవనున్నట్టు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల్లో క్రిమిలేయర్ అంశంపై మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తున్న వారు పేద దళిత, గిరిజనులను న్యాయమెలా దక్కుతుందో చెప్పడం లేదని విమర్శించారు.

సంపన్న దళిత, గిరిజనులకు మాత్రమే ప్రయోజనం కలిగించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీల్లో 1,108 కులాలుంటే ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లతో కేవలం 10 నుంచి 15 కులాలు మాత్రమే జనాభా కంటే ఎక్కువ లబ్ది పొందాయని చెప్పారు. వర్గీకరణ అమలైతే అన్ని కులాలు తమ జనాభా ప్రాతిపదికన లబ్ది పొందడానికి వీలు కలుగుతుందని చెప్పారు. గతంలో వర్గీకరణ అమలు అనుభవం ఇదేనని వివరించారు. వర్గీకరణకు సమాజం, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, కమిషన్లు, న్యాయవ్యవస్థ మద్దతుగా నిలిచాయనీ, సమాజానికి ఎమ్మార్పీఎస్ సామాజిక బాధ్యతగా అనేక పోరాటాల ద్వారా కృతజ్ఞతలు తెలిపిందని గుర్తుచేశారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న కొంత మంది తాము సమాజం నుంచి ఒంటరవుతున్నామన్న సోయి కూడా లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఏ పార్టీలో చేరను

తాను ఏ పార్టీలో చేరబోనని మందకృష్ణ మాదిగ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అణగారిన వర్గాల తరపున మాట్లాడే పరిస్థితి లేనప్పుడు చట్టసభల్లో వెళ్లి చేసేదేముంటుందని ప్రశ్నించారు. తాను స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉన్నప్పుడు మాత్రమే తన వర్గాల తరపున మాట్లాడగలుగుతానని చెప్పారు. ఎన్నికల్లో మరో 10 సార్లు ఓడిపోవడానికైనా సిద్ధమే కానీ... స్వతంత్రునిగానే ఉంటానని తెలిపారు.

షోకాజ్ నోటీసులుగా మార్చండి

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగం ఏరియా, కావూరిహిల్స్ లేఔట్‌లో ఎఫ్‌టీఎల్ ఏరియాలో ఉందని, వాటి కూల్చివేతలకు ఇచ్చిన నోటీసులపై సవాలు చేసిన పిటిషన్లను హైకోర్టు విచారించింది. కూల్చివేత నోటీసులను షోకాజ్ నోటీసులుగా మారుస్తామని ప్రభుత్వ హామీని నమోదు చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. షోకాజ్ నోటీసులపై ఆధారాలు సమర్పించడానికి పిటిషనర్లకు ఆస్కారం ఇవ్వాలన్నది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలోని ఆక్రమణల తొలగింపునకు వీలుగా వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద జారీ చేసిన నోటీసులను షోకాజ్ నోటీసులుగా మార్పు చేస్తూ చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ ఇచ్చిన కూల్చివేత నోటీసులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను ముగిసేసింది.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

వెలుగులు నింపేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని వంద శాతం పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల్లో ఉన్న అధికారులు సబ్ ప్లాన్ చట్టాన్ని అర్థం చేసుకుని చట్టం ప్రకారం వారి నిధులను వారికే ఖర్చు పెట్టాలని సూచించారు. ఈమేరకు ఉన్నతాధికారులు సాధ్య సాధ్యాలను దృష్టిలో పెట్టుకుని మేధోమథనం చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. చట్టం ముఖ్య ఉద్దేశాన్ని అమలు చేసి దళిత, గిరిజన జీవితాల్లో మార్పు తీసుకొస్తేనే దానికి అర్థం, పరమార్థం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆ చట్టంపై యాక్షన్ ప్లాన్ తయారు చేసిన తర్వాత అన్ని శాఖలకు నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఆ తర్వాత వ్యయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీల భూములను అభివృద్ధి చేసేందుకు వీలుగా ఇందిరా జల ప్రభ పథకం అమలు కోసం అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు... దళిత, గిరిజనుల వ్యవసాయం కోసం కావాల్సిన నీటి వనరులను సమకూర్చేందుకు బోర్లు వేయించాలనీ, భూగర్భ జలాలు పెరగడానికి చెక్ డ్యాముల నిర్మాణం చేపట్టాలని కోరారు. పోడు సాగు చేసుకునే ఆదివాసీ రైతులకు ఆదాయం వచ్చేలా, అడవిని కాపాడుకునేలా ఆయిల్‌పామ్, పండ్ల తోటల పెంపకం, అంతర్గత పంటల సాగుకు డిజైన్ చేయాలని సూచించారు. అడవి ద్వారా ఆదాయం ఉండేలా కొత్త పథకాలను తీసుకురావాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపు, వాటి ఖర్చు గురించి అధికారులను భట్టి అడిగి తెలుసుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రజా ప్రభుత్వంలో ఆ చట్టం ప్రకారం 24శాతం నిధులు ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఖర్చు పెట్టడంపై అధికారులు కచ్చితంగా దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానీయా, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సాంఘీక సంక్షేమ కమిషనర్ శ్రీదేవి, గిరిజ సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి గౌతమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెట్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గాలిని కొనాల్సి వస్తుంది

- మొక్కలు పెంచడం అనివార్యం : నర్సరీ మేళా ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మొక్కలను పెంచడం అనివార్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇప్పటి వరకు నీళ్ల మాత్రమే కొంటున్నామనీ, చెట్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గాలిని కూడా కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో 16వ గ్రాండ్ నర్సరీ మేళాపేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టీకల్చర్ షోను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని పట్టణాలకు ఆక్సిజన్ కొనుక్కొనే పరిస్థితి ఉందని చెప్పారు. ఢిల్లీలో ఆక్సిజన్ కేంద్రాలు వెలుస్తున్నాయని గుర్తు చేశారు. మంచినీళు కొనుక్కోవడమే కాకుండా ఆఖరుకు గాలి కూడా కొనుక్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే రూఫ్‌గార్డెన్, వర్టికల్‌గార్డెన్స్ ఇలా ఇంటి నిండా మొక్కలు పెంచుకోవాలనే ప్రజల ఆకాంక్షను చూస్తున్నామని తెలిపారు. ఇంట్లో, ఇంటిపక్కన ఏ మాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలతోపాటు పచ్చదనంగా ఉండేలా మొక్కలు పెంచాలని కోరారు. నర్సరీ మేళాలో రూ.50 నుంచి రూ.3లక్షల ఖరీదైన అందమైన పూలమొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొక్కల ప్రియులు వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుని మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా మాట్లాడుతూ ఈ నర్సరీ మేళాలో కిచెన్‌గార్డెన్, ఆర్నమెంటల్ ప్లాంట్స్, మెడిసినల్ ప్లాంట్స్ పెంచేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి 150 స్టాల్స్ ఎగ్జిబిట్స్ వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో మేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత ప్రారంభం

- సర్వే నెం.523లో 70 నిర్మాణాలు నేలమట్టం
- ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు
- ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పూర్తి స్థాయిలో విచారణ
- అర్బన్ తహసీల్దార్ మున్సీరాం నాయక్
- దళారులను నమ్మి మోస పోవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- ఇక పెద్దచెరువుపై దృష్టి సారించే అవకాశం



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ / మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని 523 సర్వేనెంబర్‌లోని నిర్మాణాలు మొదటి నుంచీ వివాదాస్పదమే. మాజీ మంత్రిపై వచ్చిన ఆరోపణలన్నీ ఈ సర్వే నెంబర్‌తోనే మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రాజధానిలో హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు.. పాలమూరులో కబ్జాదారులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. గురువారం 523 సర్వే నెంబరులోని అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చేశారు. ఇక్కడ కొంత మందికి బీపీఎల్ కింద పట్టాలు ఇచ్చారు. పట్టాలు పొందిన వారికంటే ఆక్రమణలే ఎక్కువగా ఉన్నాయనే విమర్శలున్నాయి. ప్రభుత్వం 523 సర్వే నెంబర్‌పై దృష్టి సారించడంతో ఆక్రమణ దారుల గుండెల్లో రైళు పరుగెడుతున్నాయి. అయితే, ఇక్కడ కొందరు పేదలు సైతం నిర్మాణాలు చేసుకున్నారు. ఇందులో పేదల ఇండ్లను కూడా కూల్చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే నెంబరు 523లో నిర్మాణాల కూల్చివేతల అనంతరం అధికారులు పెద్ద చెరువుపై దృష్టి సారించే అవకాశం ఉంది. పెద్ద చెరువులో మొత్తం 70 అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇందులో నిర్మాణాలు చేసిన వారంతా బడాబాబులే. వీరంతా ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీల దగ్గరకు వెళ్లి కూల్చి వేతలు ఆపాలని మొరపెట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. వీరన్నపేట, ఎస్‌వీఎస్, కొత్తచెరువు, లక్ష్మీనగర్ కాలనీలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేసే అవకాశాలున్నాయి.


అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు : మున్సీరాం నాయక్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ మున్సీరాం నాయక్ అన్నారు. కొంతమంది దళారులు పట్టణ కేంద్రం క్రిస్టియన్‌పల్లి సమీపంలోని 523 సర్వే నెంబర్‌లో ఉన్న మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని తెలిపారు. వారు నిర్మించిన అక్రమ కట్టడాలను గురువారం ఉదయం కూల్చేశామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొంతమంది నిర్మాణాలు చేపట్టారన్నారు. తాము కూల్చేసిన నిర్మాణాల్లో ప్రజలెవ్వరూ నివాసం ఉండటం లేదన్నారు. 523 సర్వే నెంబర్‌లో మొత్తం 83.28గుంటల భూమి ఉందని, దానిలో వివిధ ప్రభుత్వ నిర్మాణాలు, పేదల ఇండ్ల నిర్మాణం కోసం పోను ఇంకా 3.30 గుంటలు మిగిలి ఉందని తెలిపారు. ఆ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేశారన్నారు. అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి వారి దగ్గర డబ్బులు తీసుకొని స్థలం అమ్మిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు దళారులను నమ్మొద్దని, ఇంటి నిర్మాణ స్థలం కోసం తమను సంప్రదిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిజమైన లబ్దిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. పట్టణంలో ప్రభుత్వ స్థలం ఎక్కడ ఆక్రమణకు గురైనా కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏనుగొండ సమీపంలో ఉన్న 25 సర్వే నెంబర్‌లో కూడా ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, ఆర్ఐలు సుదర్శన్ రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు

- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు
- సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి సైతం నోటీసు

నవతెలంగాణ- మియాపూర్



చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. చెరువులు, కుంటలు నాలాల పరిరక్షణకు మరో ముందడుగు వేసింది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పరిధిలోని దుర్గం చెరువు పరిరక్షణ కోసం చర్యలకు ఉపక్రమించింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కావూరి హిల్స్, అమర్ సొసైటీ నివాసితులకు శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. సుమారు 200 మందికిపైగా నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు పలు ఇండ్లకు అధికారులు నోటీసులను అంటించారు. వీరిలో రాజకీయ, సినీ ప్రముఖులతోపాటు ఐఏఎస్, ఇతర ముఖ్య అధికారులు సైతం ఉన్నట్టు తెలుస్తోంది. వీరికి నెల రోజుల గడువు ఇస్తూ ఎఫ్టీఎల్‌లో ఆక్రమించి కట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా కూల్చివేయాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో తామే కూల్చివేతలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒక్కరోజే ఈ నాలుగు కాలనీల్లోని వందల ఇండ్లు, వాణిజ్య సముదాయాలకు వాల్టా చట్టంలోని సెక్షన్ 23(1) కింద నోటీసులు ఇచ్చారు. దీంతో దుర్గం చెరువు పరిసర కాలనీలో ఇప్పుడు నోటీసుల అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది.

సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం నోటీసు

సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. అమర్ కో ఆపరేటివ్ సొసైటీలో ఆయన నివాసం ఉంటున్నారు. ఇది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండటంతో అధికారులు ఆయన ఇంటికి సైతం నోటీసులు అంటించారు. అయితే దీనిపై తిరుపతిరెడ్డి స్పందించారు. తాను అక్కడ ఇల్లు కట్టలేదని, మరొకరి వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆ ఇంటికి సంబంధించిన అన్ని పత్రాలు తన వద్ద ఉన్నాయన్నారు. అయినప్పటికీ తన ఇల్లు నిబంధనలు మేరకు లేకుంటే ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.



మహిళలు పెండ్లి తర్వాత కుటుంబం, పిల్లల బాధ్యతలతో తీరికలేకుండా గడిపేస్తుంటారు. 'ఇక మా కలలు నిజం చేసుకునే అవకాశం ఎక్కడుంది' అనుకుంటూ ఢీలాపడిపోతారు. కానీ కాస్త సమయం చిక్కినా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ తామేంటో నిరూపించుకునేవారు కొందరుంటారు. ఆ కోవకు చెందిన వారే డాక్టర్ స్నేహలత ప్రసాద్. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. వ్యర్థాలకు జీవం పోస్తూ గొప్ప శిల్పిగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. భర్త, కుటుంబ చేయూతనందిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారనేందుకు నిదర్శనంగా నిలిచిన ఆమె పరిచయం నేటి మానవిలో...



వ్యర్థాలతో అందమైన శిల్పాలు

స్నేహలత సొంతూరు రాజస్థాన్‌లోని జోద్‌పూర్. తల్లి లీలాదేవి ప్రోత్సాహంతో కళారంగంలోకి అడుగుపట్టారు. ఫైన్ ఆర్ట్స్‌సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఆ తర్వాత పీహెచ్‌డీ పట్టా కూడా అందుకున్నారు. పెండ్లి తర్వాత హైదరాబాద్‌కు వచ్చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుటుంబం, పిల్లల బాధ్యతలతో తీరిక లేకుండాపోయింది. దాంతో తన కళకు కొంత కాలం విరామం ఇచ్చారు. కానీ తనలోని సృజనాత్మక సామర్థ్యాలను వెలికి తీయాలనే కోరిక మాత్రం రోజు రోజుకు పెరుగుతూనే వచ్చింది.

ఆత్మవిశ్వాసాన్ని జోడించి

పిల్లలు కాస్త ఎదిగిన తర్వాత భర్త ప్రసాద్ సహకారంతో తన కెరీర్‌లో సెంకడ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు స్నేహ. అరుదైన తన కళకు ఆత్మవిశ్వాసాన్ని జోడించి ఆకాశమే హద్దుగా ఎదిగారు. అతి పెద్ద పెయిటింగ్ వేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. స్నేహ కేవలం ఆర్టిస్టు మాత్రమే కాదు ప్రకృతి పర్యావరణ ప్రేమికురాలు కూడా. ప్రకృతి మీద ఆమెకున్న ప్రేమంతా ఆమె ప్రతీ పెయింటింగ్‌లోనూ మనకు కనిపిస్తుంది. ఢిల్లీ, జైపూర్, హైదరాబాద్‌లో అనేక ఆర్ట్ ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. దాదాపు అన్నింటికీ ప్రజల మండి మంచి ఆధరణ లభించింది. ఈ విజయం నుండి మరింత ప్రోత్సాహం అందుకున్నారు. మనిషి జీవితంతో ముడిపడిన ప్రేమను ఆమె తన చిత్రాలలో ఎంతో అందంగా చూపిస్తారు.

శిల్ప కళలో...

చిత్రకళ ఎంతో ఉత్సాహంగా కొనసాగుతున్న సమయంలోనే అనూహ్యంగా శిల్ప కళతో స్నేహకు పరిచయం ఏర్పడింది. ఆ కళమీద అంతులేని మక్కువ పెంచుకున్నారు. పట్టుదలతో అందులోనూ రాణించారు. ఇక అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. తన ప్రతిభతో భారతదేశంలో అత్యంత నైపుణ్యం కలిగిన మహిళా శిల్పులలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు ఆమె తొలి శిల్పం తెలంగాణా తల్లిది కావడం విశేషం. అలాగే పారిశ్రామిక వ్యర్థాలను అందమైన కళాకృతులుగా, రాయి, ఫైబర్ ఇలా వస్తువు ఏదైనా దాన్ని అద్భుతంగా మలచడంలో ఆమెది అందె వేసిన చేయి.

విద్యార్థులకు శిక్షణ

తనలోని కళను పది మందితో పంచుకోవాలనే ఉద్దేశంతో స్నేహ ఆర్ట్స్ ప్రారంభించారు. దీని ఆధ్వర్యంలో ఆర్ట్ క్యాంపులు, ఆర్ట్ ఫెయిర్, కోర్సులు, ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌లు, ఆర్ట్ టాక్‌లు, లైవ్ డెమోలు, డాక్యుమెంటరీలతో బిజీగా గడుపుతున్నారు. అలాగే 'రంగభూమి' అనే వేదిక ద్వారా ఔత్సాహిక కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇలా అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్దే గొప్ప శిల్పిగానే కాకుండా తర్వాతి తరాన్ని తీర్చిదిద్దే శిక్షకురాలిగా మారారు. 'గురుకులం లాంటి విద్యా సంస్థను ఏర్పాటు చేసి, పట్టుదలగా, పూర్తి నిబద్ధతతో చిత్రకళను, శిల్ప కళను నేర్చుకోవాలనే వారికి శిక్షణ ఇవ్వాలనేది నా లక్ష్యం. విద్యార్థులకు సరియైన రీతిలో శిక్షణ ఇవ్వాలి. దేశ సంస్కృతీ, సంప్రదాయాల మీద అవగాహన కల్పించాలి. ఆసక్తిని కలిగించాలి. అపుడే వారు ఎవరూ ఊహించలేని అద్భుతాలు సృష్టిస్తారు' అంటూ తన భవిష్యత్ కర్తవ్యాన్ని పంచుకున్నారు స్నేహ.

వెసులుబాటును ఉపయోగించుకొని

'చిత్రకళైనా, శిల్ప కళైనా ప్రతీ దానికీ ఓ లెక్క ఉంటుంది. దాని ప్రకారమే పోవాలి. నా జీవితమూ అంతే. ఒక లెక్క ప్రకారం కలలు, కళల మేళవింపుతో ఒక అందమైన చిత్రంగా మల్చుకున్నాను. ఆడపిల్లలకు కూడా ఆశలు, కోరికలు, లక్ష్యాలు ఉంటాయి. సాధించాలనే పట్టుదలా ఉంటుంది. కానీ తొలుత నచ్చింది నేర్చుకోవడంలో అడ్డంకులొస్తాయి. తీరా చదువుకున్నాక కుటుంబం ముందు, కరియర్ తర్వాత అనే కట్టుబాట్లు మరింత అవరోధంగా మారతాయి. ఇలాంటి కారణాల రీత్యా చాలా మంది తమలోని ఆశలను చంపేసుకుంటున్నారు. కానీ ఇది సరైనది కాదు. దొరికిన వెసులుబాటును ఉపయోగించుకుని మహిళలు తమ ప్రతిభకు పదును పెట్టుకోవాలి. సానుకూల ధోరణి, దృక్పథంతో ముందుకు పోవాలి' అంటారు స్నేహలత.

పర్యావరణ శిల్పం

పుణేలోని వాకాడ్‌లో, కస్తూరి చౌక్ వద్ద ఇటీవల ఒక పర్యావరణ శిల్పాన్ని ఆమె ఏర్పాటు చేశారు. ఇందులో కార్మికుల భద్రతకు చిహ్నమైన టోపీతో పాటు సమాజానికి, స్థిరత్వానికి మధ్య కీలకమైన బంధాన్ని తెలిపేలా డీఎన్‌ఏ గొలుసు, ఇంకా పరిశ్రమలు, శక్తి, ఆవిష్కరణల మేళవింపుతో దీన్ని ఏర్పాటు చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై పౌరులకు అవగాహన కల్పించే లక్ష్యంతో స్నేహ దీన్ని రూపొందించారు. 21 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో రెండు నెలల పాటు శ్రమించి దీన్ని సృష్టించారు.

డ్రీమ్ ప్రాజెక్ట్...

స్నేహ పుట్టింది రాజస్థాన్‌లోనే అయినా తనకిష్టమైన కళలో రాణించింది మాత్రం హైదరాబాద్‌లో. అందుకే ఆమెకు ఈ ప్రాంతమంటే ఎంతో అభిమానం. అందుకే ఈ మహానగరం కోసం ఏదైనా చేయాలని నిరంతరం తపిస్తున్నారు. తనకు అవకాశం లభిస్తే పరిశ్రమల నుంచి వచ్చిన ఇనప వస్తువులు, బోల్ట్‌లు, నట్లు తదితర వస్తువులతో తెలంగాణకు తలమానికమైన చారిత్రక కట్టడం 'చార్మినార్'ను యథాతథంగా నిర్మించాలనుకుంటున్నారామే. అది కూడా సందర్శకులు తను నిర్మించే చార్మినార్ పైకి ఎక్కి నగర అందాలను దర్శించే అవకాశాన్ని కల్పించాలని భావిస్తున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అమె అంటున్నారు. ప్రభుత్వం, పారిశ్రామిక వేత్తల నుంచి సహకారం లభిస్తే దీన్ని సాధించి తీరుతానని నమ్మకంగా చెబుతున్నారు.

గొప్ప అనుభూతి

పనికిరాకుండా పారవేసే చెత్త, ఇతర వ్యర్థాల నుంచి కళాఖండాలను తీర్చిదిద్దడం ద్వారా ప్రకృతికి, పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని, ముప్పును తగ్గించడం తన బాధ్యతగా ఆమె భావించారు. కాలుష్య నివారణలో అందరూ భాగం పంచుకోవాలని ఆమె కోరుకుంటున్నారు. 'చిన్నప్పటి నుండి గొప్ప విజయాలు సాధించాలనేదే నా తాపత్రయం. అందుకే మహిళలకు ప్రవేశం అరుదుగా లభించే శిల్ప కళను ఎంచుకున్నాను. శిల్పాన్ని చెక్కేటపుడు వచ్చే దుమ్ము, ధూళి నాకు కనిపించదు. 200 ఏండ్లకు పైగా చరిత్రను చూసిన ఒక పవిత్రమైన వస్తువును స్పృశిస్తున్న పారవశ్యం. అదొక గొప్ప అనుభూతి. తొమ్మిది నెలలు గర్భంలో బిడ్డకు ప్రాణం పోసినంత సహజంగా శిల్పం ఆవిష్కృతమవుతుంది' అంటారామె. అందుకే అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు.



అపోహలతో విచారణను బదిలీ చేయలేం

(మొదటిపేజి తరువాయి)

కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది.

తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ్ లూత్రా, మేనకా గురుస్వామీలు, పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావు హాజరయ్యారు. గురువారం ఉదయం ఈ కేసు విచారణకు రాగా కేసు తెలంగాణ సీఎంకు వ్యతిరేకంగా దాఖలైందని పిటిషనర్ తరపు న్యాయవాది సుందరం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేసులో నిందితుడు సీఎంగా ఉన్నారని, హోంశాఖ, అవినీతి నిరోధక శాఖలు స్వయంగా ఆయన చేతిలోనే ఉన్నాయని తెలిపారు. అంతేకాక ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యులను, దర్యాప్తు సంస్థల అధికారులను ఇంకా విచారించలేదన్నారు. మరోవైపు రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్న నేపథ్యంలో సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రాసిక్యూషన్ తీరు, పోలీసు అధికారులతో పాటు, సుప్రీంకోర్టుకు సంబంధించిన గతంలో రేవంత్ రెడ్డి చేసిన పలు వ్యాఖ్యలతో పిటిషనర్లు ఆందోళన చెందుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలపై ప్రభుత్వ తరపు న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ లూత్రా, మేనకా గురుస్వామీలు అభ్యంతరం తెలిపారు. మొదటి నుంచి కేసు దర్యాప్తు అధికారుల్లో ఎలాంటి మార్పు లేదని కోర్టుకు నివేదించారు. ఆగస్టు 2021లో జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారణను నిలిపివేసిందని నివేదించారు. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అవుతుందని వ్యాఖ్యానించారు. 2021 నుంచి స్టే అమలులో ఉందని, 2024 ఎన్నికల తరువాత పిటిషనర్లు కోర్టును ఆశ్రయించినట్టు పేర్కొంది. విచారణ బదిలీని నిరాకరిస్తూనే, ఇరు పక్షాల్లో విశ్వాసాన్ని నింపేలా స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)ను ఏర్పాటు చేస్తూ... పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే తెలంగాణ హైకోర్టును సంప్రదించి మధ్యాహ్నం 2 గంటలకు ఆర్డర్ ఇస్తామని స్పష్టం చేసింది. అంతలోపు పీపీల కోసం ఇద్దరి పేర్లను సూచించాలని ఆదేశించింది.

అనూహ్యంగా కవిత బెయిల్ విషయంలో సీఎం వ్యాఖ్యలపై వాదనలు

మధ్యాహ్నం తరువాత వాదనలు అనుహ్యంగా కవిత బెయిల్ అంశంపైకి మళ్లాయి. ఈ సందర్భంగా కవిత బెయిల్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పిటిషనర్ తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం బీఆర్ఎస్ పని చేసింది. బీఆర్ఎస్, బీజేపీ మధ్య కుదిరిన ఒప్పందం వల్లే కవితకు బెయిల్ వచ్చిందని సీఎం వ్యాఖ్యలు చేశారు' అని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కవిత బెయిల్ ఉత్తర్వులపై వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డిని మందలించింది. జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ... సీఎం స్థాయి హోదాలోని వ్యక్తి వ్యాఖ్యలతో కొందరి ఆలోచనల్లో భయాందోళనలు కలిగించవచ్చు. రాజకీయ పార్టీలను సంప్రదించి మేము బెయిల్, తీర్పులు ఇస్తున్నామా? మేము మా విధిని మనస్సాక్షిగా, ప్రమాణ పూర్వకంగా చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో జస్టిస్ కెవి విశ్వనాథన్ జోక్యం చేసుకొని 'ఇది ఒక సీఎం హోదాలో ఉన్న బాధ్యత గల వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యేనా?. సంస్థల పట్ల పరస్పర గౌరవం ఉండాలి. ప్రాథమిక కర్తవ్యం. గౌరవం కలిగి ఉండాలి' అని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై వ్యాఖ్యానించిన మహారాష్ట్ర సర్కార్‌లో అడిషనల్ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తోన్న ఐఏఎస్ అధికారికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసినట్టు గుర్తు చేశారు. తెలంగాణ సీఎం సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం పట్ల గౌరవం లేకుండా, ఇలాంటి ప్రవర్తనే కలిగి ఉంటే, ఆయన తెలంగాణకు వెలుపల కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని మందలించారు. కాగా... ప్రభుత్వం తరపు న్యాయవాదులు ముకులు రోహిత్గి జోక్యం చేసుకొని సీఎం పక్షాన క్షమాపణ చెప్పగా, మరో న్యాయవాది సిద్ధార్థ లూత్రా సీఎంకు కౌన్సిలింగ్ చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. మరోవైపు పిటిషనర్ తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ సుప్రీం గురించి సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు, హైకోర్టు, దిగువ కోర్టుల్లో న్యాయమూర్తుల పరువు గురించి ఎలాంటి ఆందోళనలు ఉంటాయో ఆలోచించాలన్నారు. కాగా, పీపీ నియామకం విషయంలో వి. సురేందర్ రావు(ప్రస్తుతం సీఎం కేసులో ప్రాసిక్యూటర్), ఉమా మహేశ్వర్ రావు పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోని ధర్మాసనం, తదుపరి విచారణను సెప్టెంబర్ 2కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది. పిటిషన్ కోరినట్లు విచారణ బదిలీ అంశాన్ని ప్రస్తుత స్థితిలో రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడాన్ని ఆహ్వానించామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఆర్టీసీ బస్సుల సంఖ్యను, మెట్రోరైల్ బోగీలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు నాలుగు కోట్ల మంది ప్రజలున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలోనే 1.10 కోట్ల మంది నివసిస్తు న్నారని వివరించారు. గతంలో వివిధ రకాల వాహనాల్లో ప్రయాణించే ప్రజలు, ప్రత్యేకించి మహిళలు ప్రస్తుతం అత్యధిక భాగం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వంద శాతానికిపైగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని ప్రభుత్వమే ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రయాణికుల సంఖ్య రోజుకి 30 నుంచి 60 లక్షలకు పెరిగిందని తెలిపారు. అయినప్పటికీ ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరగలేదని వివరించారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే సమయంలో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉచిత ప్రయాణ పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఇటీవల కాలంలో ప్రభుత్వం దాదాపు 100 బస్సులు మాత్రమే పెంచిందని పేర్కొన్నారు. అదికూడా ఉచిత ప్రయాణానికి ఉపయోగపడని డీలక్స్, మెట్రో డీలక్స్ బస్సులను పెంచారని వివరించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని గ్రామాలకూ ప్రజారవాణాను మెరుగు పరిచేందుకు బస్సుల సంఖ్య పెంచాలనీ, రద్దీ రూట్లలో తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తేవాలి

హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజారవాణాను పెంచి మెరుగుపర్చాల్సిన అవసరముందని తమ్మినేని తెలిపారు. ట్రాఫిక్ రద్దీతో ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. మెట్రో రైళ్లు కిక్కిరిసి నడుస్తున్నాయని వివరించారు. ఉదయం, సాయంత్రం సమయంలో రద్దీ ఎక్కువ గా ఉండటంతో రైలు ఎక్కడం, దిగడం కూడా కష్టంగా ఉందని తెలిపారు. మూడు బోగీలతో నడుస్తున్న మెట్రో రైలును ఆరు బోగీలకు పెంచాలంటూ ప్రయాణికులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా ఎల్అండ్‌టీ సంస్థ పెడచెవిన పెడుతున్నదని పేర్కొన్నారు. లాభనష్టాలను బేరీజు వేస్తున్నదని విమర్శించారు. ప్రతి రూట్లలో లాభనష్టాలను చూసే ధోరణి సరైంది కాదని తెలిపారు. నగరంలోని పేద, సామాన్య ప్రజలకు ఎంఎంటీఎస్ రైళ్లు అతి చౌకగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న రైళ్లను చివరి నిమిషంలో బాధ్యతారహితంగా రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రెండో దశలో నిర్మించిన రూట్లలో ఇంతవరకూ కొత్త రైళ్లు వేయలేదని తెలిపారు. మరమ్మతుల పేరుతో గంటలకొద్దీ నిలిపేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రాష్ట్రంలో ప్రజారవాణాను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెట్రో రైల్ బోగీల సంఖ్య పెంచాలనీ, ఎంఎంటీఎస్ రైళ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

మోడల్ రాష్ట్రంలో ఇండ్లపైకి మొసళ్లు..

(మొదటిపేజి తరువాయి)



సౌరాష్ట్ర ప్రాంతం ఉక్కిరిబిక్కిరయ్యింది. పలు ప్రాంతాలు నీట మునిగాయి. రిజర్వాయర్లు, డ్యామ్‌లు, నదులు ప్రమాదకరస్థాయికి చేరాయి. పలు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. రోడ్లు, ఇండ్లు నీట మునిగాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. విద్యుత్, ట్రాఫిక్, రైల్వే సర్వీసులకు అంతరాయం కలిగింది. ఫలితంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గుజరాత్ తన సగటు వర్షపాతంలో 105 శాతం నమోదు చేసిందని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఈఓసీ) వివరించింది. పలు సౌరాష్ట్ర జిల్లాలు భారీ వర్షాలను నమోదు చేశాయి. ఇందులో ద్వారక జిల్లాలోని ఖంభలియా తాలూకాలో అత్యధికంగా 454 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది. అధికారుల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 140 రిజర్వాయర్లు, డ్యామ్‌లు, 24 నదులు ప్రమాదకరస్థాయిని మించి మరీ ప్రవహిస్తున్నాయి. నీటి మట్టం వేగంగా పెరుగుతుండటంతో 206 డ్యామ్‌లలో 122 డ్యామ్‌లను హైఅలర్ట్‌లో ఉంచారు. భారీ వర్షాల ధాటికి ట్రాఫిక్‌కు, రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. రోడ్లు, రైల్వే లైన్లు నీటితో నిండిపోయాయి. విశ్వమిత్రి నది ఉప్పొంగటంతో దాని తీర ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికంగా ఇండ్లలో వరద నీరు చేరింది. రోడ్లు, వాహనాలు, ఇండ్లు వరద నీటిలో మునిగి కనిపించాయి. వడోదరలో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. ఇక్కడ 1200 మందికిపైగా ప్రజలను రక్షించినట్టు అధికారులు తెలిపారు. ఇండ్లల్లో, ఇంటిపై ప్రాంతంలో చిక్కుకున్న ప్రజలను రక్షించి, సురక్షిత ప్రాంతాలను తరలించ టానికి వడోదర నగరంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ సిబ్బంది మోహరించాయి. అలాగే, భారత వైమానిక దళం (ఐఏఎఫ్), కోస్ట్ గార్డ్ కూడా సహాయక చర్యలో పాలుపంచుకున్నాయి. 17,800 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. 2000 మందిని రక్షించాయి.

సౌరాష్ట్ర ప్రాంతంలోని దేవ్‌భూమి ద్వారక, జామ్‌నగర్, రాజ్‌కోట్, పోర్‌బందర్ జిల్లాలు అధిక వర్షాలను నమోదు చేశాయి. ఈ జిల్లాల్లో 50-200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ద్వారక జిల్లాకు చెందిన భన్వడ్ తాలుకా అత్యధికంగా 185 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని చూసింది. సౌరాష్ట్ర జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) అంచనా వేసింది. ఇప్పటికే, గురువారం ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

సీఎంకు మోడీ ఫోన్

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల ప్రభావ పరిస్థితులను తెలుసుకోవటానికి ప్రధాని మోడీ గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో మాట్లాడారు. ప్రకృతి విపత్తు విషయంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రధాని.. సీఎంకు హామీ ఇచ్చారు.

ఇంటి పైకప్పు మీద మొసలి..వీడియో వైరల్

భారీ వర్షాల ధాటికి ఒక మొసలి ఇంటిపైకి వచ్చి చేరిన దృశ్యం వడోదరలో చోటు చేసుకున్నది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ వైరల్‌గా మారింది. న్యూస్ ఏజెన్సీ పీటీఐ ఈ వీడియోను షేర్ చేసింది. భారీ వర్షాలకు వడోదర ప్రాంతంలోని అకోటా స్టేడియం వద్ద భారీగా నీరు చేరింది. ఈ సందర్భంగా అక్కడ ఒక ఇంటి పై కప్పు మీద మొసలి వచ్చింది.

ఆన్‌లైన్ పాస్‌పోర్ట్ పోర్టల్ ఐదు రోజుల బంద్

న్యూఢిల్లీ : పాస్‌పోర్ట్ అప్లికేషన్ల ఆన్‌లైన్ పోర్టల్ ఐదు రోజులు బంద్ కానున్నది. దీంతో ఆగస్ట్ 29 రాత్రి 8 గంటల నుంచి ఈ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటించింది. సెప్టెంబర్ 2న ఉదయం 6 గంటలకు సేవలు పునరుద్ధరించనున్నట్టు వివరించింది. సేవల నిర్వహణలో భాగంగా పాస్‌పోర్ట్ సేవలను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. సేవలు నిలిచిపోతుండటంతో ఈ ఐదు రోజుల అపాయింట్‌మెంట్ ఉన్నవారికి మరో తేదీతో పాటు సమయాన్ని ఖరారు చేస్తూ రీషెడ్యూల్ చేయనున్నట్టు వివరించింది. ఇందుకు సంబంధించి వారి ఫోన్లకు సందేశాలు పంపుతామని కేంద్రం విదేశాంగ శాఖ తెలిపింది.

పాస్‌పోర్ట్ సేవలు తాత్కాలిక నిలిపివేత విషయాన్ని గమనించాలని పలు ప్రభుత్వ శాఖలకు సూచించింది. ఇదంతా సాధారణ ప్రక్రియలో భాగమని వివరించింది.

నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

(మొదటిపేజి తరువాయి)

చేసుకున్నారు. నారాయణపూర్ జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్, కంకేర్ జిల్లాల సరిహద్దులోని మాద్ దండకారణ్య ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం అందుకున్న జాయింట్ పోలీసు పార్టీ కూంబింగ్ చేపట్టింది. ఈ సమయంలో మావోయిస్టులు తారసపడటంతో కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం ఘటనా స్థలంలో పోలీసులకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. గురువారం సాయంత్రం వరకు పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు భీకరంగా జరగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. డీఆర్జీ ఎస్‌టీఎఫ్, బీఎస్ఎఫ్ జాయింట్ టీమ్ మావోయిస్టుల కోసం పెట్రోలింగ్ సెర్చ్‌లో ఉంది.

కవితను చూసి కేసీఆర్ భావోద్వేగం

(మొదటిపేజి తరువాయి)

తన భర్త అనిల్, కుమారునితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఎర్రవల్లి మాజీ సర్పంచ్ కమ్మరి బాలరాజు దంపతులు, సిబ్బంది ఎమ్మెల్సీ కవితకు దిష్టి తీసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కన్న బిడ్డను చూడగానే భావోద్వేగానికి గురయ్యారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను చూసి కేసీఆర్ ఆత్మీయ ఆనందం వెలిబుచ్చారు. తండ్రి పాదాలకు నమస్కరించిన కూతురిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ఆశీర్వదించారు. ఆమె వెంట ఎంపీ జోగినిపల్లి సంతోష్ రావు, వేముల ప్రశాంత్, పాడి కౌశిక్ రెడ్డి, జీవన్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్,, అంజిరెడ్డి, జహంగీర్ తదితరులున్నారు.

గచ్చిబౌలిలో ప్రేమోన్మాది ఘాతుకం

(మొదటిపేజి తరువాయి)

ఆమె పెండ్లికి నిరాకరిస్తూ కొంత కాలంగా అతన్ని దూరం పెట్టింది. వేరే వారితో సన్నిహితంగా ఉంటూ తనని దూరం పెడుతుందనే అనుమానం రాకేష్‌లో మొదలైంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి దీపన ఇంటికి వెళ్లిన రాకేష్.. ఆమెతో మరోసారి పెండ్లి ప్రస్తావన తీసుకువచ్చాడు. దాంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాకేష్ క్షణికావేశంలో అక్కడే ఉన్న కూరగాయల కత్తితో యువతిపై దాడి చేశాడు. దాడిని అడ్డుకోవడానికి దీపన తమాంగ్ ముగ్గురు స్నేహితులు ప్రయత్నించగా రాకేష్ వారిపై కూడా దాడికి యత్నించాడు. ఈ దాడిలో దీపన తమాంగ్ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతిచెందింది. ఆమె స్నేహితులకు సైతం గాయాలు కావడంతో వారికి ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

పారిపోయే ప్రయత్నంలో ఆత్మహత్యాయత్నం

కాగా యువతిని కత్తితో పొడిచి అనంతరం అక్కడి నుంచి పారిపోయిన రాకేష్..మెయినాబాద్ సమీపంలో కనకమామిడి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరెంట్ పోల్ ఎక్కడానికి ప్రయత్నించగా.. విద్యుద్ఘాతానికి గురై గాయలపాలయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాకేష్‌ను కనకమామిడి సమీపంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంబానీని దాటేసిన అదానీ

న్యూఢిల్లీ : భారత్‌లో అత్యంత కుబేరుడిగా గౌతం అదానీ నిలిచారు. ఇంతక్రితం ఈ స్థానంలో ఉన్న ముకేశ్ అంబానీ రెండో స్థానంలో ఉన్నారు. దేశంలో అత్యంత సంపన్నుల జాబితాను హురున్ ఇండియా గురువారం విడుదల చేసింది. అందులో 62 ఏండ్ల గౌతమ్ అదానీ రూ.11.6 లక్షల కోట్ల సంపదతో మొదటి స్థానంలో నిలిచారు. ముకేశ్ అంబానీ రూ.10.1 లక్షల కోట్ల సంపద కలిగి ఉన్నారు. ఈ జాబితాలో తొలిసారి బాలీవుడ్ స్టార్ షారుఖ్‌ఖాన్‌కు చోటు దక్కింది. రూ.7,300 కోట్ల ఆదాయాన్ని కలిగి ఉన్నారు. శివ్ నాడార్, కుటుంబం రూ.3.1 లక్షల కోట్లతో 3వ స్థానంలో, సైరస్ పునావాలా కుటుంబం రూ.2.89 లక్షల కోట్లు (4), దిలిప్ సింఘ్వీ రూ.2.49 లక్షల కోట్లు (5), కుమార్ మంగళం బిర్లా రూ.2.35 లక్షల కోట్లు (6), గోపిచంద్ హిందుజా కుటుంబం రూ.1.92 లక్షల కోట్లు (7), రాధాకిష్ణ దమాని రూ.1.90,900 కోట్లు (8), అజిమ్ ప్రేమ్‌జీ, కుటుంబం రూ.1.90,700 కోట్లు (9), నిరజ్ బజాజ్, కుటుంబం రూ.1.62 లక్షల కోట్లు (10) వరుస స్థానాల్లో నిలిచారు.

వరంగల్‌లో చెరువుల కబ్జా

కబ్జాదారుల కబంధ హస్తాల్లో వందల ఎకరాలు

- ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్ల ఖేఖాతర్‌
- చేతివాటం ప్రదర్శించి సహకరించిన అధికారులు
- తెరవెనుక పెద్దపెద్ద రాజకీయ నేతలు..?
- హైకోర్టు ఆదేశాలతో డిజిటల్‌ సర్వే చేపట్టిన 'కుడా'




నవతెలంగాణ-వరంగల్‌ ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్‌ వరంగల్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో చెరువులు, కుంటల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు వెలసి వందల ఎకరాల భూమి కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయింది. రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి భారీ అవినీతికి పాల్పడటం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్న ఆరోపణలున్నాయి. ఈ భూ మాఫియా వెనుక పెద్ద పెద్ద రాజకీయ నేతలున్నారు. ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్‌లను పట్టించుకోలేదు. మున్సిపల్‌, కుడా అధికారులు యథేచ్ఛగా అనుమతులిస్తూ పోయారు. దాంతో చెరువులు కుదించుకుపోయాయి. గొలుసుకట్టు చెరువులు సైతం అంతర్ధానమయ్యే పరిస్థితి దాపురించింది. భద్రకాళి, చిన్నవడ్డేపల్లి, బంధం చెరువు, కోట చెరువులు కబ్జాకు గురయ్యాయి. తాజాగా హైకోర్టు ఆదేశాలతో గ్రేటర్‌ వరంగల్‌ మున్సిపల్‌ అధికారులు ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్‌ పరిధిలో అక్రమంగా నిర్మించిన కాంపౌండ్‌ వాల్స్‌, షెడ్‌లు వేసుకున్న వారికి నోటీసులు ఇచ్చి ఎట్టకేలకు అందులో కొన్నింటిని కూల్చివేశారు. ఇందులో చాలా వరకు అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చలేకపోయారన్న విమర్శలు సైతం ఉన్నాయి. ఇదిలావుంటే తాజాగా 82 చెరువుల ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్‌ల గుర్తింపునకు నీటిపారుదల శాఖ అధికారులు డ్రోన్‌లతో డిజిటల్‌ సర్వే చేపట్టారు. ఈ సర్వే పూర్తయితే కాని గ్రేటర్‌ వరంగల్‌ పరిధిలో చెరువుల కింద ఉన్న అసలు భూమి, ఎంత కబ్జాకు గురైందనే లెక్కలు తేలే అవకాశం ఉంది.

కబ్జా కోరల్లో వందల ఎకరాలు

హన్మకొండ నగరంలోని భద్రకాళి చెరువు కింద 336.37 ఎకరాలుండాలి. సుమారు 70-100 ఎకరాల మేరకు కబ్జా అయినట్టు తెలుస్తుంది. చెరువుల పరిరక్షణ కమిటీ పేరిట పెరుమాళ్ల లక్ష్మణ్‌.. కొన్నేండ్లుగా చెరువుల కబ్జాలపై ఎప్పటికప్పుడు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ కమిటీ గతంలో తేల్చిన మేరకు భద్రకాళి చెరువు కింద 70 ఎకరాల మేరకు ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేశారని పేర్కొన్నారు. ఈ కమిటీ వరంగల్‌, హన్మకొండ జిల్లా కలెక్టర్లతోపాటు, గ్రేటర్‌ వరంగల్‌ మున్సిపల్‌ కమిషనర్‌కు సైతం ప్రతిసారి ఫిర్యాదులు చేస్తూనే ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వడ్డేపల్లి చెరువు కింద 324.03 ఎకరాలుండగా, ఇందులో 50 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. అక్రమంగా ఫంక్షన్‌ హాళ్ల నిర్మాణం జరిగింది. ఈ విషయంలో 'కుడా' ప్రేక్షక పాత్ర పోషించింది. నేరుగా బడా నేతలు రాజధాని నుండే అనుమతులు తీసుకొని నిర్మించారని 'కుడా' అధికారులే వెల్లడించడం గమనార్హం. వరంగల్‌ నగరం దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు కింద 100 ఎకరాలుండాల్సి ఉండగా, ఇందులో 30 ఎకరాల మేరకు కబ్జా అయ్యింది. వీవర్స్‌ కాలనీ, పద్మానగర్‌, 80 అడుగుల రోడ్డు నిర్మాణంలో ఈ చెరువు భూములు పోయాయి. కాజీపేట బంధం చెరువులో ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్‌ పరిధిలో పలువురు రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టాలు పొంది ఇండ్లను నిర్మించుకున్నారు. వీరందరికీ మున్సిపల్‌ అధికారులు ఇంటినెంబర్లు ఇవ్వడంతో ఆ ఇంటి నెంబర్ల పేరిట దర్జాగా రిజిస్ట్రేషన్లు చేసుకొని అనుభవిస్తున్నారు. వరంగల్‌ డీఆర్‌డీఓ కార్యాలయంతోపాటు, ప్రావిడెంట్‌ ఆఫీసు, పోలీసు ఫోరెన్సిక్‌ ల్యాబ్‌ భవనాలను సైతం ఇందులోనే నిర్మించడం గమనార్హం.

అప్పటి బీఆర్‌ఎస్‌ నేతల అనుచరులే..

వరంగల్‌ మట్టెవాడలోని కోట చెరువు కింద 159 ఎకరాలుండాల్సి ఉండగా, 50 ఎకరాలు కబ్జాకు గురైంది. బీఆర్‌ఎస్‌ కీలక నేత అనుచరులే ఇక్కడ కబ్జాదారులుగా అవతారమెత్తి అందినంత మేరకు ఆక్రమించినట్టు ఆరోపణలున్నాయి. ఎనుమాముల సాయి చెరువు కింద 11.37 ఎకరాలుండగా, ఈ చెరువు మొత్తం వరంగల్‌ నగరంలోని దేశాయిపేట, ఎనుమాములలోని తోళ్ల పరిశ్రమల వ్యర్థాలతో నిండిపోయి కాలుష్యంతో నిండిపోయింది. ఖిలా వరంగల్‌ మండలంలోని రంగశాయిపేట దామెర చెరువు కింద 134.03 ఎకరాలుండగా, ఇందులో 35 ఎకరాలు కబ్జాకు గురైంది. తిమ్మాపురం బెస్తం చెరువు కింద ఉన్న 105.30 ఎకరాల్లో 40 ఎకరాలు కబ్జా అయ్యింది. మత్తడిని సైతం ఆక్రమించి మరీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు కింద 21.24 ఎకరాలుండగా, ఇందులో 10 ఎకరాలు కబ్జాకు గురైంది. ప్రయివేటు వ్యక్తులు వాణిజ్య సముదాయాలను నిర్మించడం గమనార్హం.

కొనసాగుతున్న ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్‌ల సర్వే : హర్షవర్ధన్‌, డీఈ, ఇరిగేషన్‌, హన్మకొండ

గ్రేటర్‌ వరంగల్‌ నగరం పరిధిలోని 82 చెరువుల ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్‌ల నిర్ధారణకు డ్రోన్‌లతో సర్వే చేయడం ప్రారంభించాం. రెండు వారాల్లో ఈ సర్వే పూర్తి చేశాక, చెరువులు, కుంటల వాస్తవ పరిస్థితి తెలుతుంది. ఈ సర్వే ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదికను అందచేస్తాం.

'వాడ్రా' అమలు చేయాలి



హైదరాబాద్‌ నగరంలో 'హైడ్రా'ను అమలు చేస్తున్న విధంగా గ్రేటర్‌ వరంగల్‌ నగరంలో 'వాడ్రా' అమలు చేయాలి. నగరంలోని చెరువులు రియల్‌ మాఫియా చేతుల్లో అంతర్ధానమవుతున్నాయి. జిల్లాలకు వచ్చిన ప్రతి కలెక్టర్‌, మున్సిపల్‌ కమిషనర్‌లకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. హైకోర్టు ఆదేశాలతోనైనా 'వాడ్రా'ను అమలు చేసి అక్రమ నిర్మాణాలను తొలగించి వరంగల్‌ నగరంలోని చెరువులను పరిరక్షించాలి. మొక్కుబడిగా కాంపౌండ్‌ వాల్స్‌, షెడ్డులను తొలగించడం కాదని, బడా నేతలు, వారి అనుచరులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను సైతం తొలగించి చెరువులను కాపాడాలి.

- పెరుమాళ్ల లక్ష్మణ్‌, అధ్యక్షులు, చెరువుల పరిరక్షణ సొసైటీ, వరంగల్‌

పెసర కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

- మార్క్‌ఫెడ్‌కు మంత్రి తుమ్మల ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్‌

రాష్ట్రంలో పెసర కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్క్‌ఫెడ్‌ అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత వానాకాలంలో 64,175 ఎకరాల్లో పెసర పంట సాగయిందనీ, 17,841 మెట్రిక్‌ టన్నుల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రస్తుతానికి 12 ప్రాంతాల్లో పంట కోతకు వచ్చిందని పేర్కొన్నారు. పెసర పంట అమ్మకానికి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌ బాబు
ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

క్రీడారంగంలో గుణాత్మక మార్పు!



నవతెలంగాణ-హైదరాబాద్‌

క్రీడాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, క్రీడా రంగంలో గుణాత్మక మార్పు తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలగా ఉన్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌ బాబు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో హాకీ దిగ్గజం మేజర్‌ ధ్యాన్‌చంద్‌ విగ్రహానికి పూలమాల వేసి ఆవిష్కరించిన అనంతరం స్మారక హాకీ మ్యాచ్‌ను ఆరంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌ బాబు మాట్లాడుతూ.. ' అన్ని రంగాల్లోనూ మార్పు సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే క్రీడా రంగంలో గుణాత్మక మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పని చేస్తున్నాం. రాష్ట్ర బడ్జెట్‌లోనూ కనీవినీ ఎరుగని రీతిలో క్రీడలకు అగ్ర తాంబూలం అందించాం. యంగ్‌ ఇండియా స్పోర్ట్స్‌ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణలో క్రీడలను అంచెలంచెలుగా అభివద్ధి చేయాలని అనుకుంటున్నాం. దేశంలో ఏ రాష్ట్రం చేయని స్థాయిలో జాతీయ క్రీడా దినోత్సవం జరుపుతున్నాం. రాబోయే రోజుల్లో తెలంగాణ వేదికగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించనున్నాం. తెలంగాణ క్రీడా శాఖ పనితీరును సైతం ద్విగుణీకతం చేస్తామని ' తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రాజ్‌ ఠాకూర్‌, శాట్జ్‌ చైర్మన్‌ శివసేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు మంత్రులు బహుమతులు ప్రదానం చేశారు.

ఒలింపియన్లకు సత్కారం : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి పారిస్‌ 2024 ఒలింపిక్స్‌లో పోటీపడిన అథ్లెట్లను రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకంతో సత్కరించింది. పసిడి ఫేవరేట్‌గా పారిస్‌కు వెళ్లిన స్టార్‌ బాక్సర్‌, రెండు సార్లు వరల్డ్‌ చాంపియన్‌ నిఖత్‌ జరీన్‌ అనూహ్య రీతిలో మెడల్‌ లేకుండా నిష్క్రమించగా... యువ షూటర్‌ ఇషా సింగ్‌ సైతం మెడల్‌ ఆశలు రేపినా ఒత్తిడిలో అంచనాలను అందుకోలేదు. ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన నిఖత్‌ జరీన్‌, ఇషా సింగ్‌లకు రూ. 5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు.

ఆరంభం అదిరింది

- అట్టహాసంగా పారాలింపిక్స్‌ ఆరంభ వేడుకలు
- పారిస్‌లో మొదలైన పారా విశ్వ సంబురం



నవతెలంగాణ-పారిస్‌ : 167 దేశాల నుంచి 4000 మందికి పైగా వైకల్యానికి ఎదురించి నిలిచిన పారా అథ్లెట్లు పోటీపడేందుకు వేదిక సిద్ధమైంది. 2024 పారిస్‌ పారాలింపిక్స్‌ క్రీడల ఆరంభ వేడుకలు బుధవారం అట్టహాసంగా (భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి అనంతరం) జరిగాయి. పారా క్రీడాకారులు పోటీపడే విశ్వ క్రీడల ఆరంభ వేడుకల్లోనూ దివ్యాంగ కళాకారులే నత్య రూపాలు ప్రదర్శించటం హైలైట్‌గా నిలిచింది. అథ్లెట్‌ పరేడ్‌లో ఫ్రెంచ్‌ అక్షరమాల ప్రకారం అన్ని దేశాల అథ్లెట్ల బందాలు వచ్చాయి. భారత బందానికి అమిత్‌ (జావెలియన్‌ త్రో), భాగ్య శ్రీ (షాట్‌ పుట్‌) సారథ్యం వహించారు. అమిత్‌, భాగ్య శ్రీ భారత పతాకధారులుగా వ్యవహరించి అథ్లెట్‌ పరేడ్‌లో మువ్వెన్నల జెండాను రెపరెపలాడించారు. పారిస్‌ పారాలింపిక్స్‌లో భారత్‌ జంబో జట్టును బరిలోకి దింపింది. 84 మంది క్రీడాకారులు 12 క్రీడాంశాల్లో పతక వేటకు సిద్ధమయ్యారు. పారిస్‌ పారాలింపిక్స్‌లో 24 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. పారా సైక్లింగ్‌, పారా జూడోలను తొలిసారి పారిస్‌ పారాలింపిక్స్‌లో చేర్చారు. 2024 సమ్మర్‌ ఒలింపిక్స్‌ తరహాలోనే పారాలింపిక్స్‌ ఆరంభ వేడుకలు సంప్రదాయానికి భిన్నంగా స్టేడియం ఆవల అట్టహాసంగా సాగింది.

శీతల్‌కు రెండో స్థానం :

పారాలింపిక్స్‌లో భారత పతక వేట మొదలైంది. పారా ఆర్చర్‌, పసిడి పతక ఫేవరేట్‌ శీతల్‌ దేవి తొలి రోజు ర్యాంకింగ్‌ ఈవెంట్‌లో అదరగొట్టింది. మహిళల రికర్వ్‌ వ్యక్తిగత విభాగంలో శీతల్‌ దేవి 703 పాయింట్లు సాధించగా.. టర్కీ పారా ఆర్చర్‌ 704 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడిన మరో భారత పారా ఆర్చర్‌ సరిత తొమ్మిదో ర్యాంక్‌ సాధించింది. ర్యాంకింగ్‌ రౌండ్‌లో ప్రదర్శన ఆధారంగా ప్రధాన డ్రా ప్రత్యర్థులను నిర్ణయిస్తారు.

నవచిత్రం

యూనిక్‌ పాయింట్‌



శ్రీవిష్ణు, టీజీ విశ్వప్రసాద్‌, హసిత్‌ గోలీ

హీరో శ్రీవిష్ణు 'రాజ రాజ చోరా' తర్వాత డైరెక్టర్‌ హసిత్‌ గోలీతో చేస్తున్న రెండవ సినిమా 'శ్వాగ్‌'. పీపుల్‌ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్‌ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్‌ గురువారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ, 'టీజర్‌ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి కథ నాకు ఇచ్చిన హసిత్‌కి చాలా థ్యాంక్స్‌. చాలా గొప్ప కథ. ఇండియన్‌ స్క్రీన్‌లో ఇప్పటివరకూ రాలేదు. ఇది మన అందరి ఇళ్ళలో ఉన్న పాయింటే అయినా స్క్రీన్‌ పైకి ఇప్పటివరకూ రాలేదు. ఇలాంటి కంటెంట్‌ని సినిమా చేయడానికి ముందుకువచ్చిన నిర్మాత విశ్వప్రసాద్‌ ధన్యవాదాలు' అని తెలిపారు.

'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి 'రాజ రాజ చోర' సినిమా చేశాం. వీరి కాంబోలో ఇది మా సెకండ్‌ మూవీ. ఇది కంటెంట్‌ డ్రివెన్‌ వెరైటీ మూవీ. కమల్‌ హసన్‌ 'ఇంద్రుడు చంద్రుడు' లాంటి సినిమాలు చూసిన ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుంది' అని నిర్మాత టి.జి. విశ్వ ప్రసాద్‌ చెప్పారు. డైరెక్టర్‌ హసిత్‌ గోలి మాట్లాడుతూ,'తాతలు ముత్తాతలతో పాటు చూడగలిగే సినిమా. విష్ణు తన క్యారెక్టర్‌ని అద్భుతంగా చేశారు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని అన్నారు.

ఉద్వేగభరిత కోర్ట్‌ రూమ్‌ డ్రామా



కళా సృష్టి ఇంటర్నేషనల్‌, మణి దీప్‌ ఎంటర్‌టైన్మెంట్‌ బ్యానర్‌పై మహి పాల్‌ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉద్వేగం'.

ఫస్ట్‌ కేసు అనేది ట్యాగ్‌లైన్‌. శంకర్‌ ఉలకలపుమధు నిర్మాత. త్రిగుణ్‌ ప్రాధాన పాత్రలో, శ్రీకాంత్‌ అయ్యంగార్‌ విభిన్న పాత్రలో నటిస్తున్న ఈ చిత్ర టీజర్‌ డైరెక్టర్‌ రామ్‌ గోపాల్‌ వర్మ చేతుల మీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా రామ్‌ గోపాల్‌ వర్మ మాట్లాడుతూ,'కోర్టు రూమ్‌ డ్రామాతో తెలుగులోచాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ట్రైలర్‌ చూసిన తరువాత చాలా సిన్సియర్‌ అటెంప్ట్‌ అనిపించింది. చాలా సహజంగా యాక్ట్‌ చేశారు.ఈ చిత్రం కచ్చితంగా తెలుగు పరిశ్రమలో వండర్‌ క్రియేట్‌ చేస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

'కోర్టు రూమ్‌ డ్రామాల్లో మంచి సస్పెన్స్‌ ఉంటుంది. తెలుగులో వచ్చిన 'వకీల్‌ సాబ్‌' చిత్రం తరువాత అంత డ్రామా, సస్పెన్స్‌ ఉన్న చిత్రమే కాదు, చట్టాన్ని బేస్‌ చేసుకుని తెరకెక్కుతున్న చిత్రం కావడంతో ప్రేక్షకులకు ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు నాలెడ్జ్‌ కూడా అందిస్తుందని టీజర్‌ చెప్పకనే చెప్పింది' అని చిత్రయూనిట్‌ తెలిపింది.

ఓహ్‌.. టీజర్‌ రిలీజ్‌



జీవిత బడుగు సమర్పణలో ఏకారి ఫిలిమ్స్‌ పతాకంపై రఘు రామ్‌ హీరోగా, శృతి శెట్టి, నైనా పాఠక్‌ హీరోయిన్స్‌గా సత్యనారాయణ ఏకారి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఓహ్‌!'.

కులుమనాలి, ఆగ్రా, గోవా, హైదరాబాద్‌, వరంగల్‌లోని అందమైన ప్రదేశాలలో షూటింగ్‌ పూర్తి చేసుకుని, విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా చిత్ర టీజర్‌ ఆవిష్కరణ వేడుక ఇటీవల ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన గేయ రచయిత భాష్య శ్రీ టీజర్‌ను లాంచ్‌ చేశారు. చిత్ర సమర్పకురాలు బిఆర్‌ఆర్‌ గ్రూప్స్‌ అధినేత్రి జీవిత బడుగు మాట్లాడుతూ, 'మంచి క్వాలిటీతో ఈ సినిమాని ప్రేక్షకులకు అందిస్తున్నాం' అని అన్నారు.

'ఐదు చిత్రాలను నిర్మించిన అనుభవంతో ఒక కొత్త జోనర్‌లో, క్రోమో ఫోబియాని పాయింట్‌గా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని దర్శక, నిర్మాత సత్యనారాయణ ఏకారి చెప్పారు.

అరుదైన వేడుకకు ఆహ్వానం



నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెప్టెంబర్‌ 1న హైదరాబాద్‌ హైటెక్స్‌ నోవటెల్‌ హోటల్లో తెలుగు సినీ పరిశ్రమ ఆధ్వర్యంలో గ్రాండ్‌గా సెలబ్రేషన్స్‌ని ప్లాన్‌ చేశారు. ఇలాంటి అరుదైన వేడుకకు జాతీయ అవార్డు గ్రహీత, హీరో అల్లు అర్జున్‌ని తెలుగు సినీ ఇండస్ట్రీ తరఫున ఫిలిం ఛాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ప్రెసిడెంట్‌ భరత్‌ భూషణ్‌, ఫిలిం ఛాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ సెక్రటరీ దామోదర ప్రసాద్‌, నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్‌, తెలంగాణ స్టేట్‌ ఛాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ సెక్రెటరీ అనుపమ రెడ్డి, 'మా' అసోసియేషన్‌ నుంచి మాదాల రవి, శివ బాలాజీ, నిర్మాత ముత్యాల రామదాసు తదితరులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలకృష్ణతో తనకి ఉన్న అనుబంధం గురించి వీరితో అల్లుఅర్జున్‌ షేర్‌ చేసుకున్నారు.

అలాగే ఈ వేడుకకు తమిళం, మలయాళం, కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు సైతం హాజరు కాబోతున్నారు. హీరోలు శివరాజ్‌ కుమార్‌, విజయసేతుపతి, శివ కార్తికేయన్‌, కిచ్చ సుదీప్‌, దునియా విజయ్‌, దర్శకులు పి.వాసు, నటుడు నాజర్‌, నిర్మాత రాక్‌ లైన్‌ వెంకటేష్‌, అలనాటి కథానాయికలు సుహాసిని, మీనా, మాలా శ్రీ, సుమలత తదితరులకు దామోదరప్రసాద్‌, సి.కళ్యాణ్‌ ఆహ్వాన పత్రికను అందజేశారు.

1980 నేపథ్యంలో..

ఎన్టీఆర్‌ ముని మనవడు, హరికృష్ణ మనవడు, జానకిరామ్‌ తనయుడు నందమూరి తారక రామారావు సినీ రంగంలోకి అడుగిడు తున్నారు. ఈ చిత్రంలో తెలుగమ్మాయి వీణరావ్‌ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

డైరెక్టర్‌ వైవిఎస్‌ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని న్యూ టాలెంట్‌ రోర్స్‌ ఏ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. నాగార్జున బర్త్‌డే, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డైరెక్టర్‌ వైవిఎస్‌ చౌదరి మీడియాతో మాట్లాడుతూ,'1980లో జరగబోయే ఈ కథలో బలీయమైన తెలుగు భాష, సంస్కృతి, తెలుగు జాతి నేపథ్యం ఉంది. తెలుగు భాషా, సంస్కృతి, విలువలు గురించి చెప్పాలని ఎప్పటినుంచో భావిస్తున్నాను. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలతో అన్నీ కుదిరిన కథ ఇది. ఇందులో కొన్ని సన్నివేశాల్లో భావోద్వేగాలని పద్యరూపంలో కూడా నటీనటులు వ్యక్తం చేస్తారు. ఇది తెలుగు భాషకు ఇస్తున్న ఒక జ్ఞాపిక లాంటి ప్రక్రియ' అని అన్నారు.

కుబేరలో కీలక పాత్ర



ధనుష్‌, నాగార్జున, డైరెక్టర్‌ శేఖర్‌ కమ్ముల కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్‌ ఇండియా చిత్రం 'కుబేర'. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా మేకర్స్‌ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

శ్రీ వెంకటేశ్వర సినిమాస్‌ ఎల్‌ఎల్‌పి, అమిగోస్‌ క్రియేషన్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌పై సునీల్‌ నారంగ్‌, పుస్కుర్‌ రామ్‌ మోహన్‌ రావు హై బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతోంది.

కూలీలో సైమన్‌గా నాగ్‌

రజనీకాంత్‌ తాజాగా లోకేష్‌ కనగరాజ్‌ దర్శకత్వంలో 'కూలీ' సినిమా చేస్తున్నారు. సన్‌ పిక్చర్స్‌ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో సైమన్‌ అనే పవర్‌ఫుల్‌ పాత్రలో నాగార్జున నటిస్తున్నారు. నాగార్జున్‌ బర్త్‌డే సందర్భంగా రిలీజ్‌ చేసిన సైమన్‌గా నాగార్జున లుక్‌ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.